వాసుదేవ్
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
30-1-2026 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 359 పేజీలు: 10+4 వెల: 6.50

ప్రపంచానికి భారత్ ఆశాకిరణం: ప్రధాని మోదీ
అజిత్ ప్రమాదం కేసు: బ్లాక్‌బాక్స్ స్వాధీనం 3

## 2008ని మించే సంక్షోభం!

భారత్ ఆర్థిక మూలాలను పరిరక్షించుకోవాలి

తాజా ఆర్థిక సర్వే విడుదల చేసిన కేంద్ర మంత్రి సీతారామన్

# ఎఐతో ప్రమాదకర ఫలితాలు!



**న్యూఢిల్లీ, జనవరి 29:** సాంకేతిక రంగంలో కృత్రిమమేధ సంచలనాలు సృష్టిస్తోంది. దానిలో భారీ మార్పులు చోటుచేసుకుంటే.. 2008 ఆర్థిక సంక్షోభం కంటే దారుణమైన పరిస్థితులు ఎదురుకావొచ్చని ఆర్థిక సర్వే పేర్కొంది. భారత ఐటి ఆధారిత వైట్‌కాలర్ ఉద్యోగాలకు ప్రత్యక్ష ముప్పు ఉంటుందని హెచ్చరించింది. ఈ పరిస్థితులు ఎదురయ్యే అవకాశాలు 10 శాతం నుంచి 20 శాతం మేర ఉండొచ్చని.. అయితే, దాని తాలూకూ ప్రభావం మాత్రం తీవ్రస్థాయిలో ఉంటుందని వెల్లడించింది. 'భారత్‌లో ఐటీ రంగం వైట్‌కాలర్ ఉద్యోగాల్లో కీలకమైంది. ఎఐ ప్రవేశంతో ఈ రంగంపై తీవ్ర ప్రభావాలు ఉండొచ్చు. అయితే రాత్రికి రాత్రే ఈ ఉద్యోగాలు పోవు. కానీ ఉపాధి అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. కొన్ని విభాగాల్లో ఉద్యోగాలను ఎఐ భర్తీ చేస్తోంది' అని సర్వే పేర్కొంది. విదేశీ సంస్థలకు భారత్ నుంచి తక్కువ వేతనంతో ఐటీ సేవలు అందుతున్నాయి. ఇప్పుడు అవే >>2



గురువారం మేడారంలో సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద దర్శనానికి పోటెత్తిన అశేష భక్తజనం

# గద్దెపైకి సమ్మక్క

వనదేవత నామస్మరణతో మార్మోగిన మేడారం

పసుపు కుంకుమలే ఆ తల్లి రూపం

మహాజాతరకు పోటెత్తిన భక్తజనం

అమ్మవార్లను దర్శించిన కేంద్రమంత్రులు జోయల్ ఓరం, కిషన్‌రెడ్డి, డి.సిఎం భట్టి, మంత్రులు పొంగులేటి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి ప్రభృతులు



మేడారంలో గురువారం సమ్మక్కను గద్దెల వద్దకు తరలిస్తున్న పూజారులు

**ములుగు జిల్లా బ్యూరో ప్రభాతవార్త:** దక్షిణ భారత కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిన మేడారంలో ఇప్పటికే గద్దెపై సారలమ్మ, గోవిందరాజులు, పగిడిద్దరాజు కొలువు దీరగా >>2

ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక పరిణామం

# కెసిఆర్‌కు సిట్ నోటీసులు



## ఎన్నికలతో బిజీ.. ఆ తర్వాతే విచారణ: కెసిఆర్ రిప్లై

నేటి విచారణకు హాజరు కాలేనన్న మాజీ ముఖ్యమంత్రి

జూబ్లీహిల్స్ ఎసిపికి రెండు పేజీల లేఖ

గడువు ఇచ్చేందుకు సిట్ ఓకే, నేడు నిర్ణయించే అవకాశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి29:** ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులపై మాజీ సిఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు స్పందించారు. సిట్ అధికారులు నోటీసులో పేర్కొన్న రోజున తాను విచారణకు హాజరు కాలేనని ఆయన తెలిపారు. నందినగర్‌లోని తన నివాసంలో అధికారులు నోటీసులు ఇవ్వడంపై గులాబీ అధినేత ప్రత్యుత్తరం రాశారు. శుక్రవారం విచారణ కుదరని ఆయన పోలీసులకు వివరించారు. అంతేకాదు తనను ఎర్రవల్లిలోనే మరోరోజు విచారణ చేయాలని కేసీఆర్ లేఖలో పేర్కొన్నారు. సిట్ అధికారులు గురువారం తనకు నోటీసులు జారీ చేయడంపై కేసీఆర్ సానుకూలంగా స్పందించారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు నందినగర్‌లోని నివాసంలో అందుబాటులో ఉండాలని వారు కోరారు. అయితే.. మున్సిపల్ ఎన్నికల నామినేషన్లకు శుక్రవారమే ఆఖరు తేదీ కావడంతో.. అభ్యర్థులను ఖరారు చేయడంలో తాను బిజీగా ఉన్నానని విచారణను మరోరోజు జరపాల్సిందిగా కేసీఆర్ పోలీసులకు తెలిపారు. జూబ్లిహిల్స్ ఏసీపీ పి.వెంకటగిరికి శుక్రవారం తాను హాజరు కాలేకపోవడానికి గల కారణాలను వివరిస్తూ కెసిఆర్ రెండు పేజీల లేఖ రాశారు. సెక్షన్ 160 సీఆర్పీసీ ప్రకారం మరో రోజున తనను ఎర్రవల్లిలోని నివాసంలో విచారించాలి. అంతేకాదు ఈ సెక్షన్‌లోని నిబంధనల >>2

# కొండెక్కిన వెండి

ఒకే రోజు రూ.21 వేలుపైగా పెరుగుదల



**ముంబయి, జనవరి 29:** బంగారం, వెండి ధరలు ర్యాలీ మరింత వేగంగా దూసుకుపోతున్నాయి. గురువారం, బంగారం వెండి ధరలు ఊహించని రీతిలో పెరిగాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసిఎక్స్)లో వెండి తొలిసారిగా కిలోకు 4 లక్షల రూపాయలు దాటింది. బంగారం సైతం 10 గ్రాములకు 1.8 లక్షల రూపాయలకు చేరింది. దీనికి ప్రధాన కారణాలు ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో పెరుగుతున్న భయాలు, రాజకీయ ఒత్తిడుల కారణంగా ధరలు కొండెక్కుతున్నాయి. ఎంసిఎక్స్‌లో ఫిబ్రవరి 5, 2026కి ముగిసే బంగారం కాంట్రాక్టు ధర 6 శాతంపెరిగింది. 10 గ్రాములకు గానూ >>2

మరో 12 వేలు పెరిగిన బంగారం



## ఏజెన్సీల అభివృద్ధికి.. రూ.24 వేల కోట్లతో ప్రణాళిక

కేంద్ర మంత్రి జోయల్

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాత వార్త:** దేశవ్యాప్తంగా 20 వేల గిరిజన గ్రామాల అభివృద్ధికి రూ. 24 వేల కోట్లతో ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జోయల్ ఓరం వెల్లడించారు. మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశ పురోగతిలో పది కోట్ల మందికి పైగా ఉన్న ఆదివాసీలు, గిరిజనులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు.



బారామతిలోని విద్యాప్రతిష్ఠాన్ మైదానంలో గురువారం అజిత్‌పవార్ అంత్యక్రియలలో నివాళులు అర్పిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా 2

# అజిత్‌కు కన్నీటి వీడ్కోలు

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

# డేంజర్ 'మేడిగడ్డ'

## కేటగిరి-1 ప్రమాదకర బ్యారేజ్.. కేంద్రం రెడ్ అలర్ట్

గత వర్షాకాలంలో ప్రాజెక్టు లోపాలు గుర్తింపు

సత్వరమే వాటిని పరిష్కరించాలని హెచ్చరిక



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి29:** తెలంగాణ రాష్ట్రంలోని మేడిగడ్డ డ్యామ్ అత్యంత ప్రమాదకరస్థితిలో ఉంద`ని కేంద్ర జల్‌శక్తి శాఖ వెల్లడించింది. డ్యామ్‌ల భద్రతపై టీడీపీ ఎంపీలు లక్ష్మీనారాయణ, శబరి పార్లమెంటులో అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. ఈ క్రమంలో మేడిగడ్డతో పాటు దేశంలోని వివిధ ప్రాజెక్టులపై కీలక సమాధానం ఇచ్చింది. తెలంగాణలోని మేడిగడ్డ(లక్ష్మీ) బ్యారేజ్ భద్రతపై కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ వేదికగా తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తూ దీనిని అత్యంత ప్రమాదకరమైన 'కేటగిరి-1' డ్యామ్‌గా ప్రకటించింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఏ) నిర్వహించిన 2025 వర్షాకాలం అనంతరం తనిఖీల్లో ఈ ప్రాజెక్టులో అత్యంత తీవ్రమైన లోపాలు ఉన్నట్లు తేలిందని, వీటిని తక్షణమే సరిదిద్దకపోతే బ్యారేజీ విఫలమయ్యే ప్రమాదం ఉందని కేంద్రం స్పష్టం చేసింది. దేశ వ్యాప్తంగా గుర్తించిన మూడు అత్యంత సమస్యాత్మక ప్రాజెక్టులలో మేడిగడ్డ ఒకటిగాఉంది. ఈ నేపథ్యంలో మేడిగడ్డ బ్యారేజ్ పటిష్టతను కాపాడేందుకు ఎన్‌డిఎస్‌ఏ సిఫార్సు చేసిన వివిధ నివారణ, ఉపశమన చర్యలను తక్షణమే అమలు చేయాలని కేంద్ర జలశక్తి శాఖ తెలంగాణ రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది. ఉత్తర ప్రదేశ్‌లోని లోయర్ ఖజూరీ డ్యామ్,జారండ్‌లోని బొకారో బ్యారేజ్ వంటి ఇతర కేటగిరి-1 ప్రాజెక్టులను కేంద్రం తన డిఆర్ఐపి-2 పథకం ద్వారా పునరావాస పనుల్లో చేర్చగా, మేడిగడ్డ విషయంలో తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని బాధ్యతను రాష్ట్రానికి సూచించింది. ప్రాజెక్టు భద్రతను నిర్ధారించడానికి, సంబంధిత విపత్తులను నివారించడానికి తక్షణ చర్యలు అవసరమని కేంద్రం తన నివేదికలో పేర్కొంది. దేశంలో 50 ఏళ్లకు పైబడిన డ్యామ్‌లు 1,681 ఉన్నాయని జల్‌శక్తి శాఖ తెలిపింది. గత సంవత్సరం వర్షాకాలం కంటే ముందు6,524 డ్యామ్‌లు తనిఖీ చేశామని కేంద్రం >>2



యాదగిరిగుట్ట ఆలయంలో

## బంగారం, వెండి డాలర్లు మాయం

ఆడిట్‌లో బయటపడ్డ దోపిడీ

ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు

ఆలయంలో వెలుగులోకి వస్తున్న అవకతవకలు

**యాదాద్రి భువనగిరి బ్యూరో, ప్రభాతవార్త:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రం మరోసారి వివాదాల్లో చిక్కుకుంది. భక్తుల భక్తి, నమ్మకంతో కూడిన విరాళాలపై కన్నేసిన అక్రమాలకు ఇది పరాకాష్టగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రచార శాఖలో విక్రయానికి ఉంచిన బంగారు, వెండి డాలర్లు మాయమైన ఘటన ఆలయ ప్రతిష్ఠను తీవ్రంగా దెబ్బతీసింది. భక్తులు మొక్కులు చెల్లించుకుంటూ కొనుగోలు చేసే బంగారు, వెండి డాలర్లు సుమారు ఏడాది క్రితమే మాయమైనప్పటికీ, ఈ విషయం తాజాగా ఆడిట్ అధికారుల తనిఖీల్లో బయటపడటం కలకలం రేపుతోంది. మాయమైన డాలర్ల విలువ సుమారు రూ.10లక్షల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇటీవల స్వామివారి లడ్డూ ప్రసాదంలో చింతపండు చోరీ ఘటన ఆలయ వ్యవస్థపై ఇప్పటికే అనుమానాలు రేకెత్తించింది. ఆ ఘటన మరువకముందే, ఇప్పుడు బంగారు,వెండి డాలర్ల మాయం వెలుగులోకి రావడం దేవస్థానంలో అంతర్గతంగా జరుగుతున్న అవకతవకలకు నిదర్శనంగా మారిందన్న ఆరోపణలు >>2

## మామునూరు ఎయిర్‌పోర్టు భూసేకరణ పూర్తి

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు పత్రాలను అప్పగించిన డి.సిఎం భట్టి



గురువారం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి రామ్మోహన్‌కు పత్రాలను అప్పగిస్తున్న డి.సిఎం భట్టి. చిత్రంలో మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి29:** వరంగల్ మామునూరు విమానాశ్రయ అభివృద్ధి కోసం చేపట్టిన భూసేకరణ ప్రక్రియను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా పూర్తి చేసింది. సేకరించిన భూములను గురువారం బేగంపేట్ విమానాశ్రయంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి రామ్ మోహన్ నాయుడుకు అధికారికంగా అప్పగించారు. ఈ భూముల అప్పగింత కార్యక్రమానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, ఎమ్మెల్సీ బండా ప్రకాష్, ప్రభుత్వ సలహాదారు వేమ్ నరేందర్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ విమానయాన విభాగం డైరెక్టర్ భారత్ రెడ్డి హాజరయ్యారు. అలాగే రవాణా,రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రోడ్లు, భవనాలు, రవాణా శాఖల సీనియర్ అధికారులు, భారత విమానాశ్రయాల అథారిటీ అధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి రామ్‌మోహన్ నాయుడు మాట్లాడుతూ, దేశంలో ప్రాంతీయ వైమానిక అనుసంధానాన్ని విస్తృతంగా పెంచుతూ సామాన్య ప్రజలకు విమాన ప్రయాణాన్ని సులభతరం చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మామునూరు విమానాశ్రయాన్ని త్వరితగతిన కార్యాచరణలోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. భూసేకరణను సమయపాలనతో, సమర్థవంతంగా పూర్తి చేసినందుకు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆయన అభినందించారు. భూముల అప్పగింత అనంతరం మామునూరు విమానాశ్రయ అభివృద్ధి వ్యయం మొత్తాన్ని భారత విమానాశ్రయాల అథారిటీ భరిస్తుందని తెలిపారు. ప్రతిపాదిత ప్రాజెక్టులో 2,500 మీటర్ల రన్‌వే, టెర్మినల్ భవనం, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటిసి) టవర్, అగ్నిమాపక, భద్రతా సదుపాయాలు, అనుబంధ మౌలిక వసతుల >>2



అమెరికాలోని హార్వర్డ్ వర్సిటీ విద్యార్థులతో సిఎం రేవంత్‌రెడ్డి

## హార్వర్డ్ విద్యార్థులు తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లు కావాలి

బిజినెస్ స్కూలు స్టూడెంట్లతో సిఎం రేవంత్‌రెడ్డి ఇష్టాగోష్టి 2

ఖర్గే, రాహుల్‌తో శశిథరూర్ భేటీ 5



బారామతిలోని విద్యాప్రతిష్ఠాన్ మైదానంలో గురువారం అజిత్‌పవార్ అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు

# అజిత్‌కు కన్నీటి వీడ్కోలు

## ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

### హాజరైన కేంద్రమంత్రులు అమిత్‌షా, గడ్కరీ, సిఎంలు ఫడ్నవిస్, ప్రమోద్ సావంత్, ఎపి మంత్రులు లోకేష్, అనగాని ప్రభృతులు

**బారామతి, జనవరి 29:** విమాన ప్రమాదంలో దుర్మరణం పాలయిన మహారాష్ట్ర డిప్యూటి సిఎం అజిత్‌పవార్ అంత్యక్రియలు గురువారం ప్రభుత్వ లాంఛనాలతో ముగిసాయి. ఎన్సీపి సీనియర్ నాయకుడికి విద్యాప్రతిష్టాన్ మైదానంలో పెద్దకుమారుడు పార్థ్‌పవార్ అజిత్ చితికి నిప్పంటించి అంత్యక్రియలు ముగించారు. అంతకుముందు సాయుధ పోలీసులు మూడు పర్యాయాలు గాలిలోకి కాల్పులుజరిపి గౌరవ వందనం చేసారు. మధ్యాహ్నం 12 గంటలకు వేలాదిమంది కార్యకర్తలు, సీనియర్ నాయకులు పలు పార్టీల నాయకులు మంత్రులు హాజరు అయ్యారు. అజిత్‌దాదా అమర్‌రహే అంటూ మైదానంలో అభిమానుల నినాదాలు మిన్నంటాయి. ఎకచ్‌వాదా అజిత్ దాదా అంటూ డిప్యూటి సీఎంకు తుది వీడ్కోలు పలికారు. అంతకుముందు ఉదయం నుంచి కాటేవాడిలోని అజిత్‌నివాసంలో సందర్శకులకోసం ఆయన భౌతికకాయాన్ని ఉంచారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఇతర రాష్ట్రాల నుంచి పలువురు నాయకులు అభిమానులు తమ నాయకుడిని కడసారి చూసేందుకు తండోప తండాలుగా తరలివచ్చారు. మాజీ సీఎం ఉద్ధవ్‌థాకరే, ఎంఎన్ఎస్ చీఫ్ రాజథాకరేలు కుటుంబ సభ్యులను పరామర్శించి భార్య సునేత్ర పవార్‌ను ఓదార్చారు. ఎన్సీపీ వృద్ధనేత శరద్‌పవార్‌తో పాటు కేంద్రహోం మంత్రి అమిత్‌షా, మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవిస్, డిప్యూటి సిఎం ఏక్‌నాథ్ షిండే, కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ, గోవా సీఎం ప్రమోద్‌సావంత్, ఎపి మంత్రులు లోకేష్, అనగాని సత్యప్రసాద్ తదితరులు ఉన్నారు. పరిపాలనపై ఎంతో పట్టు ఉన్న నాయకుడుగాను, నిర్మొహమాటంగా మాట్లాడే నేతగాను ఆయనకు ఎంతోపేరుంది. విద్యాత్రిష్టాన్‌లో ఉవ్వెత్తున ఎగిసి పడిన అంత్య క్రియల జ్వాలల్లో అజిత్ ప్రస్థానం ముగిసిపోగా మరోవైపు పార్టీ భవిష్యత్తు ప్రణాళికపై చర్చలు ఊపందుకోవడం గమనార్హం.

# కొండెక్కిన వెండి

>> 1,75,869 రూపాయలకు చేరింది. మార్చ్ 5, 2026కి ముగిసే వెండి ధర 5శాతం పెరిగి 4,00,780 రూపాయలకు వచ్చింది. ప్రధాన కారణం అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచకూడదని నిర్ణయించడమని నిపుణులు చెబుతున్నారు. రాజకీయ పరిణామాలు కూడా ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై హెచ్చరికలు చేశారు. న్యూక్లియర్ చర్చలు నిలిచిపోయాయని, సమయం ముగుస్తోంది" అని చెప్పారు. గల్ఫ్ ప్రాంతంలో భారీ సైనిక నియామకాలు చేస్తున్నట్టు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం, వెండి రికార్డ్ స్థాయిలకు చేరాయి. స్పాట్ బంగారం ఒక్కరోజులో 3 పెరిగి 5,591.61 ఒకౌన్స్‌కి చేరింది. వెండి ఒక్కసారిగా 119.34 ఒకౌన్స్‌కి చేరి, తర్వాత 118.061 వద్ద స్థిరపడింది. మార్కెట్ విశ్లేషకుల వివరాల ప్రకారం వెండి బంగారం కంటే తక్కువకు లభిస్తుంది. దీంతో కొందరు పెట్టుబడిదారులు ట్రెండ్‌ను అనుసరించి వెండిని ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఈ అంశంపై మరికొన్ని రోజులలో బంగారం, వెండి ధరల్లో మార్పులు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని చెప్పారు. డాలర్ ఇండెక్స్, అమెరికా ఉద్యోగ గణాంకాలు, రాజకీయ ఉద్రిక్తతలతో ఇది ప్రభావితమవుతుంది. దేశీయంగా బంగారం రూ. 1,61,600-1,64,000 మద్దతు వద్ద నిలుస్తుందన్న అంచనాలు న్నాయి. వెండిధరల్లో కూడా రూ. 3,64,800-3,74,000 మద్దతురావచ్చని అంచనా ఉంది. ఒక్కరోజులోనే 24 క్యారెట్ల బంగారంధరలు కొన్ని గంటలకే రూ.12వేలు పెరిగింది. కిలో వెండి కూడా ఏకంగా రూ.21వేలు పెరిగినట్లు అంచనా. ఫ్యూచర్స్‌లోకూడా ఇదే తీరు కొనసాగింది. గ్లోబల్ స్పాట్ మార్కెట్లలోకూడా బంగారం వెండిధరలు భారీగా పెరుగుతున్నాయి.

# ఎఐతో ప్రమాదకర ఫలితాలు!

>> ప్రమాదంలో పడ్డాయి. ఆ పనులను ఎఐ వేగంగా, తక్కువ ఖర్చుతో చేస్తుండటం దెబ్బతీస్తోంది. ఇలాంటి పరిస్థితి నుంచి బయటపడేందుకు, ఉద్యోగాలను రక్షించుకునేలా మార్గనిర్దేశం చేసేందుకు ఎఐ ఎకనామిక్ కౌన్సిల్ ఉండాలని సర్వే ప్రతిపాదించింది. 'అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ పోటీ పెరిగింది. ఐరోపాలో భద్రతాపరమైన పరిస్థితులు సంక్లిష్టంగా మారాయి. వాణిజ్య విధానాల విషయంలో రాజకీయ స్వలాభాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు' అని సర్వే హెచ్చరించింది. సాంకేతికతపై అధిక పెట్టుబడుల కారణంగా పొంచి ఉన్న ఆర్థికపరమైన ముప్పును ప్రస్తావించింది. మరోపక్క బంగారం ధరలు 2025లో ఒక ఔన్సుకు 2,607 డాలర్ల నుంచి 4,315 డాలర్లకు పెరగడం.. డాలర్ బలహీనతను వెల్లడి చేస్తోంది. 2026లోనూ ఈ ధరల పెరుగుదల కొనసాగుతుంది. ఇవన్నీ మదుపర్లలో ఆందోళనను వెల్లడి చేస్తోందని పేర్కొంది. ఇక ఎఐ వల్ల ఉత్పాదకత అమాంతం పెరిగిపోతుందనే ఆశతో పలు సంస్థలు భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ఈ రంగంలో ఏదైనా దిద్దుబాటు చోటుచేసుకుంటే.. భారత్ వంటి మార్కెట్లలోకి వచ్చే పెట్టుబడులపై ప్రభావం పడొచ్చని తెలిపింది. ఈ పరిణామాలన్నింటితో భారత్‌కు ముప్పు ఉన్నప్పటికీ.. ఆర్థిక మూలాలు, విస్తృతమైన దేశీయ మార్కెట్, భారీగా ఉన్న విదేశీ మారక నిల్వలు బఫర్‌గా ఉండొచ్చనే అభిప్రాయాన్ని సర్వే వ్యక్తం చేసింది. పొంచి ఉన్న ప్రమాదాలను ఎదుర్కొనేలా దీర్ఘకాలిక వ్యూహాలతో ముందుకు వెళ్లాలని సూచించింది.

# డేంజర్ 'మేడిగడ్డ'

>> వెల్లడించింది. వర్షాకాలం అనంతరం మరో 6,553 డ్యామ్‌లు తనిఖీ చేసినట్లు తెలిపింది. ఈ తనిఖీలలో మూడు డ్యామ్‌లు అత్యంత ప్రమాదకరంగా ఉన్నట్లు వెల్లడైందని పేర్కొంది. వాటిలో తెలంగాణలోని మేడిగడ్డ, ఉత్తరప్రదేశ్‌లోని లోయర్ ఖజురి, ఝార్ఖండ్‌లోని బొకారో డ్యామ్‌లు ఉన్నట్లు వెల్లడించింది. మేడిగడ్డ డ్యామ్‌కు సంబంధించి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినట్లు జల్‌శక్తి శాఖ తెలిపింది.

# డాలర్లు మాయం

>> వినిపిస్తున్నాయి. లక్ష్మీనరసింహస్వామి వారి ప్రతిమతో రూపొందించిన బంగారు, వెండి డాలర్ల విక్రయాలు క్షేత్రంలో దాదాపు 20 ఏండ్లుగా కొనసాగుతున్నాయి. మధ్యలో కొన్నేళ్లపాటు విక్రయాలు నిలిచిపోయినా, కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వాటిని తిరిగి ప్రారంభించారు. అప్పటి నుంచి దేవస్థాన ఈవో పర్యవేక్షణలో, ఏఈవో ఆధీనంలోని ప్రచార శాఖ ద్వారా డాలర్ల భద్రపరిచే, విక్రయించే బాధ్యత కొనసాగుతోంది. భక్తులు వివిధ రూపాల్లో సమర్పించిన బంగారం, వెండిని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని మింట్ కంపౌండ్‌కు ఆలయ ఈవో పంపిస్తారు. అక్కడ 200 బంగారు డాలర్లు, 1000 వెండి డాలర్లు తయారు చేసిన అనంతరం వాటిని తిరిగి దేవస్థానానికి అందజేస్తారు. ఆ తర్వాత అవి పూర్తిగా ఈవో పర్యవేక్షణలో ఉండాల్సి ఉంటుంది. అయితే ఇటీవలి తనిఖీల్లో ఈ డాలర్లు కనిపించకుండా పోయినట్లు అధికారులు గుర్తించారు.

**ఆడిట్‌లో అక్రమాలు వెలుగులోకి...**

ఏడాది కాలంగా డాలర్లు మాయమైనప్పటికీ, ఎవరూ గుర్తించకపోవడం, లేదా గుర్తించినా బయటకు రాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. తాజా ఆడిట్ తనిఖీల్లో స్టాక్ రిజిస్టర్లు, విక్రయ లెక్కల్లో భారీ తేడాలు బయటపడినట్లు సమాచారం. దీంతో ఆలయ నిర్వహణ వ్యవస్థపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ముగ్గురిపై విచారణ...**

ఈ ఘటనపై ఇప్పటికే ముగ్గురిని విచారణకు పిలిపించినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ఎవరి బాధ్యత ఏమిటి? డాలర్లు ఎప్పుడు, ఎలా మాయమయ్యాయి? అన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. విచారణ పరిధి మరింత విస్తరించే అవకాశం ఉందని సమాచారం.

**బంగారం వెండి డాలర్ల మాయంపై ఈవో ఫైర్ ...**

ఈ వ్యవహారంపై దేవస్థాన ఈవో భవాని శంకర్ తీవ్రంగా స్పందించారు. పూర్తి స్థాయి విచారణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. కమిటీ నివేదిక అందిన వెంటనే దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా స్టాక్ నిర్వహణ, భద్రతా వ్యవస్థలపై కీలక నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు.

**భక్తుల్లో ఆందోళన...**

వరుసగా జరుగుతున్న చోరీలు, అవకతవకల తో భక్తుల్లో ఆందోళన నెలకొంది. దేవుడి ఆభరణాలకే భద్రత లేకపోతే, మా విరాళాలకు ఏమవుతుంది?" అంటూ భక్తులు ప్రశ్నిస్తున్నారు. యాదగిరిగుట్ట క్షేత్ర ప్రతిష్ఠను కాపాడాలంటే, మాటలకే కాకుండా కఠిన చర్యలు తప్పవని పలువురుఅ భిప్రాయపడుతున్నారు.

## వారం - వర్జ్యం

30-01-2026, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శ్రావణ కార్తె
ద్వాదశి ఉ.11.10
ఆరుద్ర రా.3.27
వర్జ్యం : మ.2.31-4.00
దు.ఉ.8.57-9.43, 2) మ.12.45-1.31
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** కోర్టు కేసులు పరిష్కారదశకు చేరుకుంటాయి. ఊహించని విధంగా ఉద్యోగావకాశాలు దరికి చేరుతాయి.

**వృషభం:**జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ధనలాభం.

**మిథునం:** నూతన ఒప్పందాలు చేసుకుంటారు. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. వస్తుకొనుగోలు.

**కర్కాటకం:**దూరప్రాంతాల నుండి ముఖ్య సమాచారం తెలుసుకుంటారు. చర్చాగోష్ఠులలో పాల్గొంటారు.

**సింహం:**బ్యూటీ పార్లర్‌లు నడిపే వారికి అనుకూలంగా ఉంటుంది. దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి.

**కన్య :**పనులలో ఆటంకాలు ఎదురైనా, అభివృద్ధి కూడా అంతర్లీనంగా ఉంటుంది. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**తుల :** సాంకేతిక, పరిశోధన విషయాలపై ఆసక్తి చూపుతారు. వ్యవసాయాలలో స్వల్ప మార్పులు ఉంటాయి.

**వృశ్చికం:** పారిశ్రామిక, రాజకీయ రంగాల లోని వారికి కొంత వరకు అనుకూల కాలం. కాంట్రాక్టులు దక్కుతాయి.

**ధనుస్సు:** ముద్రణ, ప్రచురణ రంగాల్లోని వారికి అనుకూలంగా వుంటుంది. చేతి వృత్తి పని వారికి అనుకూలం.

**మకరం:** అధికారులతో, సహోద్యోగులతో స్నేహభావంతో మెలుగుతారు. ఓర్పును కలిగి వుంటారు.

**కుంభం:**గతంలో మీరు చేసిన కృషి ఇప్పుడు అక్కరకు వస్తుంది. విలాసవంతమైన వస్తువులు కొనుగోలు.

**మీనం:** గ్రూపు రాజకీయాలను తగినంత దూరంగా ఉండటం శ్రేయస్కరం. శుభవార్తలు వింటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



గురువారం జనసంద్రంగా మేడారం



సమ్మక్కను దర్శించుకున్న కేంద్రమంత్రులు జోయల్ ఓరం, కిషన్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, సీతక్క తదితరులు

# గద్దెపైకి సమ్మక్క

>> గురువారం అర్ధరాత్రి వరాల తల్లి సమ్మక్క ఆగమనం జరిగింది. చిలుకలగుట్ట నుంచి కుంకుమ భరణి రూపంలో ఉన్న అమ్మవారిని గద్దెపై తీసుకొచ్చి సిద్ధబోయిన వంశీయులు,చందా వంశీయులు ప్రతిష్టించారు. సమ్మక్క రాకతో మేడారం జాతరలో పరిపూర్ణమైన కీలక ఘట్టం పూర్తయింది. భారీ బందోబస్తు మధ్య గద్దెల ప్రాంగణానికి పూజారులు ప్రయాణించారు. రోడ్డుకు ఇరువైపులా లక్షలాది మంది భక్తజనసందోహం.. ఇసుకేస్తే రాలనంత జనంతో.. ఈ ఘట్టం చూడటానికి రెండు కళ్ళు సరిపోవు.

**మాఘా శుద్ధ పౌర్ణమి వేళ గద్దెపై కొలువుతీరిన సమ్మక్క తల్లి..**

రూపమే లేని వనదేవతల కుంభ మేళాలో గురువారం సమ్మక్క తల్లి గద్దెపై ప్రతిష్టతో మేడారంలో మహోన్నత ఘట్టానికి వేదుకగా నిలిచింది. కోరిన వరాలు ఇచ్చే వరాల తల్లిసమ్మక్క రాక సందర్భంగా మేడారంలోని ఆమె గుడిని శుద్ధి చేశారు. మామిడి తోరణాలు కట్టారు. ఆవరణ మొత్తం ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలతో నృత్యాలు చేస్తూ రంగురంగుల ముగ్గులు పెట్టారు. సమ్మక్క రాక సందర్భంగా ముందుగా వనం (వెదురు కర్రలను) గద్దె పై ప్రతిష్టించారు. జాతరలో వనం ( వెదురు) కు విశిష్ఠత ఉంది. వనం అంటే ఆదివాసీ భాషలో అడవి అని అర్థం ఈ వనం నుండి తల్లులు గద్దెల పైకి వస్తారు కాబట్టి ముందుగా ఏపుగా ఎరిగిన వెదురు కర్రలను ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించి సమ్మక్క గద్దె వద్దకు తీసుకు వచ్చి ప్రతిష్టించారు. కాకతీయ రాజులను ఎదిరించి నిలిచిన ధీశాలి. ఆత్మవిశ్వాసమే ఆయుధంగా పోరాటం సాగించిన అడవి బిడ్డ శౌర్యపరాక్రమాలకు నిలువెత్తు రూపం అయిన ఆ తల్లి సమ్మక్క ప్రతిరూపంగా భావించే కుంకుమభరిణెను చిలకలగుట్ట నుండి అధికార లాంచనాలతో, గిరిజన సంప్రదాయాలతో గద్దె మీదకు తీసుకువచ్చారు. కాకతీయ రాజులతో పోరాడి వీరమరణం పొందినప్పటికీ తనవాళ్లను ఆశీర్వదించేందుకు రెండేళ్లకో మారు జనబాహుళ్యంలోకి వచ్చే సమ్మక్క తన బిడ్డలను చల్లగా దీవించి శుభ ఘడియ ఇదే.. సమ్మక్క ఆగమనం సందర్భంగా తల్లి గౌరవార్థం జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ గాలిలో మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. ఆదివాసీలు ప్రత్యేక పూజలు, ఆటల పాటలతో స్వాగతం పలికారు అమ్మవారికి మంత్రులు, ఉన్నతాధికారులు కూడా స్వాగతం పలికారు. ఆదివాసీ పూజారులు కొమ్మ బూరలు ఊదుతూ, డోలు వాయిద్యాలతో గద్దెపై ప్రతిష్టించారు. సమక్క తల్లి గద్దెపైకి చేరడంతో భక్తుల సంఖ్య ఒక్కసారిగా భారీగా పెరిగింది. నాలుగు రోజుల పాటు జరిగే మేడారం మహాజాతరకు ఇప్పటికే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వన దేవతల దర్శనానికి వచ్చిన భక్తులు జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవార్ల గద్దెలను దర్శించుకున్నారు.

**పున్నమి నాడు నిండు జాబిలిగా సమ్మక్క తల్లి దర్శనం**

అడవి బిడ్డల అపురూపమైన జాతర .. కొండా కోనా పరవశించే జాతర ... మేడారం మహా జాతర. సారలమ్మ గద్దెలపై కొలువుతీరటంతో ఊపందుకున్న జాతరలో చిలకలగుట్ట నుండి డోలు, కొమ్ము వాయిద్యాల చప్పుళ్ళతో , అధికార యంత్రాంగ హడావిడితో , గాలిలోకి కాల్పులు జరిపి ఆ తల్లికి స్వాగతం పలుకగా సమ్మక్క కుంకుమ భరిణె రూపంలో గద్దెలపై కొలువు తీరింది.

**పతాక స్థాయికి చేరుకున్న మేడారం మహా జాతర.**

సమ్మక్క తల్లి ఆగమనంతో జాతర పతాకస్థాయికి చేరుకుంది. ఆ తల్లి ఆగమనం చూసేందుకు మేడారంలో భక్తజన కోటి ఆత్రుతగా ఎదురు చూశారు. సాయంత్రం చిలకలగుట్ట నుంచి సమ్మక్కను గిరిజన పూజారులు ఆదివాసీ ఆచార సంప్రదాయాల ప్రకారం గద్దెపైకి తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు సర్వం సిద్ధం చేశారు. సమ్మక్క కోరి కొలిచినవారి కొంగుబంగారం ఆతల్లి అధికార లాంచనాలతో, గిరిజన సంప్రదాయాలతో గద్దె మీదకు సమ్మక్క

**వన దేవతలు నామస్మరణతో ప్రతిధ్వనిస్తున్న వనాలు.**

శతాబ్దాలుగా తనను నమ్మిన భక్తులకు వరాలిచ్చే తల్లిగా భాసిల్లుతున్న సమ్మక్క ఆశీర్వాదం కోసం భక్తులు బారులు తీరారు. తల్లీ బిడ్డలు ఒకచోట చేరి కనికరించే శుభ ఘడియ కోసం నిరీక్షించిన వారికి సమ్మక్క గద్దెపైకి వచ్చిన ఆ మధుర క్షణాలను మనసులో పదిలపరుచుకున్నారు. వనదేవతల నామస్మరణతో కొండలు, గుట్టలు, వాగులు వంకలు ప్రతిధ్వనించాయి. సమ్మక్క పూజారులు చందా బాబురావు, సిద్ధబోయిన మునిందర్, మహేశ్, లక్ష్మణ్‌రావు, కొక్కెర కృష్ణయ్య ఆధ్వర్యంలో వడ్డెలు నేడు ఉదయం వేకువజామునే మేడారంలోని సమ్మక్క ఆలయంలో పూజలు నిర్వహిస్తారు.

**గాల్లోకి కాల్పులు జరిపి తల్లికి అధికారుల స్వాగతం**

సమ్మక్క రాక సందర్భంగా జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సైతం అంతా చిలకలగుట్ట వద్దనే వేచి ఉన్నారు. చిలకలగుట్ట నుంచి సమ్మక్క పూజారులు కుంకుమ భరిణెను తీసుకొని కిందకు వస్తున్న సమయంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ గాల్లోకి కాల్పులు జరిపారు. ఆ తుపాకీ శబ్దాలే సమ్మక్క ఆగమనానికి సంకేతం. ఇక ఆ క్షణం నుంచి ప్రతి ఘడియా అద్భుతంగా తోచింది. దారికి ఇరువైపులా రంగు రంగుల ముగ్గులు వేసి తల్లికి స్వాగతం పలికారు. నిండు పున్నమి వేళ జాబిలమ్మగా సమ్మక్క దర్శనం ఇస్తుంది. ఆ మరుక్షణం నుంచి మొక్కుల చెల్లింపులు ప్రారంభమవుతాయి. తల్లి మనసారా ఇచ్చే ఆశీర్వాదాల కోసం భక్త జనం పోటెత్తుతుంది. వన దేవతలకి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖా మంత్రి జువల్ ఓరం, టీపిసిసి మహేష్ కుమార్ గౌడ్, సీఎం మల్లు భట్టి విక్రమార్క దంపతులు, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దంపతులు, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్, మంత్రి సీతక్క ,మంత్రి కొండా సురేఖ, నిరుపమ సుకర్ష, డిజిపి విక్రమ్ సింగ్ మన్, జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్, జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు.

# కెసిఆర్‌కు సిట్ నోటీసులు

>> మేరకు నాకు మీరు ముందస్తు నోటీసులు పంపించి ఆ తర్వాతే విచారించాలి. మరో విషయం 65 ఏళ్ల పైబడిన పురుషులను వారు విచారణ కోసం పోలీస్ స్టేషన్ వెళ్లనవసరం లేదు. పోలీసులే వారి ఇంటివద్దకు వెళ్లి విచారణ చేపట్టాలి. ఇకపై నాకు పంపాల్సిన నోటీసులను నేను నివసిస్తున్న ప్రాంతానికి అంటే.. ఎర్రవల్లికే పంపాలి. మాజీ ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా, బాధ్యతగల పౌరుడిగా సిట్ విచారణకు పూర్తిగా సహకరిస్తాను అని కేసీఆర్ లేఖలో పేర్కొన్నారు. దీనిపై సిట్ సానుకూలంగా స్పందించింది. కెసిఆర్ సమయం ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. అయితే కెసిఆర్‌కు మరోసారి నోటీసులు ఎప్పుడు పంపాలనే విషయంలో సిట్ నిర్ణాయానికి రాలేదు. ఈ విషయంపై శుక్రవారం సిట్ ఓ నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. కాగా, కేసీఆర్ ప్రస్తుతం ఫామ్‌హౌజ్‌లో ఉండటంతో గురువారం ఉదయం సిట్ అధికారులు ఎర్రవల్లిలోని ఫామ్‌హౌజ్‌కు వెళ్లి నోటీసులు ఇస్తారని ప్రచారం జరిగింది. అయితే వారు ఫామ్‌హౌజ్‌కు బదులుగా బంజారాహిల్స్ నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి వెళ్లి నోటీసులు ఇచ్చారు. ఆయన కుటుంబసభ్యులకు నోటీసులు అందజేశారు. సీఆర్‌పీసీ సెక్షన్ 160 కింద నోటీసులు ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరుకావాలని ఆ నోటీస్‌లో కోరారు. విచారణకు సిద్ధంగా ఉండాలని సూచించారు. వయసు రీత్యా (65 ఏళ్లు) విచారణ కోసం పోలీస్‌స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేదని, మీరు కోరిన చోటే విచారిస్తామని కేసీఆర్‌కు తెలిపారు. విచారణకు హాజరయ్యేందుకు హైదరాబాద్ పరిధిలోని అనువైన ప్రాంతం వివరాలు తెలపాలని కోరారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే కేటీఆర్, హరీశ్‌రావు, సంతోశ్‌రావులను ప్రత్యేక దర్యాప్తు బృందం విచారించిన విషయం విదితమే. రాష్ట్రంలో రాజకీయ ప్రకంపనలు సృష్టించిన ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో సిట్ దర్యాప్తును వేగవంతం చేసింది. ఇప్పటికే ఈ కేసులో నలుగురు పోలీసు అధికారులను అరెస్ట్ చేయగా, ప్రభాకర్‌రావును సైతం పలుమార్లు ప్రత్యేక దర్యాప్తు బృందం విచారించింది. ఈ కేసులో చిన్నచిన్న గ్యాప్స్‌ను కూడా ఫిల్ చేస్తూ సీపీ సజ్జనార్ నేతృత్వంలో ఏర్పాటైన సిట్ ముందుకు వెళ్తోంది. ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు విచారణ కస్టోడియల్ విచారణ ఆధారంగా కీలక సమాచారాన్ని సేకరించింది. ఇప్పటికే ట్యాపింగ్ బాధితులుగా ఉన్న మొత్తం 618 మందిలో దాదాపు అందరి స్టేట్‌మెంట్స్‌లను రికార్డ్ చేసిన సిట్ అధికారులు, ప్రభాకర్‌రావు కస్టోడియల్ విచారణ తర్వాత మరికొంతమందిని పిలిచి విచారిస్తున్నారు. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా 2024 మార్చి 10న పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదైంది. అప్పటి నుంచి ఈ కేసు అనేక కీలక మలుపులు తిరుగుతూ అక్రమ నిఘాకు సంబంధించిన తీవ్రమైన ఆరోపణలను వెలుగులోకి తెచ్చింది. వీసీ సజ్జనార్ నాయకత్వంలో మరో సిట్ ఏర్పాటు చేసిన తర్వాత దర్యాప్తు మరింత వేగవంతమైంది. దీని తర్వాత సిట్ ఇటీవల ఎమ్మెల్సీ నవీన్ రావు, మాజీ మంత్రి హరీశ్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్‌లను విచారించింది. వారి వాంగ్మూలాలను నమోదు చేయడంతో పాటు, విచారణ ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీశారు. అనేక వాంగ్మూలాల్లో కేసీఆర్ పేరు వెలుగులోకి రావడంతో, ఇప్పుడు ఆయనకు నోటీసులు జారీ చేయాలని సిట్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. రాధాకిషన్‌రావు తన వాంగ్మూలంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్ పాత్ర గురించి ప్రస్తావించినట్లు ఆరోపణలు వచ్చాయి. భుజంగరావు కూడా ప్రభాకర్ రావు నియామకం గురించి ప్రస్తావిస్తూ కేసీఆర్ పేరు చెప్పినట్లు సమాచారం. ఈ కేసులో పాలుపంచుకున్న సీనియర్ అధికారులు సంబంధిత కాలంలో మాజీ ముఖ్యమంత్రి అధికారిక నివాసమైన ప్రగతి భవన్‌ను తరచుగా సందర్శించారని భుజంగ రావు తన వాంగ్మూలంలో పేర్కొన్నారు. ఈ వాంగ్మూలాలు, వాటికి మద్దతుగా లభించిన ఆధారాల ఆధారంగా సిట్ తన దర్యాప్తును ముందుకు తీసుకెళ్తుందని భావిస్తున్నారు. కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయడంతో దర్యాప్తు కీలక దశలోకి ప్రవేశించింది. రాబోయే రోజుల్లో ఇది మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేటీఆర్‌ను ఇటీవల ప్రత్యేక దర్యాప్తు బృందం లోతుగా విచారించింది. ఆయనను పలు అంశాలపై అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. పార్టీకి ఎలక్టోరల్ బాండ్లు, విరాళాలు సమకూర్చిన వారిలో పలువురు వ్యాపారుల మొబైల్స్ నిఘాలో ఉన్నట్లుగా సిట్‌కు ఆధారాలు లభించాయి. ఈ నేపథ్యంలోనే అధికారులు పలు ప్రశ్నలు అడిగినట్లుగా తెలిసింది. ఆయా ఫోన్ నెంబర్లతో ఉన్న జాబితాను కేటీఆర్ ముందు ఉంచి విచారించినట్లు సమాచారం. అలాగే ఫోన్ ట్యాపింగ్ ద్వారా తమను బెదిరించి బీఆర్ఎస్‌కు ఎలక్టోరల్ బాండ్లు సమకూర్చే విధంగా చేశారంటూ కొంతమంది వ్యాపారులు ఇచ్చిన ఫిర్యాదులపై ప్రశ్నించగా, అలాంటిదేమీ లేదని కేటీఆర్ సమాధానం ఇచ్చారు. వ్యాపారులు తమకు స్వచ్ఛందంగానే విరాళాలను ఇచ్చారని చెప్పినట్లు సమాచారం.

# భూసేకరణ పూర్తి

>> నిర్మాణం ఉంటుందని పేర్కొన్నారు. నిర్మాణ పనులు ప్రారంభమైన నాటి నుంచి 2 నుండి 2.5 సంవత్సరాలలో విమానాశ్రయాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మామునూరు విమానాశ్రయ టెర్మినల్ భవనాన్ని కాకతీయుల శిల్పకళా, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా రూపకల్పన చేస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. ఇది కేవలం రవాణా సదుపాయంగా కాకుండా, ప్రాంతీయ గుర్తింపును ప్రతిబింబించే ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. శంషాబాద్ విమానాశ్రయాన్ని ఉదాహరణగా ప్రస్తావిస్తూ, ఒక విమానాశ్రయం ఎలా ఆర్థిక కార్యకలాపాలు, ఉపాధి అవకాశాలు, పెట్టుబడులు, పట్టణాభివృద్ధికి దోహదపడుతుందో వివరించారు. అదే విధంగా మామునూరు విమానాశ్రయం వరంగల్‌తో పాటు ఉత్తర తెలంగాణ ప్రాంత అభివృద్ధికి దిశానిర్దేశం చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, మామునూరు విమానాశ్రయానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యతను గుర్తు చేశారు. నిజాం పాలన కాలంలో 1930లో నిర్మితమైన ఈ విమానాశ్రయం స్వాతంత్ర్యానికి ముందు దక్షిణ భారతదేశంలో అతిపెద్ద విమానాశ్రయంగా గుర్తింపు పొందిందని తెలిపారు. ఒకప్పుడు ప్రధాన వైమానిక కేంద్రంగా ఉన్న మామునూరు విమానాశ్రయాన్ని పునరుద్ధరించడం ద్వారా వరంగల్ చారిత్రక ప్రాధాన్యతను తిరిగి తీసుకురావడంతో పాటు ఆధునిక మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. భూసేకరణను పారదర్శకంగా, సమయపాలనతో పూర్తి చేయడం రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనమని అన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, వరంగల్ (మామునూరు) విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించి భూసేకరణతో పాటు అవసరమైన అన్ని అనుమతుల ప్రక్రియ పూర్తిచేసి, వాటి క్లియరెన్స్ సర్టిఫికెట్లను కేంద్ర పౌర విమానయాన శాఖకు అందజేయడం గర్వకారణమని తెలిపారు. ఈ విమానాశ్రయం ద్వారా పరిశ్రమలు, టెక్స్టైల్ పార్కులు, కార్గో రవాణా, పర్యాటకం విస్తరించి వరంగల్-కరీంనగర్, వరంగల్-ఖమ్మం, వరంగల్-హైదరాబాద్ కారిడార్ల అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ రాష్ట్రానికి ప్రస్తుతం ఒక్కటే విమానాశ్రయం ఉండటం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వరంగల్ విమానాశ్రయాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకొని ముందుకు తీసుకెళ్లినందుకు కేంద్ర పౌర విమానయాన శాఖకు రాష్ట్ర ప్రభుత్వ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక శాసనసభ్యులు, రైతుల సహకారంతో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వరంగల్ ప్రజల కలను నెరవేర్చడంలో కీలక ముందడుగు పడిందన్నారు.

# హార్వర్డ్ విద్యార్థులు తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లు కావాలి

## బిజినెస్ స్కూలు స్టూడెంట్లతో సిఎం రేవంత్‌రెడ్డి ఇష్టాగోష్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జనవరి29:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన బిజీబిజీగా కొనసాగుతోంది. తన పర్యటనలో భాగంగా.. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో సిఎం రేవంత్‌రెడ్డి సందడి చేశారు. తన పర్యటనలో భాగంగా సిఎం పలు కీలక సమావేశాలు, అంతర్జాతీయ సంస్థలతో చర్చలు, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా ప్రముఖ హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో భారతీయ విద్యార్థులతో జరిగిన భేటీ కార్యక్రమం అనేక వర్గాలను ఆకర్షించింది. భారతీయ విద్యార్థుల ప్రత్యేక ఆహ్వానంతో సిఎం రేవంత్‌రెడ్డి క్యాంపస్‌ను సందర్శించారు. ఈ మేరకు విద్యార్థులతో తన ఆలోచనలు పంచుకున్నారు. సిఎంఅమెరికా పర్యటన తెలంగాణకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే కాకుండా... ప్రపంచంలో ఉన్న విద్యార్థులను రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములను చేసేలా చర్చలు చేశారు. విద్యార్థులతో జరిగిన చర్చాగోష్ఠిలో సిఎం తన రాజకీయ ప్రస్థానాన్ని ఎదుర్కొన్న సవాళ్లను విద్యార్థులకు వివరించారు. విజయం అనేది అదృష్టం వల్ల రాదని, నిరంతర కృషి, లక్ష్యం పట్ల స్పష్టత ఉంటేనే సాధ్యమని ఆయన విద్యార్థులకు తెలిపారు. ఎవరికైనా వారి కెరియర్‌లో ప్రారంభంలో ఎదురయ్యే ఒడుదొడుకులను ఎలా అధిగమించాలో విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. విజన్ తెలంగాణను గ్లోబల్ మ్యాప్‌లో అగ్రస్థానంలో నిలబెట్టడమే తన ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను కేవలం ఐటీ హబ్‌గానే కాకుండా అన్ని రంగాల్లోనూ మేటిగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ గురించి ప్రస్తావించారు. తెలంగాణ అభివృద్ధిలో అంతర్జాతీయ ప్రమాణాలను ఎలా పాటిస్తున్నామో చెప్పారు. హార్వర్డ్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు, అంతర్జాతీయ వేదికలపై హైదరాబాద్, తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించాలని సిఎం వారికి పిలుపునిచ్చారు. తెలంగాణలో ఉన్న అద్భుతమైన అవకాశాల గురించి ప్రపంచానికి చాటి చెప్పాలని సిఎం పేర్కొన్నారు.

## మేడారం జాతరకు జాతీయ పండుగ హోదా కల్పించాలి

### కేంద్రమంత్రులకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** తెలంగాణలో జరిగే అతిపెద్ద గిరిజన పండుగ మేడారం జాతరకు జాతీయ పండుగ హోదా కల్పించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఆయన గురువారం లేఖ రాశారు. ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన పండుగల్లో ఒకటైన సమ్మక్క సారలమ్మ జాతరకు జాతీయ పండుగ హోదా ఇవ్వాలని, భారత ప్రభుత్వాన్ని సగౌరవంగా అభ్యర్థిస్తున్నట్లు కేంద్ర మంత్రికి రాసిన లేఖలో మంత్రి కోరారు. తెలంగాణలోని ములుగు జిల్లా మేడారంలో రెండేళ్లకు ఒకసారి జరిగే సమ్మక్క సారలమ్మ జాతర, గిరిజన వర్గాల సంప్రదాయాలు, విశ్వాసం, సాంస్కృతిక గుర్తింపులో లోతుగా పాతుకుపోయిన పవిత్ర పండుగ అన్నారు. అన్యాయానికి వ్యతిరేకంగా ప్రతిఘటించిన, దేశీయ విలువల పరిరక్షణకు ప్రతీకగా నిలిచిన పురాణ గిరిజన అమరవీరులు సమ్మక్క, సారలమ్మలను ఈ జాతర స్మరిస్తున్నదన్నారు. ఈ చారిత్రాత్మక ఉత్సవం తెలంగాణతోపాటు... ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ దేశంలోని ఇతర ప్రాంతాల నుండి కులం, మతాలకు అతీతంగా రెండు కోట్లకు పైగా భక్తులు వస్తారని లేఖలో తెలిపారు. భక్తుల హాజరు పరంగా ఇది భారతదేశంలోనే కాకుండా ప్రపంచంలోని అతిపెద్ద మతపరమైన సమావేశాలతో సమానంగా ఉంటుందన్నారు. భారతదేశ గొప్ప గిరిజన వారసత్వాన్ని, స్వదేశీ సంప్రదాయాలను గుర్తించి గౌరవించమని కోరారు. మేడారం జాతర జరిగే ప్రాంతంలో మౌలిక సదుపాయాలు, జనసమూహ నిర్వహణ, పారిశుధ్యం, ఆరోగ్య సంరక్షణ, భద్రత కోసం కేంద్ర మద్దతును ఇవ్వాలని కోరారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గిరిజన సంస్కృతిని ప్రోత్సహించాలన్నారు. జాతీయ కథనంలో సమ్మిళిత సాంస్కృతిక ప్రాతినిధ్యాన్ని బలోపేతం చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వంగా తాము జాతరను సమర్థవంతంగా నిర్వహించడానికి గణనీయమైన ప్రయత్నాలు చేస్తున్నామని, పవిత్ర అటవీ ప్రాంతం పర్యావరణ, ఆధ్యాత్మిక పవిత్రతను కాపాడుతూ భక్తులకు సౌకర్యాలను అందిస్తున్నామన్నారు. మేడారం జాతర జాతీయ ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకుంటే, కేంద్ర గుర్తింపు, సహాయం చాలా అవసరమన్నారు. సమ్మక్క సారలమ్మ జాతరకు జాతీయ హోదాను సిఫార్సు చేయడంలో భారత ప్రభుత్వం నుండి అనుకూలమైన సహాయం అందించడంలో మీ జోక్యం, మద్దతును కోరుతున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి రాసిన లేఖలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న గిరిజన సంఘాలు, భక్తులు దీర్ఘకాలంగా, విస్తృతంగా కోరుతున్న జాతీయ హోదా డిమాండ్‌ను మీరు సానుకూలంగా పరిశీలించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కోరారు.

# ప్రపంచానికి భారత్ ఆశాకిరణం



### ఇయు డీల్‌ను ప్రశంసించిన ప్రధాని మోడీ

### వికసిత్ భారత్ 2047 సాధన దిశగా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని స్పష్టీకరణ

### తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టడంపై నిర్మలాసీతారామన్‌ను అభినందించిన మోడీ

**న్యూఢిల్లీ, జనవరి 29:** 21వ శతాబ్దంలో భారతదేశం ప్రపంచానికి ఒక ఆశాకిరణంగా, ఆకర్షణ కేంద్రంగా మారిందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. దేశ ఆర్థిక, ప్రజాస్వామ్య బలంపై ప్రపంచానికి పెరుగుతున్న విశ్వాసానికి ఇదే నిదర్శనమని తెలిపారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా గురువారం ఉదయం ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడారు. భారత్- యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ), "ఆశావహ, ఆత్మవిశ్వాస, ఆత్మనిర్భర్ భారత్" స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందని అన్నారు. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ద్వారా భారతదేశానికి, ముఖ్యంగా యువతకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు. 'భారత్, యూరప్ మధ్య ఈ చారిత్రాత్మక ఒప్పందం కుదిరినప్పుడు మన పారిశ్రామికవేత్తలు, తయారీదారులు కేవలం పన్నుల తగ్గింపు గురించే ఆలోచించ కూడదు. ఇది నాణ్యతను చాటుకోవాల్సిన గొప్ప అవకాశం. ఇప్పుడు మార్కెట్ మన కోసం తెరుచుకుంది. అత్యుత్తమ నాణ్యతతో యూరప్‌లోని 27 దేశాల హృదయాలను మనం గెలుచుకోవాలి. ఇది దీర్ఘకాలంలో మనకు ఎంతో మేలు చేస్తుంది' అని ప్రధాని వివరించారు. ఈ ఒప్పందం ద్వారా భారత రైతులు, యువత, సేవల రంగంలోని నిపుణులకు ప్రపంచ మార్కెట్లలో గణనీయమైన అవకాశాలు లభిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వం అనుసరిస్తున్న 'రిఫార్మ్, పెర్ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్' (సంస్కరణ, పనితీరు, మార్పు) విధానాన్ని ఆయన మరోసారి స్పష్టం చేశారు. భారత్ ఇప్పుడు 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్' మీద ప్రయాణిస్తోందని.. అభివృద్ధి పథంలో దేశం వేగంగా దూసుకు పోతోందని ప్రధాని ధీమా వ్యక్తం చేశారు. 2047 లక్ష్యం దిశగా అడుగులు

ప్రస్తుత బడ్జెట్ సమావేశాల ప్రాముఖ్యతను వివరిస్తూ.. 21వ శతాబ్దంలో మొదటి పావు భాగం ముగిసిందని, ఇప్పుడు రెండో పావు భాగం ప్రారంభమైందని ప్రధాని గుర్తు చేశారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాన్ని చేరుకోవడానికి రాబోయే 25 ఏళ్లు అత్యంత కీలకమని, ఆ దిశగా ఈ బడ్జెట్ బలమైన పునాది వేస్తుందని ఆయన పేర్కొన్నారు. దేశం ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల నుంచి బయటపడి, శాశ్వత పరిష్కారాల మార్గంలో భారత్ బలోపేతం అవుతోందని మోడీ వివరించారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం మానవతా దృక్పథంతోనే ఉంటుందని ప్రధాని స్పష్టం చేశారు. దేశ అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం ఏ నిర్ణయమైనా తీసుకుంటుందని అన్నారు. ప్రజల అభివృద్ధి సౌభాగ్యాలే లక్ష్యంగా పథకాలు, నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఆధునిక సాంకేతికతలో మార్పులకు అనుగుణంగా తామూ మారతామని చెప్పారు. అయితే, ప్రజలకు మేలు చేకూర్చే విధంగా తమ నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుంటూ సాంకేతికతను జోడించి ముందుకు సాగుతామని అన్నారు. ఈ బడ్జెట్ సమావేశాలు ఓ చారిత్రాత్మక ఘట్టానికి వేదిక కాబోతున్నాయని ప్రధాని ఆనందం వ్యక్తం చేశారు. వరుసగా 9వ సారి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న తొలి మహిళా ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ రికార్డు సృష్టించబోతున్నారని, దేశ పార్లమెంటరీ చరిత్రలో ఒక గర్వకారణమైన క్షణమని ప్రధాని అభివర్ణించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంటులో చేసిన ప్రసంగం 140 కోట్ల మంది భారతీయుల ఆత్మవిశ్వాసాన్ని, ఆకాంక్షలను ప్రతిబింబించిందని కొనియాడారు. దేశాభివృద్ధిని వేగవంతం చేసేందుకు ఎంపీలందరూ నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొనాలని ప్రధాని కోరారు.

# కచ్చితత్వంతో బడ్జెట్ ప్రతిపాదనలు

### వృధా ఖర్చులు లేకుండా అంచనాలు

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త :** వృథా ఖర్చులకు ఆస్కారం లేకుండా, పథకాల అమలుకు అవసరమైన బడ్జెట్‌ను ఖచ్చితత్వంతో రూపొందించాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు సూచించారు. విజన్ 2047 లక్ష్యాలను సాధించే దిశగా బడ్జెట్ ప్రతిపాదనలు ఉండాలన్నారు. హైదరాబాద్‌లో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడం, రైతులకు దీర్ఘకాల ప్రయోజనం కలిగేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. వ్యవసాయ రంగానికి సంబంధించి విభాగాల వారీగా బడ్జెట్ ప్రతిపాదనలను సమగ్రంగా, స్పష్టమైన లక్ష్యాలతో సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న రైతు సంక్షేమ, వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర ప్రాయోజిత పథకాలను తదితర అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు.

ఇన్‌పుట్ సరఫరా, విస్తరణ సేవలు, శిక్షణ కార్యక్రమాలు, మార్కెటింగ్ సదుపాయాలు, డిజిటల్ కార్యక్రమాలు, సహకార సంస్థల పనితీరుపై చర్చించినట్లు వెల్లడించారు. ఉత్పాదకత పెంపు, రైతుల ఆదాయం మెరుగుదల, వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ విధానాల రూపకల్పన, అలాగే కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేసి, వాస్తవ అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. రైతు కేంద్రంగా వ్యవసాయ విధానాలు రూపొందించడం, పథకాల అమలులో పారదర్శకత, ఫలితాలపై దృష్టి సారించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, వ్యవసాయ, ఉద్యాన యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్లు జానయ్య, రాజిరెడ్డి, తెలంగాణ సీడ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఎండి కిరణ్, మార్క్‌ఫెడ్ ఎండి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యుఎస్-ఇండియా ట్రస్ట్‌తో పరిశ్రమ-విద్యా సహకారం మరింత బలోపేతం

### ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** యుఎస్- ఇండియా ట్రస్ట్ కింద పరిశ్రమ-విద్యా సహకారం మరింత బలోపేతం కావాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి పిలుపునిచ్చారు. ఉన్నత విద్య అంతర్జాతీయాకరణ నేపథ్యంలో పరస్పర ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని యుఎస్ కాన్సులేట్, వరల్డ్ ట్రేడ్ సెంటర్ నిర్వహించిన లివరేజింగ్ యుఎస్ఇండియా ట్రస్ట్‌పై శంషాబాద్‌లో జరిగిన ఒక రోజు సమావేశం ప్యానెల్ చర్చలో ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండు సంవత్సరాలలో ప్రారంభించబడిన ప్రధాన దశలతో ఉన్నత విద్య పర్యావరణ వ్యవస్థలో పరివర్తనాత్మక మార్పులను తీసుకురావడానికి ఉన్నత విద్యా మండలి సిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశం ప్రధానంగా ఏఐ, సైబర్ సెక్యూరిటీలో పరిశ్రమ-విద్యా భాగస్వామ్యాలపై దృష్టి సారించింది. పాఠ్యాంశాల్లో సవరణ, తెలంగాణ విద్యార్థులకు పారిశ్రామిక శిక్షణ అందించడానికి నాస్కామ్, బిడిఎంఏతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాలను బాలకిష్టారెడ్డి గుర్తు చేశారు. ప్రపంచ డిమాండ్లకు అనుగుణంగా నిరంతర అభ్యాసం, నైపుణ్యాభివృద్ధిని అందించడం అవసరమయ్యే సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో వచ్చిన మార్పుకు అనుగుణంగా ఈ చర్య తీసుకున్నట్లు పేర్కొన్నారు. భారతదేశానికి జనాభాపరంగా సానుకూలత ఉన్నందున, విద్యార్థులకు సరసమైన ధరకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించేలా అందుబాటులో ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత కూడా రాష్ట్రంపై ఉందన్నారు. ప్రపంచ మార్కెట్‌కు అనుగుణంగా పెద్ద సంఖ్యలో సాంకేతిక సంస్థలు ఉండటం వల్ల తెలంగాణలో స్థాపనకు ఎక్కువ అవకాశం ఉందని, ప్రపంచ పరిశ్రమలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. భారతదేశం, అమెరికా మధ్య పెరుగుతున్న సహకారంతో, తెలంగాణలో స్థాపనకు ఎక్కువ అవకాశం ఉందని, ఇండో యుఎస్ 2025 ట్రస్ట్ చొరవలో భాగంగా ఏఐ, సైబర్ సెక్యూరిటీ రంగంలో యుఎస్ విశ్వవిద్యాలయాల నెట్‌వర్క్ పరిశ్రమ-విద్యా సంబంధాలను సులభతరం చేయగలదని బాలకిష్టారెడ్డి అన్నారు. అమెరికా కాన్సులేట్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ పాల్గొన్నారు.

## విమానంలో బ్లాక్‌బాక్స్ స్వాధీనం

### 'ఓ షిట్' అన్న మాటలు చివరిగా రికార్డు

### గగన్ వ్యవస్థ లేదని నిర్ధారణ



**బారామతి, జనవరి 29:** అజిత్‌పవార్ ప్రయాణించేసిన విమాన ప్రమాదానికి సంబంధించి దర్యాప్తులో బ్లాక్‌బాక్స్‌ను స్వాధీనంచేసుకున్న దర్యాప్తు అధికారులు ప్రస్తుతం ప్రమాద కారణాలను విశ్లేషిస్తున్నారు. బ్లాక్‌బాక్స్ విశ్లేషణలోనే పైలట్లు ఓషిట్ అన్న చివరి మాటలు రికార్డయ్యాయి. అలాగే విమానంలో ఆధునిక వ్యవస్థగా భావిస్తున్న గగన్ వ్యవస్థలేదని కూడా నిర్ధారించారు. అయితే విమానం కూలిపోవడానికి పైలట్ నిర్ణయం, ప్రతికూల వాతావరణమే కారణమని ఏఏఐబీ ప్రాథమికంగా గుర్తించింది. ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) నిర్వహించిన ప్రాథమిక దర్యాప్తులో విస్తుగొలిపే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రతికూల వాతావరణంలో విమానాన్ని ల్యాండ్ చేసే క్రమంలో పైలట్ తీసుకున్న తప్పుడు నిర్ణయం ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని ప్రాథమికంగా అధికారులు భావిస్తున్నారు. విమాన ప్రమాదం జరిగిన సమయంలో బారామతిలో పొగమంచు వల్ల విజిబిలిటీ చాలా తక్కువగా ఉందని విమానాన్ని పూణేకు మళ్లించే అవకాశం ఉన్నప్పటికీ పైలట్ బారామతిలోనే ల్యాండ్ చేయడానికి మొగ్గు చూపారని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. చివరి నిమిషంలో కరెక్షన్ జరిగిందని తేల్చారు. మొదటి ప్రయత్నంలో రన్‌వే కనిపించక గో అరౌండ్ చేసిన పైలట్లు రెండోసారి ల్యాండ్ అయ్యేందుకు ప్రయత్నించారు. అయితే విమానం వేగం పొజిషన్ సరిగ్గా లేకపోవడంతో చివరి నిమిషంలో దాన్ని సరిచేయడానికి ప్రయత్నించి విఫలం అయ్యారు. దాని వల్లే ఈ ప్రమాదం జరిగిందని పేర్కొంటున్నారు. ఇక ఘటనా స్థలం స్వాధీనం చేసుకున్న బ్లాక్ బాక్స్ ప్రకారం ప్రమాదానికి కొన్ని క్షణాల ముందు పైలట్లు "ఓ షిట్" అని అరిచినట్లు అందులో రికార్డ్ అయింది. అంటే ప్రమాదాన్ని ముందే ఊహించినప్పటికీ దాన్ని నివారించలేకపోయారని అర్థం అవుతోంది. ఈ విమానంలో ఆధునిక నావిగేషన్ వ్యవస్థ అయిన గగన్ లేకపోవడం కూడా పైలట్లు రన్‌వేను గుర్తించడంలో ఇబ్బంది పడటానికి ఒక కారణమని తెలుస్తోంది.

## ప్రశాంతంగా ముగిసిన జెఇఇ మెయిన్స్-2026

# మొదటి విడత పరీక్షలు

### దరఖాస్తు చేసుకున్న వారిలో 95 శాతం హాజరు

### ఫిబ్రవరి 12లోపు ఫలితాల వెల్లడి

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** దేశంలోని ఐఐటీలు, ఎన్ఐటీల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరడానికి జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జెఈఈ) మెయిన్-2026 జనవరి పరీక్షలు గురువారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 21 నుంచి ప్రారంభమైన పరీక్షలు.. 21 నుంచి 28 వరకు పేపర్-1 పరీక్షలు జరుగగా.. గురువారం(29న) పేపర్-2 పరీక్ష జరిగింది. ఈ నెల 21 నుంచి ఆన్‌లైన్ పరీక్షలు జరిగాయి. జెఈఈ మెయిన్-2026 జనవరి పరీక్షలు 21, 22, 23, 24, 28 తేదీల్లో పేపర్-1 పరీక్షలు నిర్వ హించారు. దేశవ్యాప్తంగా పేపర్-1కు సుమారు 13.50 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 95 శాతం మంది హాజరై ఉంటారని అధికారుల అంచనా. గురువారం పేపర్ -2 పరీక్ష జరిగింది. ఫిబ్రవరి 12లోపు పరీక్షల స్కోర్‌ను వెల్లడిస్తామని ఇప్పటికే జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) ప్రకటిన విషయం తెలిసిందే. 14 రోజుల్లో ప్రాథమిక కీ, విద్యార్థుల రెస్పాన్స్ షీట్ విడుదల చేయ నున్నారు. ఈ నెల 21, 22, 23, 24, 28 తేదీల్లో పేపర్-1 పరీక్ష నిర్వహించగా.. పరీక్షలను రెండు సెషన్‌లలో.. ఉద యం 9 గంటల నుంచి 12 వరకు.. మధ్యా హ్నం సెషన్‌ను 3 గంటల నుంచి 6 గంటల వరకు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో గత యేడాది.. అనంతపురం, భీమవరం, చిత్తూరు, ఏలూరు, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, నరసరావుపేట, ప్రొద్దుటూరు, సూరంపాలెం, మచిలీపట్నం, నంద్యాల, తాడేపల్లిగూడెంలో పరీక్షా కేంద్రాలు ఉండగా.. ఈసారి కొత్తగా ఆదోని, అమలాపురం, మదనపల్లి, మార్కాపురం, పుత్తూరు, రాయచోటి, తాడిపర్తి, తిరువూరులోనూ ఏర్పాటు చేశారు. తెలంగాణలో గత ఏడాది వరకు కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ, వరంగల్, నిజామాబాద్, సూర్యాపేట, సిద్దిపేట, జగిత్యాల, కొత్తగూడెం, హైదరాబాద్‌లలో పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. ఈసారి అదనంగా ఆదిలాబాద్, కోదాడ, పెద్దపల్లిలో కూడా పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. గురువారం పేపర్-2ఎ (బీఆర్క్) పేపర్-2బి (బి ప్లానింగ్) పరీక్షలను ఒకే షిఫ్టులో నిర్వహించారు. పరీక్షను ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు నిర్వహించారు.




## అఖిల భారత టేబుల్‌టెన్నిస్ పోటీలు ప్రారంభం

### లక్నో స్టేడియంలో క్రీడలు ప్రారంభించిన ఎల్ఐసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సలీల్

**హైదరాబాద్, జనవరి 29:** జీవితభీమా సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న అఖిలభారత టేబుల్‌టెన్నిస్ టోర్నమెంట్‌ను అట్టహాసంగా ఎల్ఐసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సలీల్ విశ్వనాథ్ ప్రారంభించారు. లక్నోలోని సింగ్‌బాబు స్టేడియంలో ఈ అఖిలభారత పోటీలుప్రారంభం అయ్యాయి. లక్నోడివిజన్ సీనియర్ డివిజనల్‌మేనేజర్ సంజయ్‌కుమార్‌సింగ్, సెంట్రల్ ఆఫీస్ హెచ్ ఆర్‌డి సెక్రటరీ ఎస్ గాయత్రి, ప్రాంతీయ మేనేజర్ అజయ్‌కుమార్ మిశ్రాలు కూడా ఈ పోటీల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పోటీలు అన్ని ప్రభుత్వరంగ సంస్థలకు కలిపి అఖిల భారత ప్రభుత్వరంగ క్రీడా నియంత్రణ బోర్డు ఆధ్వర్యంలోజరుగుతాయని ఎల్ఐసి వెల్లడించింది. ఎల్ఐసి సహా 13 ప్రభుత్వరంగసంస్థలనుంచి 120 మంది క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొన్నారు. క్రీడలు మానసిక వికాసంతోపాటు క్రమశిక్షణను అలవరు స్తాయని క్రీడాకారులు మరింత ఉత్సాహంతో పాల్గొనాలని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వనాథ్‌పేర్కొన్నారు. టోర్నమెంట్ ఈనెల 31వ తేదీతో ముగుస్తాయి.

# టెక్సాస్‌లో హెచ్1బి వీసా దరఖాస్తులు నిలిపివేత!

### వీసాలు దుర్వినియోగం చేస్తున్నారని టెక్సాస్ గవర్నర్ అసహనం

**ఆస్టిన్(టెక్సాస్), జనవరి 29:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమలులోకి తీసుకొచ్చిన హెచ్1బి వీసా ప్రోగ్రామ్‌పై టెక్సాస్ విస్తృతమైన ఆంక్షలను విధించింది. ఆ రాష్ట్ర గవర్నర్ గ్రెగ్ అబాట్ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త హెచ్ 1బీ వీసా దరఖాస్తులను తక్షణమే నిలిపివేశారు. ప్రభుత్వ నిధులు, ఉద్యోగాలను అమెరికన్ వర్కర్లు, ప్రొఫెషనల్స్‌కు కేటాయించాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ ఏజెన్సీలు, విశ్వవిద్యాల యాలను ఈ ఉత్తర్వుల పరిధిలోకి తీసుకొచ్చారు. గ్రెగ్ అబాట్ రిపబ్లికన్ గవర్నర్ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ నిలిపివేత 2027 మే 31 వరకు అమలులో ఉంటుంది. ఈ నిర్ణయంతో హెచ్1బీ వీసా కార్యక్రమంపై ఇలాంటి ఆంక్షలను విధించిన మొదటి అమెరికన్ స్టేట్ గా నిలిచింది టెక్సాస్ నిలిచింది. ఫెడరల్ హెచ్1బి వీసా ప్రోగ్రామ్ దుర్వినియోగమవుతోందంటూ వచ్చిన నివేదికలు, అమెరికన్ ఉద్యోగాలు స్థానికులకు మాత్రమే లభ్యమయ్యేలా చూసేందుకు ఫెడరల్ ప్రభుత్వం ఆ ప్రోగ్రామ్‌ను సమీక్షిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అబాట్ తెలిపారు. కొత్త హెచ్‌వన్‌బివీసా దరఖాస్తులను తక్షణమే నిలిపివేయాలని రాష్ట్రంలోని అన్ని ఏజెన్సీలను ఆదేశిస్తున్నట్లు చెప్పారు. హెచ్ 1బీ వీసా కార్యక్రమం కింద ప్రత్యేక నైపుణ్యాలు అవసరం అయ్యే ఉద్యోగాల కోసం విదేశీ నిపుణులను నియమించుకోవడానికి ఆయా సంస్థల యజమానులకు అనుమతిస్తుంది. బ్యాచిలర్ డిగ్రీ అవసరం అయ్యే ఈ వీసాలు సంవత్సరానికి 65 వేల వరకు అందుబాటులో ఉంటాయి. ఉన్నత విద్య అభ్యసించిన వారికి అదనంగా 20వేల వరకు కేటాయిస్తారు. ఇవి మూడు నుండి ఆరు సంవత్సరాల కాలానికి ఆమోదిస్తారు. టెక్సాస్‌లోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, ఆసుపత్రులు/వైద్య కేంద్రాలు, పాఠశాలలకు ఈ వీసాలు కీలక వనరుగా మారాయి. ఆయా రంగాల్లో ప్రతిభ కొరత ఏర్పడినప్పుడు ఇతర దేశాలకు చెందిన ప్రొఫెసర్లు, పరిశోధనా నిపుణులు, డాక్టర్లు, ఉపాధ్యాయులను నియమించుకోవడానికి ఇది వెసులుబాటు కల్పిస్తుంది. తాజా నిర్ణయాలను తీసుకోవడానికి గల కారణాలను టెక్సాస్ గవర్నర్ ఈ ఉత్తర్వు వివరించారు. ఈ వీసా ప్రోగ్రామ్ దుర్వినియోగమోతోందని అర్హత కలిగిన స్థానిక కార్మికులు/నిపుణులు ఇక్కడే అందుబాటులో ఉన్నప్పటికీవారిని నియమించుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వట్లేదని, కృత్రిమ కొరతను సృష్టించి, విదేశీయులను నియమించుకుంటొన్నాయని, వీటిని రెగ్యులరైజ్ చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కొన్ని చోట్ల అమెరికన్ నిపుణులను తీసివేసి, తక్కువ జీతాలకే హెచ్1బి ఉద్యోగులను నియమించినట్లు రిపోర్టులు అందాయని పేర్కొన్నారు.




## ప్రైవేటు మెడికల్ కాలేజీల ఫీజు వేధింపులపై చర్యలు తీసుకోవాలి

### హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్‌కు హెచ్ఆర్‌డిఎ విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రైవేటు మెడికల్ కాలేజీలు ఫీజు వేధింపులకు పాల్పడుతున్నాయని హెల్త్‌కేర్ రీఫామ్స్ డాక్టర్స్ అసోసియేషన్(హెచ్ఆర్‌డిఏ) మండిపడింది. ప్రైవేటు మెడికల్ కాలేజీల అక్రమ ఫీజు వేధింపులపై చర్యలు తీసుకోవాలని కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కి గురువారం హెచ్ఆర్‌డిఏ నేతలు విజ్ఞప్తి చేశారు. ఫీజు వసూళ్లపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఉన్నప్పటికీ... ఎంక్యూ1 రౌండ్2 కేటాయించిన విద్యార్థుల నుండి బలవంతంగా పూర్తి ఫీజులను డిమాండ్ చేస్తున్న కాలేజీలపై చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్‌కి ఫిర్యాదు చేసింది. ప్రధానంగా రెండు కాలేజీలపై హెచ్ఆర్‌డిఏ తన ఫిర్యాదులో పేర్కొంది. విద్యాపరమైన వేధింపులతో బెదిరించడమే కాకుండా, వెంటనే ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని హెచ్ఆర్‌డిఏ పేర్కొంది. ఫీజు వసూలు మూలంగా విద్యార్థులు, తల్లిదండ్రులపై తీవ్ర ఒత్తిడి ఏర్పడిందన్నారు. తక్షణమే స్పందించి, హైకోర్టు మధ్యంతర ఆదేశాలను పాటించేలా ప్రైవేటు మెడికల్ కాలేజీలకు ఆదేశాలు జారీ చేయాలని, చట్టవిరుద్ధమైన ఫీజు వసూళ్లను నిరోధించాలని హెచ్ఆర్‌డిఏ డిమాండ్ చేసింది.

## బిసిల సామాజిక స్థితిగతులపై సమగ్ర నివేదిక

### సంచార జాతులుగా 50 కులాలు .. రాష్ట్ర బిసి కమిషన్ కీలక నిర్ణయం.. రాష్ట్ర సర్కార్‌కు త్వరలో తుది సిఫార్సులు

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** తెలంగాణలో బీసీల సామాజిక ఆర్థిక స్థితిగతులపై సమగ్ర నివేదికను త్వరలో ప్రభుత్వం ముందుంచనున్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలోని 50 కులాలను సంచార జాతులుగా గుర్తిస్తూ రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం సంచార కులాలు (సంచార తెగలు-ఎన్‌టి), సెమీ సంచార తెగలు (ఎస్ఎన్‌టి), డీ-నోటీఫైడ్ తెగలు (డిఎన్‌టి) సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కేంద్రం కమ్యూనిటీల (ఎస్ఇడి(సీడ్)) ఆర్థిక సాధికారత పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని సంచాల జాతులను ఈ సీడ్ పథకం ద్వారా ఆర్థిక లబ్ధి పొందేందుకు వీలుగా బీసీ కమిషన్ ప్రతిపాదన చేసింది. ఈ కేంద్ర ప్రత్యేక పథకం కింద డిఎన్‌టి, ఎన్‌టి, ఎస్ఎన్‌టి అభ్యర్థులకు పోటీ పరీక్షలకు హాజరు కావడానికి నాణ్యమైన కోచింగ్‌ను అందిస్తుంది. అలగే ఆయుష్మాన్ భారత్ కింద ఆరోగ్య బీమా కవరేజీని అందిస్తుంది. ప్రతి కుటుంబానికి సంవత్సరానికి రూ.5 లక్షల వరకు ఉచిత నగదు రహిత చికిత్సను నిర్ధారిస్తుంది. ఇక జీవనోపాధి కార్యక్రమాల అమల్లో చిన్న సమూహాలకు మద్దతు ఇవ్వడానికి కమ్యూనిటీ స్థాయిలో జీవనోపాధి చొరవలను సులభతరం చేస్తుంది. మురికివాడల లాంటి పరిస్థితుల్లో నివసించే కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం కోసం ఆర్థిక సహాయం అందిచడంతో పాటు, పిఎంఎవై (గ్రామీణ మరియు పట్టణ) కోసం సహాయం అందించబడుతుంది. ఈ పథకంలో లబ్ధి పొందాలంటే అభ్యర్థులకు డిఎన్‌టి సర్టిఫికెట్ తప్పనిసరి. ప్రస్తుతం ఈ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియలో ఉన్న ఇబ్బందులను తొలగించాలని కమిషన్ భావిస్తోంది. ఈ ధృవీకరణ పత్రాలను తహశీల్దార్ స్థాయి నుండి కాకుండా నేరుగా రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డిఓ) ద్వారా జారీ చేయాలని ప్రభుత్వానికి కమిషన్ సూచించింది. దీనివల్ల ప్రక్రియలో పారదర్శకత పెరగడమే కాకుండా, అర్హులైన సంచార జాతులకు వేగంగా లబ్ధి చేకూరుతుందని కమిషన్ భావిస్తోంది. ఈ సంచార వర్గాలకు డిఎన్‌టి సర్టిఫికెట్లను తహశీల్దార్ కాకుండా నేరుగా ఆర్‌డిఓ ద్వారా జారీ చేయాలని ప్రభుత్వానికి సూచించింది.

# మదర్ డెయిరీ ఛైర్మన్‌గా మళ్లీ మధుసూదన్‌రెడ్డి

### ఇన్‌ఛార్జి ఎండి కృష్ణ రాజీనామా

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కీలకమైన నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార యూనియన్ లిమిటెడ్ (నార్మాక్స్ మదర్ డెయిరీ) లో నాటకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.

గతంలో ఛైర్మన్‌గా పనిచేసిన వ్యక్తి తప్పనిసరి పరిస్థితుల్లో ఇటీవల రాజీనామా చేయగా, ఆ స్థానంలో ఎన్నికైన కొత్త ఛైర్మన్ నెల రోజులు తిరగకుండానే ఆయన కూడా రాజీనామా చేశారు. మళ్లీ ఇప్పుడు మొదటి సారి ఛైర్మన్ పదవికి రాజీనామ చేసిన వ్యక్తినే మరోసారి ఛైర్మన్ పదవికి ఎన్నుకోవడం విశేషం. ఆయన ఛైర్మన్ కాగానే డెయిరీ ఎండి అదే సమయంలో రాజీనామా చేయడంతో సంస్థలో అసలు ఏం జరుగుతుందనేది చర్చనీయాంశమైంది. ఇక మదర్ డెయిరీ ఛైర్మన్ పదవికి మళ్లీ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి ఎన్నికయ్యారు. హైదరాబాద్ లోని మదర్ డెయిరీ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో 14 మంది పాలకవర్గం సభ్యులు తిరిగి మధుసూదన్‌రెడ్డినే ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎనుకున్నారు.

ఇదే సమయంలో మదర్ డెయిరీ ఇన్‌చార్జి ఎండీగా కొనసాగుతున్న కృష్ణ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కొత్త ఇన్‌చార్జి ఎండీగా అబ్దుల్ గఫార్‌ను నియమించారు. కాగా రైతులకు చెల్లించాల్సిన రూ.12కోట్ల పెండింగ్ పాల బిల్లులను పాలకవర్గంలోని వారెవరైనా చెల్లించడానికి ముందుకొస్తే తాను రాజీనామా చేస్తానని మధుసూదన్‌రెడ్డి ప్రకటించగా డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ముందు కొచ్చారు. దీంతో జనవరి 8న మధుసూదన్‌రెడ్డి ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు. అదే రోజు ఛైర్మన్‌గా ఎన్నికైన ప్రభాకర్‌రెడ్డి డిస్ట్రిబ్యూటర్లను ఒప్పించి రూ.3కోట్లను రైతులకు చెల్లించారు.

మిగతా బకాయిలను చెల్లించాలని పాలకవర్గం సభ్యులు ఒత్తిడి పెంచడంతో తన ఆరోగ్యం సహకరించడం లేదని పేర్కొంటూ జనవరి 23న ఆయన రాజీనామా చేశారు. దీంతో తాజాగా మదర్ డెయిరీలో పాలకవర్గం సభ్యులు సమావేశమై, తిరిగి మధుసూదన్‌రెడ్డినే ఛైర్మన్‌గా ఎన్నుకున్నారు.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ టి.జి. లిమిటెడ్
"ఆదాచేయబడిన విద్యుత్ ఉత్పత్తి చేసినట్లే"
టెండర్ ప్రకటన నం : 18/25-26
(A) Spec.T-122/A (ఇ-ప్రొక్యూర్‌మెంట్) (G) RR-II ... 33/11Kv SS ... 69 ... SCADA. (B) Spec.T-123/A (ఇ-ప్రొక్యూర్‌మెంట్) (G) SD SCADA ... Hyd ... 33/11Kv SS ... (c) Spec-Tr-153(G) SCADA ... ECR 1912 ... (D) Spec No-T-154 (G) ... SS ... 33/11Kv ... CRS ... (E) T-155 (SC ...) SS ... 33/11Kv ... PTR ... MS ... (F) T-156 (G) 33/11Kv ... https://tgsouthernpower.org) ... ఫోన్ నం: 040-23431333/1112/1125).
DIPR.NO. 14666-PP/CL/ADVT/1/2025-26 తేది: 29.01.2026 ... SCADA.

వార్త

మనుషులందరూ వృద్ధులుగా మారతారు.
కానీ మంచివారుగా మారటం అరుదు.
-స్వీడెన్ బర్గ్

# మృత్యుపాశాలుగా మూఢనమ్మకాలు

అన్నీ తెలిసిన వారు అమావాస్యనాడు చనిపోతే ఏమీ తెలియనివారు ఏకాదశి రోజు చనిపోయినట్లుగా ఉంది. ఒకపక్క సాంకేతిక పరిజ్ఞానంతో ఎంతో అభివృద్ధి చెందుతున్నా మరొక పక్క సైన్స్ విజ్ఞానం రోజురోజుకు పురోగాభివృద్ధివైపు పరుగులీడుతున్నా, మరొకపక్క మూఢనమ్మకాలు సమాజాన్ని అతలాకుతలం చేస్తుండడం అత్యంత దురదృష్టకరం. అందులోనూ ఏమీ తెలియని అమాయకులు మూఢనమ్మకాలలో మునిగిపోతున్నారంటే కొంతవరకు అర్థం చేసుకోవచ్చు. కానీ అంతోఇంతో చదువుకున్నవారు లోకజ్ఞానం ఉన్నవారు పట్టణాలకు, నగరాలకు చేరువలో నివాసాలు ఉంటున్నవారు సైతం ఈ మూఢనమ్మకాలతో బజారు పాలవుతున్నారు. ఒకరుకాదు ఇద్దరు కాదు దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు వీధినపడుతున్నాయి. ఎన్నోయేళ్లుగా కూడబెట్టుకున్న బంగారం, డబ్బులే కాదు, చివరకు ప్రాణాలుకూడా పోగొట్టుకుంటున్నారు. ఎంతోమంది తమ కుటుంబ సభ్యులను తమ కళ్లముందే భూత వైద్యుల, మంత్రాల పేరుతో పెట్టే చిత్రహింసలనుచూస్తూ మనస్సును చంపుకొని ఏదో ఆశతో ఎదురుచూసి చివరకు కళ్లముందే ప్రాణాలు వదిలిన తర్వాత కానీ వారికి అసలు విషయం బోధపడడం లేదు. కానీ అప్పటికే జరగాల్సింది జరిగిపోతున్నది. ఆ మధ్య నెల్లూరు జిల్లాలోఇరవైరెండేళ్ల యువకుడు మతిస్థిమితం కోల్పోవడంతో దెయ్యం పట్టిందని ప్రచారం చేశారు. దానికి సలహా ఎవరు ఇచ్చారో ఏమోకానీ స్వామిజీ వద్దకు తీసుకువెళ్లారు. దెయ్యం పట్టిన మాట వాస్తవమేనని దాన్ని పూర్తిగా వదిలిస్తామని నమ్మబలికి పసుపు, కుంకుమ వంటివి అన్నీ చల్లి చుట్టుపక్కల వారిని పిలిచి అందరు చూస్తుండగానే నోట్లో గుడ్డలు కుక్కి చిత్రహింసలు పెట్టారు. కొంతసేపటికి ఆ యువకుడిలో చలనం లేకుండాపోయింది. దీంతో దెయ్యం పోయిందంటూ ఆనందోత్సవాలు వ్యక్తం చేశారు. ఆ తర్వాత కొందరు గ్రామపెద్దలు వచ్చి యువకుడు చనిపోయాడని చెప్తేకానీ వారికి అసలు విషయం తెలియదు. భూతవైద్యం పేరుతో నిండుప్రాణం గాలిలో కలిసిపోయింది. అలా ఎన్నో ప్రాణాలు ఈ మూఢనమ్మకాలకు బలైపోతున్నాయి. ఆ మధ్య రాయలసీమలో ఒక జిల్లాలో నరబలి ఇచ్చిన సంఘటన కూడా వెలుగులోకి వచ్చింది. తమ వ్యతిరేకులను మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పెట్టేందుకు కొందరు చేతబడి,బాణామతి,చిల్లంగి అంటూ అనేక పేర్లతో క్షుద్రపూజలు చేస్తూ భయపెడుతున్నారు. గ్రామాల్లో విషజ్వరాలు వ్యాపించినప్పుడు ఇలాంటి క్షుద్ర పూజలు, జంతుబలులు చోటు చేసుకుంటున్నాయి. కొన్నిసార్లు కొందరు చేతబడులు చేయడంవల్లనే తమ కుటుంబాలకు, గ్రామాలకు నష్టం జరుగుతున్నదని అపోహతో ఆరోపణలు చేసి దాడులకు పాల్పడి ప్రాణాలు తీసిన సంఘటనలు కూడా కోకొల్లలు. కొన్నిసార్లు క్షుద్ర పూజలు చేశారనే అనుమానంతో వారి కుటుంబాలను సజీవంగా దగ్ధం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. కొందరు బంగారం భూమిలో ఉందంటూ క్షుద్రపూజలు చేసి నరబలులు ఇస్తేనిధులు దక్కించుకోవచ్చునన్న భ్రమతోఅన్నెం పున్నెం ఎరుగని చిన్న పిల్లలను బలిచ్చిన సంఘటనలు హైదరాబాద్ నగరపరిసరాల్లో గతంలో జరిగాయి.ఉభయ రాష్ట్రాలతోపాటు, బీహార్,ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్,హర్యానా, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర తదితర పదిహేను రాష్ట్రాల్లో క్షుద్రపూజలు దశాబ్దాల తరబడి వేళ్లూనుకుపోయాయి. దేశవ్యాప్తంగా వీటి కారణంగా గతదశాబ్దకాలంలో రెండు వేల మందికిపైగా హత్యలకు గురైనట్లు సమాచారం.అధిక శాతం మహిళలే బలైపోతున్నారని జాతీయ గణాంకాల శాఖ రికార్డులు వెల్లడిస్తున్నాయి. జార్ఖండ్‌లో చేతబడులు చేశారన్న అనుమానంతో 2013లోనే దాదాపుఅరవైమంది కిపైగా చంపారు. ఇక మహారాష్ట్రలోని విదర్భప్రాంతంలో పదకొండు మంది చిన్నారులను బలిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని ఒక స్వామిజీ ఇచ్చిన సలహా మేరకు ఒక జంట అత్యంత కిరాతకంగా మారి అభంశుభం తెలియని ఐదుగురు పసికందులను పొట్టనపెట్టుకున్నారు. ఆతర్వాత పోలీసు దృష్టికి వెళ్లడంతో వారికి సంకెళ్లు వేయడంతో అవి ఆగిపోయాయి.దేశవ్యాప్తంగా వెలుగుచూడనిపోలీసుల దృష్టికి రాని కేసులెన్నోఉన్నాయి. జరగాల్సిన నష్టం జరిగింది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు వేసే సవాలక్ష ప్రశ్నలకు జవాబులు చెప్పలేక,కోర్టుల చుట్టూ తిరగలేక కొత్త ఇబ్బం దులు ఎదుర్కోవాల్సి వస్తుందన్న భయంతో పోలీసుస్టేషన్ మెట్లెక్కడానికి భయపడుతున్నారు. అన్నిటికంటే ముఖ్యంగా కొన్నిసందర్భాల్లో ప్రత్యర్థులను మట్టుపెట్టడానికి బాణామతి లాంటి క్షుద్రపూజలు చేశారనిముద్ర వేసి చంపుతున్న సంఘటనలు తరచుగా చోటుచేసుకుంటున్నాయి. 2022లోనే దేశవ్యాప్తంగా ఎనభై ఐదుకుపైగా బాణామతి హత్యలు జరిగాయి. గత దశాబ్దకాలంలో పదకొండువందల ఎనభైనాలుగు మంది ప్రాణాలు కోల్పోయారు. ఇలా ప్రతి సంవత్సరం వెయ్యో రెండువేల మందో హతులవుతున్నట్లు సమాచారం. బాణామతి, చేతబడి వంటి మూఢనమ్మకాలతో జరిగే దాడులను నిలువరించాలని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి 2021లో తీర్మానాన్ని ఆమోదించింది. ఇకదాడుల గురించిప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. మంత్రగాళ్లు, మంత్రగత్తెలంటూ విచక్షణారహితంగా కొట్టి హింసిస్తున్నసంఘటనలు కోకొల్లలు. బీహార్‌లో 1999లోనే బాణామతి కార్యకలాపాల నిరోధక చట్టం వచ్చినా ఆశించిన ఫలితాలు చేకూరడంలేదు.ప్రభుత్వమేకాదు సమాజం, మేధావులు అందరూ ఈ సమస్యపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే ప్రయత్నాలు జరగాలి.

నీవు జీవితంలో అభివృద్ధి చెందాలంటే నిత్యం నూతన మార్గాలు అన్వేషించాలి.



రాబర్ట్ ఆంథోని

బుద్ధిహీనులూ, మృతులూ మాత్రమే తమ అభిప్రాయాలను మార్చుకోకుండా ఉంటారు.



లోవెల్

# నేటి బాలలే రేపటి బానిసలా!

**ప్రభుత్వ పాఠశాలలో డ్రాప్‌అవుట్ పెరిగి ప్రభుత్వ పాఠశాలలు మూతపడటానికి, నిరక్షరాస్యత పెరగటానికి, విషతుల్యమైన మనసు కలిగిన కొద్దిమంది ఉపాధ్యాయులు పాఠశాలలో బోధనసరిగా చేయకపోవడం వల్ల, నాణ్యమైన విద్య అందక దేశానికి నైపుణ్యంగల మానవవనరులు అందటం లేదు. దీనంతటికీ ప్రధాన కారణం మానవత విలువలు, రాజ్యాంగ విలువలను అర్థం చేసుకోలేని కొందరు దుర్మార్గపు ఆలోచనపరులైన ఉపాధ్యాయుల వలననే గ్రహించి తులసివనంలో గంజాయి మొక్కలైనా ఈ కీచక ఉపాధ్యాయులను పీకి పారేస్తే పాఠశాల విద్యావ్యవస్థకు తద్వారా యావత్భారత దేశానికి మంచి రోజులువస్తాయి.**

డా.బోరుగడ్డ సుబ్బయ్య

భారతదేశ భవిష్యత్తు నేటిబాలలపై ఆధారపడి ఉన్నదని, నేటిబాలలే రేపటిపౌరులు అంటూ నినాదించి స్వాతంత్ర్యనాంతరం భారతదేశపునర్నిర్మానానికి స్వాతంత్ర్య సమరయోధులు నాందిపలికారు. అదే క్రమంలో 1947 తరువాత దేశంలోని పౌరులందరికీ సమాన అవకాశాలు, సమానగౌరవం, సమానవిలువ ఉండేవిధంగా భారతదేశ ప్రజలు భారత రాజ్యాంగాన్ని రచించుకుని దేశనిర్మాణానికి అంకురార్పణచేశారు. కొద్దిమేర అభివృద్ధి సాధించగలిగాము. కానీ, గత కొన్ని సంవత్సరాలుగా పరిస్థితులను పరిశీలిస్తే దేశనిర్మాణం కాస్త విభజన విధ్వంసం కూల్చివేతలవైపుకు మనుషుల మధ్య ద్వేషం పెరుగుతున్నట్లు ఉంది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడజిల్లా పిఠాపురం మండలం జడ్పీ పాఠశాలలో 01డిసెంబర్ 2025న ముగ్గురు ఉపాధ్యాయులు అదే పాఠశాలలో చదువుతున్న బాలలను వారి కులాలపేరుతో నీచంగా అవమానకరంగా వేధించటం, ఎస్సీలు, ఎస్టీలు ఏమీ చేయలేరు అంటూ నిరంతరం అవహేళన చేస్తూ విద్యపై ఆసక్తి తగ్గేవిధంగా నిరుత్సాహపరుస్తూ ఆడపిల్లలను చెడ్డపేరుతో వంకరగా పిలుస్తున్నారని ఆ పసిహృదయాలు తల్లడిల్లిపోయి మీడియా ముందుకు వచ్చి చెప్పేవరకు ఆ విషయాలు బయటకురాలేదు అంటే అమాయక పసిపిల్లలను కీచక ఉపాధ్యాయులు ఎప్పటి నుండో మానసికంగా, శారీరకంగా ఏడిపిస్తున్నారని అర్థమవుతుంది. దీనిపై జిల్లా కలెక్టర్ మండల విద్యాధికారిచే విచారించి నిజనిర్ధారణ అయిన తర్వాత కులవివక్ష చూపిన ఉపాధ్యాయులను సాధారణ బదిలీ చేసి వదిలివేశారు. మరల ఆ పసి హృదయాలు అడుగుతున్నాయి. ఈ విలువలులేని (కీచక) ఉపాధ్యాయులు ఎక్కడకువెళ్లారో అక్కడ కూడా ఎస్సి విద్యార్థులను అవహేళన చేస్తూ అవమానిస్తూ కులవివక్షను చూపుతారుకదా అప్పుడు బదిలీ అనేది ఏరకంగా శిక్షఅవుతుంది అని ప్రశ్నిస్తున్నారు. కుల వివక్షకు అంతంలేదు అన్నట్లుగా ఆప్రశ్నలకు కూడా సమాధానం లేదు.అదే నియోజకవర్గంలో ఏప్రిల్ 2025న మల్లాం గ్రామంలో కులంపేరుతో కొన్ని కుటుంబాలను గ్రామ బహిష్కరించినప్పుడు నిందితులను శిక్షించినట్లయితే ఇది జరిగి ఉండకపోయేది అంటే తప్పు చేసిన వాడిని చట్టప్రకారం శిక్షించకపోతే నిందితులను మరల తప్పుచేయమని ప్రభుత్వాలే ప్రోత్సహిస్తున్నాయని అర్థం చేసుకోవాల్సి వస్తుంది. ఈవిషయాలు ప్రజలు అర్థం చేసుకున్న రోజు ప్రజలే తిరుగుబాటు చేసి శిక్షిస్తారు.ఆంధ్రప్రదేశ్లోని శ్రీకాకుళం జిల్లాలో పొందూరులోని ఒక విద్యాలయంలో మహిళాప్రిన్సిపల్ ఒకషెడ్యూల్డ్ తెగకు చెందిన విద్యార్థినిని, వాళ్ళఅమ్మను కులంపేరుతో పదేపదే తిట్టుతూ అవమానపరుస్తూ,కించపరుస్తూ, ఉంటే ఫిర్యాదు చేయటానికి వీలులేదు అని సమగ్రశిక్ష ఏపీసి సైతం బెదిరించటం దేనికి సంకేతం. అదేవిధంగా శ్రీకాకుళం జిల్లాలోని మెలియపుట్టి మండలం బందపల్లి బాలికలట్రైబల్ ఆశ్రమ పాఠశాలలోని ఉపాధ్యాయునిగా ఉన్న ఉపాధ్యాయునిరాలు కుర్చీలో కాళ్లుచాపుకొని మొబైల్ మాట్లాడుతూ ఇద్దరు విద్యార్థులచే బలవంతంగా కాళ్లకు మసాజ్ చేయించుకుంటుంది. ఆ ఉపాధ్యాయురాలు ఆ విద్యార్థినీలను ఎలాచూస్తుంది అని ఆలోచిస్తే తన ఇంట్లోపని చేసే పనివారివలె లేదా బానిసలవలె వీరిని ఆమెభావించి వీరిచేత ఆవిధంగాచేస్తుంది.తర్వాత ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సీతంపేటవారు విచారణ జరిపి సస్పెండ్ చేశారు. ఇదే విధంగా మనరాష్ట్రంలో గుంటూరు జిల్లాకు చెందిన ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో చదువుతున్న బాలికలచే ప్రిన్సిపల్ క్వార్టర్స్‌లో ఉండేఉపాధ్యాయులకు నీళ్ల బకెట్లను బలవంతంగా మోయించటం ఈమధ్యకాలంలో పేపర్లో చూసాం. అమలాపురం దగ్గర ఐ.పోలవరం మండలంలోని ఆరో తరగతి చదివే బాలికకు చాక్లెట్లుఇస్తూ మాయమాటలు చెప్పి ఉపాధ్యాయుడు అత్యాచారానికి పాల్పడ్డఉదాంతం,



అదే విధంగా కాకినాడ జిల్లా తుని గురుకుల పాఠశాలలోని విద్యార్థిని తాతనులంటూ తీసుకువెళ్లి బాలికపై అత్యాచారం చేయటం,తిరుపతి సంస్కృతి విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయుడు విద్యార్థినిపై అత్యాచారం చేయటం, సత్యసాయి జిల్లాలో 15 సంవత్సరాల ఎస్సీ బాలికను రెండు సంవత్సరాలుగా 17 మంది అత్యాచారం చేసిన సంఘటన, మొబైల్ దొంగతనం చేసిందని ఆరోపణలు 17సంవత్సరాల ఆదివాసీ బాలికను బట్టలిప్పి దారుణంగా దాడిచేసి వేడికర్రతో కాల్చిన సంఘటనలు ఇవన్నీ కూడా ఆంధ్రప్రదేశ్లోనేజరిగాయి.ఉత్తరప్రదేశ్, హర్యానా,మధ్యప్రదేశ్ పాఠశాలల్లోని బాలబాలికలపై జరిగిన దాడులు ఎన్నో చూస్తూనే ఉన్నాం. హర్యానాలో మంచినీళ్ల కుండలో నీళ్లుతాగాడని ఒకఎస్సీ బాలుడును ఉపాధ్యాయుడు కొట్టిచంపాడు. మధ్యప్రదేశ్లో బాగా చదివే ఒక ఆదివాసీ బాలిక మొదటి బెంచీలో కూర్చున్నదని కొట్టటం, పిల్లలకు ఫలహారాన్ని నేలపై న్యూస్పేపర్లో పెట్టడం. ఈ విధంగా భారతదేశవ్యాప్తంగా బాలబాలి కలను కులంపేరుతో చిత్రహింసలకు గురిచేయటం అమాన వీయం. ఇది దేశానికే ప్రమాదం.దేశంలోకానీ, రాష్ట్రంలోకానీ ఒక ఉపాధ్యాయుడు అవ్వాలంటే ఇంటర్ లేదాడిగ్రీపూర్తి చేసి విద్యాబోధనలో డిప్లమోలేదా బ్యాచిలర్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ పూర్తిచేసి టీచర్ అర్హతపరీక్ష క్వాలిఫై అయిన తర్వాత డీఎస్సీరాసిన వారిలో ముందువరుసలో ఉన్నవారిని ఎంపిక చేస్తారు. ఉపాధ్యాయుడు సమాజానికి మూలస్తంభం వంటి వారు. చాలా హేతుబద్ధతతో, శాస్త్రీయంగా కులాలకు,మతాలకు, ప్రాంతాలకు, లింగ,భాషభేదాలను అధిగమించి మను షులందరూ సమానమే అనే మానవత్వాన్ని బోధిస్తూ మాన వత్వంగల సమసమాజాన్ని నిర్మిస్తారు. కానీపైన పేర్కొన్న సంఘటనలో ఉన్నదోషులందరూ ఉపాధ్యాయులేననిగ్రహిస్తే సమాజం ఎటుపోతుందనని మనం అర్థంచేసుకోవాలి. సామాజిక సమస్యలపై స్పందించే ఉపాధ్యాయసంఘాలు, విద్యార్థి సంఘాలు, మహిళాసంఘాలు, ప్రజాసంఘాలు సభ్యసమాజం బాధితుల కులాలను బట్టి స్పందించటం కూడా ఇటువంటి నీచులను వెనకేసుకుని రావటమే అవుతుంది. అభంశుభం తెలియని అమాయక పసిపిల్లలపట్ల క్రూరమృగాల వలెప్రవర్తిస్తున్న వీరివలన భారతదేశానికి ఏమీలాభంలేదు సరికదా, స్వాతంత్ర్యపూర్వపు రోజులను గుర్తుచేస్తున్నాయి. ఇది మనిషిమనసులో ఉన్నవిషతుల్యమైన ఆలోచనలు మనిషిని మనిషిగా చూడలేని మనస్తత్వం ఉన్న అశాస్త్రీయమైన మూఢనమ్మకాల సిద్ధాంతాలను నమ్మడంవల్ల మానసికరోగులుగా ప్రవర్తిస్తారు.వీటిని ప్రభుత్వాలు వెంటనే నిషేధించాలి. మనుషులందరూ సమానమే అనే సోదరభావాన్ని ప్రచారం చేయాలి.సాటి మనిషిని మనిషిగా చూడలేనివాడు మానసిక రోగి అవుతాడు, వాడు మనిషిగా అప్పుడే చనిపోయినట్లు వాడు ఉండవలసినది పిచ్చి ఆసుపత్రిలో అంతేకానీ పాఠశాలల్లో ఉండే అర్హతలేదు. ప్రభుత్వపాఠశాలలో ఎవరైతే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారో వారిపిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలి.లేకపోతే ప్రభుత్వపాఠశాలల్లో చదివే నిరుపేద తక్కువ కులాల పిల్లలు బాగా చదువుకుని ప్రైవేటు పాఠశాలలో చదివే ఉపాధ్యాయుల పిల్లలకు పోటీ వస్తారేమోనన్నా సంకుచిత భావంతో ఈపిల్లల పట్లనీచంగానూ, హేయంగాను వ్యవహరిస్తున్నట్లు అర్థమవుతుంది. అదే విధంగా ఈనిరుపేద కులాల పిల్లలు తరతరాలుగా వాళ్ల తల్లిదండ్రులవలె భూస్వాములకు, పెత్తందారులకు బానిసలుగా తయారు చేయాలనే ఉద్దేశంతో ఒక కుట్రపూరితమైన పథకం ప్రకారం చేస్తున్నారేమో అనేవిధంగా భావించాల్సి వస్తుంది. బాలబాలికలపట్ల కుల, మత,ప్రాంత,భాష, లింగ భేదాలతో వివక్షచూపుతూ మానసికంగా శారీరకంగా హింసిస్తున్నారు. వారిని ఉద్యోగాల నుంచి తొలగించి చట్టప్రకారం శిక్షించి వారి ఆస్తులను ప్రభుత్వం వారు జప్తుచేసుకుని రాష్ట్రంలో కులనిర్మూలన ప్రాజెక్ట్ ఏర్పాటు చేసి రాష్ట్రంలో కులనిర్మూలన వైపుకు సమానత్వంవైపుకు బాటలువేయాలి. ఈ రోజుప్రభుత్వ పాఠశాలలో డ్రాప్‌అవుట్ పెరిగి ప్రభుత్వ పాఠశాలలు మూతపడటానికి, నిరక్షరాస్యత పెరగటానికి, విషతుల్యమైన మనసు కలిగిన కొద్దిమంది ఉపాధ్యాయులు పాఠశాలలో బోధనసరిగాచేయకపోవడంవల్ల, నాణ్యమైన విద్య అందక దేశానికి నైపుణ్యంగల మానవవనరులు అందటంలేదు. దీనంతటికీ ప్రధాన కారణం మానవత విలువలు, రాజ్యాంగ విలువలను అర్థంచేసుకోలేని కొందరు దుర్మార్గపు ఆలోచన పరులైన ఉపాధ్యాయుల వలననే గ్రహించి తులసివనంలో గంజాయి మొక్కలైనా ఈ కీచిక ఉపాధ్యాయులను పీకి పారేస్తే పాఠశాల విద్యావ్యవస్థకు తద్వారా యావత్భారత దేశానికి మంచి రోజులువస్తాయి. ●

# కోకో గింజలకూ ధరల విధానం అవసరం

కె. శ్రీనివాస్

రాష్ట్రంలో 75 వేల ఎకరాలలో కోకో సాగు ఉన్నది. ప్రధానంగా కొబ్బరి, ఆయిల్ పామ్అంతర పంటగా రైతులు కోకో సాగు చేస్తున్నారు. కొబ్బరి తోటలకు తెగుళ్లు ఆశించడం, ఈసంవత్సరం మినహా గత అనేక సంవత్సరాలుగా కొబ్బరికి ధరలేకపోవడం ప్రధానంగా కొబ్బరి రైతులు సంక్షోభం ఎదుర్కోవడంవలన రైతులకు కోకోపంట మీదనే ఆధారపడ్డారు. కోకో అంతరపంట కాస్త ప్రధాన పంటగామారింది. ప్రపంచంలో 20 దేశాలలో కోకో పంట సాగు ఉంటే 20వ దేశంగా భారతదేశం ఉంది. మనదేశంలో కూడా కేరళ, కర్ణాటక,తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోనే కోకో పంట సాగు ఉంది. చాలాకాలంగా కోకో గింజలు ధరలుతక్కువగా ఉండటం వలన గతం కంటే కేరళలో సాగు విస్తీర్ణం తగ్గించుకుని సుగంధ ద్రవ్యాల పంటల వైపు రైతులు మరలారు. మన రాష్ట్రంలో మాత్రం కోకో పంట విస్తీర్ణం రోజు రోజుకి పెరుగుతోంది. మనదేశ అవసరాలకు కావలసిన కోకో గింజలు 20శాతం మాత్రమే దేశంలో ఉత్పత్తి జరుగుతున్నదని, 80శాతం కోకో గింజలు, కోకో పౌడర్, బట్టర్, ఇతర ఉత్పత్తులను దిగుమతులు చేసుకుంటున్నాము. కోకో దిగుమతులపై దిగుమతి సుంకాలు నామమాత్రంగా ఉండడం వలన విదేశీ కోకో ఉత్పత్తులను దిగుమతులు చేసుకుని దేశీయంగా రైతులకు అంతర్జాతీయ మార్కెట్ ధరలను చెల్లించడంలేదు. ప్రపంచ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కోకో రైతులకునష్టం కలిగిస్తున్నాయి. భారత్ యూరోప్ యూనియన్ మధ్య జరుగుతున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో భాగంగా చాక్లెట్ ఉత్పత్తులపై సుంకాలు పూర్తిగా ఎత్తివేస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. కోకో ఉత్పత్తులపై నామమాత్రపు దిగుమతి సుంకాలు ఉండడం వలన కంపెనీలు విదేశీ కోకో ఉత్పత్తులను చేసుకొని దేశీయంగా రైతులను నష్టపరుస్తున్నాయి. కోకో దిగుమతులపై దిగుమతి సుంకాల పెంచేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి పోయి జీరో శాతం దిగుమతి సుంకాలకు ఒప్పందాలు చేసుకోవడం వలన కోకో రైతులు మరింతగా నష్టపోయే పరిస్థితి దాపురిస్తుంది. విదేశీ కోకో ఉత్పత్తుల దిగుమతులను నిలుపుదల చేయాల్సి ఉంది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు పామాయిల్ పై దిగుమతి సుంకాలు ఎత్తి వేయడంతో దేశీయంగా పామాయిల్ రైతులు నష్టపోయారు. ఎన్నికల అనంతరం దిగుమతి సుంకాలు పెంచడంతో ఆయిల్ పామ్ గెలల ధర పెరగడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. రైతులు ఎంతో కష్టపడి కోకో గింజలు ఉత్పత్తి చేస్తుంటే వాటి కొనుగోలుకు, మార్కెటింగ్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను గాలికి వదిలేయడం అన్యాయం. 30 ఏళ్లకు పైగా నుండి రాష్ట్రంలో కోకో పంట సాగు అవుతుంటే ఇంతవరకు కోకో గింజలకు ధర నిర్ణయం పాలసీ లేకపోవడం మరీ దారుణం. రాష్ట్రంలో పామాయిల్ రైతులు ఆయిల్ పామ్ గెలలకు ధర నిర్ణయ సూత్రాన్ని సాధించుకున్నారు. ఆయిల్ పామ్ గెలలకు క్రషింగ్ ద్వారా వచ్చే ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేట్ (ఓఇఆర్) ఆధారంగా అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా రూపొందించిన ఫార్ములా ప్రకారం ప్రతినెల ధర నిర్ణయం జరుగుతుంది. అదేవిధంగా కోకో గింజలకు కూడా అంతర్జాతీయ మార్కెట్ ధరను అనుసంధానిస్తూ ఫార్ములా రూపొందించాలని కోకో రైతాంగం కోరుతున్నారు. అందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపడతామని గత సంవత్సరం హామీ ఇచ్చారు. ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం కోకోగింజల ధరల పాలసీ ప్రకటించలేదు. మరలా కంపెనీల ఇష్టారాజ్యంగా మారింది. కోకో గింజలకు కంపెనీలు అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వకుండా మోసం చేసిన ఫలితంగా గత ఏడాది రూ.500 కోట్లకు పైగా రాష్ట్ర కోకో రైతులు నష్టపోయారు. 2025 ఫిబ్రవరి నుండి మే వరకు నాలుగు నెలల పాటు సుదీర్ఘ పోరాటాన్ని రాష్ట్రంలో కోకో రైతులు సాగించారు.ఫలితంగా రాష్ట్రప్రభుత్వం జోక్యం చేసుకొని రూ.50ప్రోత్సాహం అందించి కిలో కోకోగింజలకు రూ.500 ధర కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం కోకోరైతులకు ప్రోత్సాహం పేరుతో రూ.15 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రకటించింది. అయితే రైతుల నష్టపోయింది రూ.500 కోట్లు పైనే.ఈ సంవత్సరం జనవరి నుండి కోకో గింజల సీజన్ ప్రారంభమైంది. ప్రస్తుతం కిలో కోకో గింజలను కంపెనీలు రూ.350లకు కొనుగోలు ప్రారంభించి రైతుల ఆందోళనలతో రూ.400 లకు పెంచి కొనుగోలు చేస్తున్నారు.రాష్ట్రంలో కోకో విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర కోకో పరిశోధనా ఏర్పాటు అత్యవసరం. ●

# ప్రజావాక్కు



### ఆపద్ధర్మ ఒప్పందం అయినా ఉభయతారకం

**భారత్**,యూరోపియన్ యూనియన్ నడుమ కుదిరిన స్వేచ్ఛా వాణిజ్యఒప్పందం అన్ని విధాలా ఘనం ఉభయతారకం. మనప్రధాని వర్ణించినట్టుఇది అన్ని ఒప్పందాలకు తల్లిలాంటిదే.అంతకుమించి ఇరువురకు అత్యవసరమైనది. రెండు దశాబ్దాలుగా పడిఉన్న ప్రతిపాదన నేడు కార్యరూపం దాల్చడంలో ఇరువైపులా జరిగిన కృషి అభినందనీయం.అమెరికామిత్ర,శత్రు బేధం చూపించకుండా అందరినీ తన సుంకాల పెంపు తర్జన చూపించిన నేపథ్యంలో ప్రపంచ వాణిజ్యం కుదుపుకి లోనైంది. అందుకు భారత్ గానీ యూరోప్ గానీ మినహాయింపు కాదు.ఈ స్థితిలో మూలపడి ఉన్న ద్వైపాక్షిక ఒప్పందాలకు బూజు దులిపి క్రియాశీలకం చెయ్యడం అవసరంగా మారింది.నేడు తుది రూపుతోఖరారైంది.27దేశాల యూరోప్ సమాఖ్య భారత్ ఎగుమతులకు మంచి మార్కెట్‌నిచూపెడుతోంది. అలాగే మనదేశానికిఅవసరమైనవస్తుసేవల్నిచవకగా అందిస్తుంది.

- డా.డి.వి.జి.శంకర రావు, పార్వతీపురం

### టూరిజాన్ని అభివృద్ధి చేయాలి

మనదేశంలో దాదాపు 30 రకాల పర్యాటక రంగాలున్నాయి. అందులో ఒకటివిమాన రంగం. పూర్వం బేగంపేట విమానాశ్రయంలో వచ్చేపోయే విమానాలను చూడటానికి పల్లెటూర్లనుండి పనిమీద బంధువుల ఇంటికి హైద్రాబాద్ వచ్చినవారు టికెట్టుకొని పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన మిద్దెమీద ప్రదేశానికి వెళ్ళి చూసేవారు. పర్యాటకులకు ఇటువంటి సదుపాయాన్నితక్కువ ధర అంటే 50రూపాయల లోపు ప్రవేశ రుసుమును నిర్ణయంచాలి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో వెయ్యి కిలోమీటర్ల పొడవున్న సముద్ర తీరాన్ని టూరిజంపేరిట అభివృద్ధి చేస్తే ఆహ్లాదం ప్రజల ఆదాయం ప్రభుత్వానిది అవుతుంది.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### సమాజానికి కొత్త సవాలు

నేటి కాలంలో సోషల్ మీడియా మన జీవితాల్లో భాగమైపోయింది.సమాచారం పంచుకోవడం, వ్యక్తిగత అభిరుచులను వ్యక్తపరచడం,ప్రపంచంతో మమేకం కావడం వంటి అనేక ప్రయోజనాలను ఇది అందిస్తోంది. అయితే అదే సమయంలో దీని దుర్వినియోగం సమాజానికి తీవ్రమైన ప్రమాదాలను కూడా సృష్టిస్తోంది.

- కె.రామారావు, నల్గొండ జిల్లా

### పదోన్నతులు, నియామకాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉపాధ్యాయుల నియామకం, పదోన్నతులు 30:70 నిష్పత్తి ప్రకారం అంటే ఒక 100 ఉపాధ్యాయ ఖాళీలను (లాంగ్వేజ్ నాన్ లాంగ్వేజ్ తో సంబంధం లేకుండా) 30 శాతం నియామకం, 70 శాతం పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తారు.ఇది దీర్ఘకాలంగా కొనసాగుతున్న నిబంధన.కానీ ప్రస్తుత ప్రభుత్వం నాన్‌లాంగ్వేజ్,ఇంగ్లీష్ పదోన్నతులు, నియామకాలు మాత్రం70:30 నిష్పత్తిలో,తెలుగు, హిందీలలో మాత్రం 30:70నిష్పత్తిలో జరపాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. చాలామంది ఎస్జీటీ ఉపాధ్యాయులు సుదీర్ఘ కాలంగా పదోన్నతులులేకుండా పదోన్నతి అవకాశంకోసం ఎదురు చూస్తున్నారు. ఈ తరుణంలో తెలుగు, హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతుల్లో ఎస్జీటీలకు 70 శాతంగానే జరపాలి. దాన్ని తగ్గించి 30 శాతం మాత్రమేపదోన్నతులుకల్పించాలని ప్రభుత్వం చూడటం సమంజసం కాదు. ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఉన్న పదోన్నత అవకాశాలు తగ్గించడం సరైన విధానం కాదు.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### నిధుల కొరత

**వాతావరణ** మార్పులు గ్లోబల్ పాలనను పునర్నిర్వచిస్తున్న ఈ దశలో, కాప్30లో భారత్‌ప్రకటించిన వైఖరి ఒక ప్రతిస్పందన మాత్రమే కాదు,అది వాతావరణ న్యాయం, సమానత్వం, చారిత్రక బాధ్యతలపై ఆధారపడిన ఒక సుస్థిర దృక్కోణం. ప్యారిస్ ఒప్పందానికి పునాది అయిన సాధారణ కానీ విభిన్న బాధ్యతలు సూత్రం, సర్వదేశాలకు ఒకే రకం బాధ్యతలను పెట్టడం అసంబద్ధమని స్పష్టంగా చెబుతుంది. ఈ లక్ష్యసాధనలో నిధుల కొరత సమస్యను అన్ని దేశాలూ కలిసి పరిష్కరించాలి.

-సి.సాయిరుత్విక్, నల్గొండ

### నిబంధనలను పాటించాలి

**వైద్యుల** ప్రిస్క్రిప్షన్ చీటీ లేకుండా మందులు కొనడం, అమ్మడం రెండూ నేరమే కానీ, తెలంగాణలో అన్ని జిల్లాల్లో మెడికల్ షాప్స్ ఈ నిబంధనలను యధేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయి. ధనార్జనే ధ్యేయంగా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు అమ్మి సొమ్ము చేసుకొంటున్నారు.ఒక్కొక్క మందుల షాప్‌లోఫార్మాసిస్ట్‌లేదు. పర్యవేక్షణ లేదు. నిబంధనల ప్రకారం ప్రతి మందుల దుకాణంలో అర్హతపొందిన ఫార్మాసిస్ట్ తప్పనిసరిగాఉండాలి.హెచ్1 రిజిస్టర్ను చాలా దుకాణాలు నిర్వహించడం లేదు.

-పి. జగదీశ్వర్, కరీంనగర్ జిల్లా

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# రాజకీయ అవినీతికి అంతం లేదా?



ఎం. నారాయణ స్వామి

మానహాని కన్నా మరణించడమే మేలనుకునే రోజులు చూశాం! పరువు పోయాక ప్రాణాలతో బతికుండటంకన్నానుయ్యో, గొయ్యో చూసుకుంటే పోలేదా అని అసహ్యించుకొన్న కాలం ఎరుగుదు! కానీ ఇవాళ అవినీతిపైన చాకిరేవు పెట్టటానికి సిగ్గుపడని దౌర్భాగ్యం దాపురించింది. చెడు అంటే భరించలేని రోతతో నేడు స్పందించడం మానేశాం. మరింకా అధ్యయనాలు చేయాలా? ఇంతకన్నా నిర్లజ్జ ఎక్కడుంటుంది? మరి ఇంత బహిరంగ చర్చలతో పాపం ప్రక్షాళనమైపోతుందా?బహిరంగ చర్చ అనగానే ఏది మంచి, ఏది చెడు, ఏది నీతి, ఏది అవినీతి, ఏది అక్రమార్జన, ఏది సక్రమార్జన అంటూ ప్రశ్నోపనిషత్తు వల్లే వేయడమేగా. అవినీతికి ఎందుకు పాల్పడాల్సి వచ్చింది? నీతికి తిలోదకాలు ఎందుకు వదలాల్సి వచ్చింది? అంటూ సాగదీయడం ఫాలో అవుతుంది. విలువలు విలుప్తం కావడానికిదారితీసిన పరిస్థితులపై చర్చ, సదరు పరిస్థితులు ఉత్పన్నమైన కారణాలపై సంవాదం. అందుకు సమాజమా, వ్యక్తులా?ఎవరు బాధ్యులని తర్జన, భర్జనలు. దీనికి ముగింపు ఉండదు. అవినీతి అనండీ, అక్రమార్జన అనండి, పెరగనిచ్చినన్నాళ్లు పెరగనిచ్చాం!. మొక్కయి ఎదిగి వస్తుండగానే నిర్దాక్షిణ్యంగా పంచాల్సిన కర్తవ్యం మర్చిపోయింది సమాజం. మొక్కయి వంగనిది మానైవంగుతుందా? వంగలేదు. రాజకీయాలు పుచ్చిపోయాయి. 'అవినీతి వృక్షానికి తల్లివేరు రాజకీయం' అంటారు ప్రముఖులు. ప్రజాస్వామ్య వ్యవస్థను ఎంచుకున్నాం. ప్రజాస్వామ్యానికి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఎన్నికలు. ఎంత ఖర్చు పెట్టి అయినా గెలవటమే ఎన్నికల ధ్యేయం. ఖర్చు పెట్టడానికి డబ్బెక్కడనుండి వస్తుంది? అనంతకోటి మార్గాలున్న సంగతి అందరికీ తెలిసిందే. వెనక్కి తిరిగి చూడకుండా డబ్బు వెద జల్లుతూ పోవాలంటే ఏ రంగాన్ని వదలకుండా ఎడాపెడా పిండి దండుకోవాలి. కబ్జాలు, కుంభకోణాలు, లంచాలు, అధికార దుర్వినియోగం, అధికార పరమపద సోపానం స్వాయత్తం చేసుకోవటానికి ఎన్ని నిచ్చెనలుంటే అన్నిటి మీదుగా ఎగబాకాలి. ప్రాజెక్టులు తగలబడి పోయినా సరే టెండర్ల దశలోనే చిచ్చు రాజేయాలి!కాంట్రాక్టర్లతో కరచాలనాలు చేయాలి. రాజకీయాలు, అధికారులు, కాంట్రాక్టర్లు ముప్పేట గొలుసుగా పెనవడాలి. కమిషన్లు అందినంత బొక్కాలి. ఊళ్లకు ఊళ్లు పంచుకోవటానికి దొరల



వేషం కట్టిన దొంగలు సంఘటితమవ్వాలి. సంక్షేమం పేరిట ప్రవహించే నిధుల్నీ స్వాహా చేయాలి. కాగితం మీదలెక్కలు బొక్కలు కానరావు, లక్షలు, కోట్లు ఖర్చవుతున్నాయి. లక్ష్యాలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే, కాకుల లెక్కలకు కొదవలేదు! పైవాళ్లంతా అంటే మంత్రులు, రాజకీయనాయకులు మూడక్షరాల హోదా, బిరుదులు తగిలించుకొన్న బ్యూరోక్రాట్లు తెగబడి తినేస్తోంటే పదికి పరక్కి కక్కుర్తిపడేమూడో, నాలుగో తరగతి సిబ్బందంటే అందరికీ ఎందుకింత అక్కసు అని ఎన్జీవో సంఘాల నాయకులు ఎదురు ప్రశ్నిస్తున్నారు. తాము పీక్కుతింటున్నవాళ్లు తమకనా బక్కవాళ్లే అన్న సంగతి వారికి జ్ఞాపకం రాదు. 'ఉద్యోగులపై చిన్న ఆరోపణ వచ్చినా సరే తక్షణమే సస్పెండ్ చేయడమో, మరొకరమైన చర్య తీసుకొంటున్నారు. అదే గనుక మంత్రులపై అభియోగాలు వస్తే ఏ విధమైన చర్యలు ఉండటం లేదు. అన్నిశాఖలలో నియామకాలు, ప్రమో షన్లు, బదిలీలలో మంత్రులు తలదూర్చి అవినీతికి పాల్పడుతున్నారు. వారికి సంబంధించిన వారికి మేలు చేసి లక్షలు మింగేస్తున్నారు. నీతినిజాయితీ అధికారులు, సిబ్బందికి మొండిచెయ్యి చూపిస్తున్నారు. ఈ పద్ధతి మారాలి. తెలుగు రాష్ట్రాలలోని నీటిపారుదల శాఖకు సంబంధించిన కీలకపదవుల్లో ఉన్న వారికి ఆ శాఖకు సంబంధించిన కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి అధికారులు టెండర్లు చేజిక్కించుకున్న కాంట్రాక్టర్ల దగ్గర నుండి కోట్లాది రూపాయలను వసూలు చేసి ముట్ట చెప్తున్న ఆరోపణలు వస్తున్నా దర్యాప్తులు లేవు, చర్యలు లేవు. బహిరంగంగా జరుగుతున్న ఈ అవినీతి తతంగం గురించి తెలిసి కూడా ఆయా మంత్రులపైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదంటే జవాబు లేదు, దొరకదు! అదేవిధంగా పోలీసు శాఖ మంత్రులే కాకుండా, సంబంధిత మంత్రులు, నియోజక వర్గం శాసనసభ్యులకు తెలియకుండా పోలీసు స్టేషన్లలో విధులు నిర్వహించే సబ్ ఇన్స్పెక్టర్లు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సబ్ డివిజన్ డిఎస్పీల బదిలీలను జిల్లా, రేంజి రాష్ట్ర ఉన్నతాధికారులు చేయలేకపోతున్నారు.కొందరు ప్రజాప్రతినిధులు శాసనసభ్యులకు లక్షల రూపాయలను ముట్టచెప్పిన సబ్ ఇన్స్పెక్టర్లు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, డిఎస్పీలకు వారు కోరుకున్న చోటుకు బదిలీ చేయించుకోవడానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. లేదంటే దబిడి. ఇక రెవిన్యూతో పాటు ఇతర శాఖలపై మంత్రుల పెత్తనాలతో పాటు అవినీతి తారాస్థాయికి చేరుకుంటున్నా శిక్షించే నాథుడే లేదు. ప్రస్తుతం ఉన్న చట్టాల కు మరింత పదును పెట్టి నీతి నిజాయితీ వీటన్నిటిని మించిన సమర్థత కలిగిన అధికారులను నియమించి, ముఖ్యంగా అవినీతి నిరోధక శాఖలో మితిమీరిపోతున్న రాజకీయ జోక్యానికి ఫుల్‌స్టాప్ పెట్టకపోతే. పాలకుల మాటలు, చట్టాలు అన్నీ నిరర్థకమే. ●

# భారత్ ఆర్థికవృద్ధి 6.8 నుంచి 7.2%




## 'సవాళ్లు ఎదురైనా ఆగని వృద్ధివేగం'

### పార్లమెంటులో ఆర్థికమంత్రి సీతారామన్ ప్రవేశపెట్టిన ఆర్థికసర్వే!

**న్యూఢిల్లీ,జనవరి 29:** భారత్ స్థూలదేశీయోత్పత్తి వృద్ధి ఈ ఆర్థిక సంవత్సరంలో 6.8 నుంచి 7.2శాతంవరకూ ఉంటుందని పార్లమెంటులో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో పొందుపరిచారు. ఆర్థికవ్యవస్థ పటిష్టమైన వృద్ధితో ఉందని, ఓపక్క సవాళ్లు, సుంకాలు, ప్రపంచదేశాల్లో అనిశ్చితి ఉన్నప్పటికీ భారత్ వృద్ధి వేగవంతంగా ఉందని సర్వేలో ఉటంకించారు. ద్రవ్యోల్బణం చరిత్రాత్మక కనిష్టస్థాయిలను నమోదుచేస్తోందని, విదేశీ జమలు కూడా పెరుగుతున్నాయని, ప్రైవేటు పెట్టుబడులు కూడా మార్గదర్శకంగా వస్తున్నట్లు సర్వేలో వెల్లడించారు. కుటుంబీకులు, సంస్థలు, బ్యాంకుల ఆస్తిఅప్పుల పట్టీలు పటిష్టంగా మారాయని, ప్రభుత్వ పెట్టుబడులు కూడా కార్యకలాపాలుప ఎంచేవిధంగా ఉన్నాయి. వినియోగం డిమాండ్ మరింత పెరుగుతోందని, ప్రైవేటు ఇన్వెస్టుమెంట్ దోరణులు మెరుగుపడుతున్నాయని ప్రస్తావించింది. మద్యకాలికంగాను, వార్షిక పద్దతిలోచూస్తే భారత్ ఆర్థికవృద్ధి ఏడుశాతంగా ఉంటుందని, దశలవారీగా వృద్ధి మరింత వేగవంతం అవుతుందని ప్రపంచ స్థాయిలో అనిశ్చితి పెరిగినా భారత్‌లో మాత్రం శక్తివంతంగా ఉందన్నారు. గడచిన కొన్నేళ్లుగా జరుగుతున్న సంస్కరణలు కార్పొరేట్, ఆర్థికరంగ బ్యాలెన్స్ షీట్లను పెంచిందన్నారు. పన్ను యంత్రాంగంలో మరింతగా పారదర్శకత రావడం, లీకేజిలు అరికట్టడానికి దోహదం చేసిందని తెలుస్తోంది. మధ్యకాలికంగాచూస్తే భారత్ ఆర్థికవృద్ధి ఏడుశాతంగా ఉంటుందని ఆర్థిక సర్వేలో ప్రస్తావించారు. ప్రపంచ వాణిజ్య వాతావరణానికి తోడు అమెరికా సుంకాల తంత్రం కూడా భారత్‌పై అంతగా పనిచేయలేదని తెలుస్తోంది. ఈ ఏడాదిలోనే అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం పూర్తవుతుందని సర్వేలో పొందుపరిచారు. దీనితో అన్ని అపోహలు తొలగిపోతాయని, ప్రపంచ వాణిజ్యరంగంలో భారత్ తిరుగులేనిస్థానంతో దూసుకుపోతుందన్నారు. ప్రస్తుతం అమెరికాతో జరకు గుతున్న సంప్రదింపులు మరింత వేగవంతం అయ్యాయని, ఎదురవుతున్న రిస్కులు పరిష్క రించుకోగలిగిన స్థాయిలోనే ఉన్నట్లు ఆర్థిక సర్వేలో ఉటంకించారు. ప్రభుత్వ విధివిధానాలతో అన్ని సవాళ్లను అధిగమించే స్థాయిలోమనదగ్గర బఫర్‌నిల్వ ఉంటుందనిప్రధాన ఆర్థికసలహాదారు వి అనంత నాగేశ్వరన్ పేర్కొన్నారు. ద్వైపాక్షిక, బహుపాక్షిక వాణిజ్య ఒప్పందాలు, ఇండియా ఈయూ ట్రేడ్ డీల్ వంటివి భారత్‌ఆర్థికవృద్ధికి ఎంతో కీలకంగా మారతాయన్నారు. భారత్ ఎగుమతులకు అతి తక్కువ సుంకాలు ఇపుడుప్రపంచదేశాల్లో ఉంటాయని దీనివల్ల ఎగుమతి మార్కెట్లలో భారత్ వాటా మరింతపెరుగుతుందని చెప్పుకొచ్చారు. ఇక భారత్‌లోప్రతిభా నిపుణులకు కొదవలేదని, ప్రతిభావంతుల నైపుణ్యాలను వినియోగించుకోవడంతోపాటు భారత కార్పొరేట్‌రంగంలోను, ఐటి రంగంలో కృత్రిమమేధకు తగినంతగా ప్రోత్సాహం ఇస్తున్నట్లు తెలిపారు. గ్లోబల్ ఎఐ లీడర్‌గా భారత్ ఎదిగేస్థాయికి మనం వెళుతున్నట్లు ఆర్థికసర్వేలో వెల్లడించారు. ముందు సమన్వయం, ఆ తర్వాత సామర్థ్యం పెంపు అన్న బాటలో వెళుతున్నదని, అయితే ప్రభుత్వ నిబంధనలు, చట్టాలను గౌరవిస్తూనే వ్యవస్థలు, సంస్థలు మార్కెట్లతో ఎఐని సమన్వయం చేసేందుకు ఉపకరిస్తుందన్నారు. ప్రపంచంలోనే శరవేగంగా వృద్ధిచెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్‌నిలిచిందని ఎఐ విప్లవంతో మరింతగా మార్పులు చోటుచేసుకుంటాయని, ఎఐ రంగంలో గ్లోబల్ లీడర్‌గా భారత్ ఎదుగుతుందన్నారు. ఎంపికచేసిన రంగాలు, చిన్న, ఓపెన్ వైట్ మోడళ్లు వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు కృషి జరుగుతోందన్నారు. బ్యాంకులు, వ్యవస్థలు, సంస్థలు, కుటుంబీకుల ఆదాయవనరులు సుసంపన్నంగా ఉన్నాయని, ప్రభుత్వ పెట్టుబడులు మరింతగా ప్రోత్సాహకరంగా ఉన్నాయని వివరించింది. ప్రైవేటు ఇన్వెస్టిమెంట్ కూడా పెరుగుతూ వస్తోందని, బయటినుంచి వచ్చే సవాళ్లను అధిగమించేందుకు వీలుగా ప్రభుత్వ విధానాలున్నాయని, అందువల్లనే ఆర్థికవృద్ధి సత్వర వేగవంతం అవుతుందన్నారు.

రానున్న సంవత్సరంలో కన్సూమర్‌ప్రైస్ ఇండెక్స్ సిరీస్ ద్రవ్యోల్బణ అధ్యయనంపై ప్రభావం చూపిస్తాయని, ధరల మదింపునకు దోహదం చేస్తుందన్నారు.

## మితిమీరిన వినియోగంతో ధరలు పెరగనున్న యూరియా

### డిబిటితో రైతుల నష్టం భర్తీ :ఆర్థిక సర్వే

**న్యూఢిల్లీ,జనవరి 29:** వ్యవసాయరంగంలో విరివిగా వినియోగించే యూరియా ధరల్లో స్వల్పంగా పెరుగుదల కనిపిస్తుందని, దేశవ్యాప్తంగా రిటైల్ ధరల్లో కొంత వృద్ధి ఉంటుందని,అయితే ఆమొత్తం బ్యాంకు ఖాతాలకు ఎకరాకు స్పష్టమైన మొత్తం చొప్పున నేరుగా జమచేస్తారని ఆర్థిక సర్వేలో పొందుపరిచారు. ఈ వ్యవస్థ కారణంగానే ధరల్లో పెరుగుదల కనిపించినా డిబిటి ద్వారా నేరుగా రైతులకు జమచేయడం వల్ల ఎలాంటి నష్టం ఉండదని, తద్వారా రైతుల్లో కొనుగోలుశక్తికూడా పెరుగుతుందని అన్నారు. అలాగేనైట్రెజెన్ ఎరువుల ధరలు కూడా మార్పులున్నప్పటికీ రైతులకు అందుబాటులోనే ఉంటుందని సర్వేలో పొందుపరిచారు. భారత వ్యవసాయరంగంలో కొన్ని అధునాతన ఒకడలు వల్ల సవాళ్లనుంచి అధిగమించగలుగుతారన్నారు. ఉత్పాదకత, ఆదాయవనరుల పెంపుపై ప్రభుత్వం అత్యంత జాగ్రత్తగా దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. సరిపడా లేని మార్కెటింగ్; స్టోరేజి మౌలికవనరులు, నాణ్యతా పరమైన ఇన్‌పుట్‌లకు పరిమితంగానే లభించడం, పెట్టుబడులు తక్కువస్థాయిలో ఉండటం, ఉన్నత ప్రమాణాలతో సేవలు అందుబాటులోకి రావాలిసన అవసరాన్ని నొక్కిచెప్పారు. పౌష్టిక ఎరువులు ఇతర ఎరువులకంటే కారుచౌకధరలకు అందుబాటులోకిరావాలని, భూప్రమాణాలు, సారవంతంగా నేలలు మార్చుకునేందుకు నిర్దిష్టప్రమాణాలతో శాస్త్రీయ విదానంలోఎరువుల వినియోగంపై చైతన్యపరచాల్సిన అవసరం ఉందని అన్నారు.అయితే ఇందుకు ఎరువుల ధరలపై నిత్యం పర్యవేక్షణ కొనసాగాల్సి ఉంటుందని ఆర్థికసర్వేలో సూచించారు.



ఎరువుల కొనుగోలు వ్యయాన్ని రైతుల ఆదాయవనరులకు మద్దతిచ్చే రాబడులకు దూరంగా ఉంచాలని, వ్యవసాయ సంబంధిత వనరులపై కొరతను తీర్చాలని సర్వేలో సూచించారు. నైట్రోజెన్ వినియోగం ఇప్పటికే రైతుల్లో అవగాహణ పెరిగిందని, తక్కువ ధరలకు కొనుగోలుచేసినా పూర్తిసబ్సిడీ వారి ఖాతాలకు చేరుతుందన్న అవగాహణ రైతులకుండటం విశేషమన్నారు. భూపరీక్షలు, నానో యూరియా, ద్రవరూప ఎరువులు, సేంద్రీయ వ్యవసాయ సవరణలు వంటివి విస్తృతంగా అమలులోకి రావాలని సూచించింది. అలాగే డిజిటల్ వ్యవసాయ మౌలికవనరులు మరింతగా సంస్కరించుకోవాల్సి ఉంటుందన్నారు. కౌలు రైతులకోసం ప్రత్యేక వ్యవసాయ వ్యవస్థను సృష్టించాలని, అద్దెమార్కెట్లకోసం సమయ పాలిత సర్దుబాట్లను స్పష్టంచేయాల్సి ఉంటుందని ఈ కౌలువ్యవస్థ ప్రయోజనాలను అమలుకు ముందు విస్తృత స్థాయిలో సవరణలు అవసరమన్నారు. యూరియాను మితిమీరి వినియోగం కూడా అనర్థదాయకమని, రిటైల్ యూరియా ధరలు దశాబ్దకాలంగా పెరగలేదని, 2026లో సుమారు రూ.1.91 లక్షలకోట్లుగా ఉంటుందని, బడ్జెట్ అంచనాల్లో రూ.1.67 లక్షలకోట్లుగా ఉందని వెల్లడించారు. ప్రస్తుత ఆరినతకసంవత్సరంలో యూరియా వినియోగం 40 మిలియన్ టన్నులుగా ఉందని, మరింతగా డిమాండ్ వచ్చిందని ఆర్థికసర్వేలో పొందుపరిచారు. వ్యవసాయ అనుబంధ సేవలు 2026లో 3.1శాతంపెరుగుతాయని అంచనా వేసారు. దీర్ఘకాలిక సగటు 4.5శాతంగా ఉంటుందని ఆర్థికసర్వేలో ప్రభుత్వం అంచనా వేసింది. జంతు సంపద, మత్స్యశాఖలపరంగా కూడా ఐదునుంచి 6శాతం వృద్ధి ఉంటుందని వనయవసాయ జివిఎ మరింతగా వృద్ధిలోకి వస్తుందని తెలిపారు. రబీ నాట్లు ముమ్మరంగా పెరిగాయని, వాణిజ్యం, వ్యవసాయ రంగానికి ఇటీవలికాలంలో అనేక మార్పులు వచ్చాయని, వ్యవసాయరంగానికిగాను 2.17శాతం వృద్ధి ఉంటుందన్నారు.



## ప్రధాని మోడీతో దేవెగౌడ భేటీ

- దేశాభివృద్ధితో పలు కీలక అంశాలపై చర్చ

**బెంగళూరు, జనవరి 29 (ఐఎఎన్ఎస్):** మాజీ ప్రధాని, జెడి(ఎస్) అధినేత హెచ్.డి. దేవెగౌడ గురువారం ప్రధాని నరేంద్ర మోడీని కలిసి చర్చలు జరిపారు. ఈ విషయాన్ని ప్రధాని మోడీ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. "హెచ్.డి. దేవెగౌడతో అద్భుతమైన సమావేశం జరిగింది. కీలక సమస్యలపై ఆయనకున్న అకుంటిత దీక్ష్ట్టి ప్రశంసనీయం. భారతదేశ అభివృద్ధి పట్ల ఆయనకున్న అభిరుచి కూడా అంతే ప్రశంసనీయం" అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ప్రధానమంత్రి కార్యాలయం (పిఎంఒ) కూడా ఈ విషయమై కన్నడ భాషలో ఒక పోస్టును పెట్టింది. ఈ పరిణామం కర్ణాటక రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దేవెగౌడ, ఆయన కుమారుడు, కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి తమ స్వస్థలమైన హాసన్‌లో భారీ ర్యాలీ నిర్వహించి, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని గద్దె దించాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.




### మహారాష్ట్ర పరిణామాలు

## డిసిఎంగా సునేత్ర పవార్!

### అజిత్ పవార్ స్థానంలో నియమించే అవకాశం

**ముంబయి,జనవరి 29:** నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) అధినేత, డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మరణంతో మహారాష్ట్ర రాజకీయాల్లో పవర్ గేమ్ మొదలైంది. ఎన్సీపీకి తదుపరి అధినేత ఎవరనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. మరోవైపు, అజిత్ పవార్ వర్గం, శరద్ పవార్ వర్గం కలిసిపోతాయనే చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్‌ను మహారాష్ట్ర డిప్యూటీ సీఎం పదవి కోసం పార్టీ నామినేట్ చేయనున్నట్లు తెలుస్తోంది. సీనియర్ ఎన్సీపీ నేత, మహారాష్ట్ర ఎఫ్‌డీఏ మంత్రి నర్హరి జిర్వాల్ గురువారం మాట్లాడుతూ సునేత్ర పవార్‌ను రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. మరోవైపు, ఎన్సీపీ నేతలు ప్రఫుల్ పటేల్, ఛగన్ భుజ్ బల్, ధనంజయ్ ముండే, సునీల్ తట్కరేలు సునేత్ర పవార్‌తో సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది. అజిత్ పవార్ మరణంతో ఖాళీ అయిన అసెంబ్లీ స్థానం నుంచి సునేత్రా పవార్‌ను పోటీలో దింపాలని ఎన్సీపీ భావిస్తోంది. ఇక పార్టీ కార్యక్రమాలను నడిపించడానికి ఎన్సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రఫుల్ పటేల్ ముందుంటారని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఇదే విధంగా శరద్ పవార్, అజిత్ పవార్ వర్గాలు కలిసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల, ఈ రెండు కూటములు కలిసి మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేశాయి. అజిత్ పవార్ ఎన్సీపీ రాష్ట్రంలో బిజెపి శివసేనతో కలిసి మహాయుతి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంది. ప్రస్తుతం సునేత్రా పవార్ రాజ్యసభ సభ్యురాలిగా ఉన్నారు. సునేత్రకు డిప్యూటి సిఎం పదవి ఇవ్వాలని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌వద్దకు ఎన్సీపీ అజిత్‌వర్గం నేతలు మంత్రులు రాయబారం నడుపుతున్నారు. అలాగే పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడుగా ఉన్న ప్రఫుల్‌పటేల్ ఇకపై పార్టీకి పూర్తి కాలం బాధ్యతలునిర్వర్తించేవిదంగ ఆజిత్ వర్గం నేతలు నిర్ణయించినట్లు సమాచారం. అయితే ఈలోపు ఎన్సీపీలోని రెండు వర్గాలు ఒక్కటయ్యే ఛాన్స్ కూడా ఎ క్కువగా కనిపిస్తోంది. ఈ కోణంలోకూడా చర్చలు కొనసాగుతున్నట్లు పార్టీనేతలు చెపుతున్నారు.

## కొలంబియాలో కుప్పకూలిన విమానం..


### ఎంపి సహా 15 మంది మృతి




**లండన్, జనవరి 29:** కొలంబియాలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. దేశ ఈశాన్య ప్రాంతంలోని నార్టే డి సెంటాండర్ ప్రావిన్స్‌లో ప్రభుత్వరంగ విమానయాన సంస్థ సటెనాకు చెందిన ఒక చిన్న విమానం కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న ఇద్దరు సిబ్బంది, 13 మంది ప్రయాణికులతో సహా మొత్తం 15 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ప్రముఖ రాజకీయ నాయకుడు, మానవ హక్కుల కార్యకర్త, ఎంపి డియోజెనెస్ క్వింటెరో కూడా ఉండటంతో దేశవ్యాప్తంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ విమానం, స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 11:42 గంటలకు కుకుటా విమానాశ్రయం నుంచి ఒకాన్యాకు బయలుదేరింది. 40 నిమిషాల ఈ ప్రయాణం ప్రారంభమైన కొద్దిసేపటికే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌తో విమానానికి సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. అప్రమత్తమైన అధికారులు కురాసికా అనే మారుమూల గ్రామీణ ప్రాంతంలో విమానం కూలిపోయినట్లు గుర్తించారు. వెంటనే రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. విమానం ఉన్న ప్రదేశాన్ని గుర్తించిన తర్వాత అందులో ఎవరూ ప్రాణాలతో మిగిలిలేరని అధికారులు ధ్రువీకరించినట్లు కొలంబియా రవాణా మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

## ఫిబ్రవరి 27న ప్రధాని మోడీ ఇజ్రాయెల్ పర్యటన

- రక్షణ, సాంకేతికత, వ్యవసాయం, సైబర్ భద్రతపై చర్చలు



**న్యూఢిల్లీ, జనవరి 29:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫిబ్రవరి 27, 28 తేదీలలో ఇజ్రాయెల్‌లో పర్యటించనున్నారు. ఇజ్రాయెల్‌ను సందర్శించాలని ఇప్పటికే ప్రధాని మోడిని ఆ దేశం ఆహ్వానం పంపింది. రక్షణ, సాంకేతికత, వ్యవసాయం, సైబర్ భద్రత, ఉగ్రవాద నిరోధక వంటి రంగాలలో వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేయడం పర్యటన లక్ష్యం. మోడీ, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ నెల ప్రారంభంలో చర్చలు జరిపారు, రెండు వైపులా ఉగ్రవాదంపై సున్నా సహన వైఖరిని పునరుద్ఘాటించినప్పటికీ, 2 నెలల్లో రెండవది. గాజా శాంతి ప్రణాళిక అమలు, పురోగతి గురిం చి నెతన్యాహు భారత పక్షానికి వివరించారు, అయితే ఈ ప్రాంతంలో న్యాయమైన, శాశ్వత శాంతి కోసం భారతదేశం స్థిరమైన మద్దతును పునరుద్ఘాటించిన విషయం

## ఖర్గే, రాహుల్‌తో శశిథరూర్ భేటీ



**న్యూఢిల్లీ, జనవరి 29:** కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ పార్టీ అగ్రనాయకత్వంపై అసంతృప్తిగా ఉన్నారనే ప్రచారం జరుగుతున్న క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీలతో ఆయన భేటీ అయ్యారు. పార్లమెంట్ హౌస్‌లో దాదాపు 30 నిమిషాల పాటు వీరి మధ్య చర్చలు జరిగాయి. దీనికి ముందు థరూర్‌ను రాహుల్‌తో భేటీ గురించి విలేకరులు ప్రశ్నించగా అది జరగాల్సినప్పుడు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా తన సొంత పార్టీ నాయకుడిని కలవడంలో అంత ప్రాధాన్యం ఏముంటుంది అని వ్యాఖ్యానించారు. సమావేశం అనంతరం థరూర్ మాట్లాడుతూ మా మధ్య చాలా సానుకూలమైన చర్చలు జరిగాయి. అంతా బాగుంది. అందరం ఒకే అభిప్రాయంతో ముందుకుసాగుతున్నాం అని విలేకరులతో అన్నారు. ఈ సమావేశానికి సంబంధించిన ఫొటోను ఆయన ఎక్స్ వేదికగా పంచుకున్నారు. దీనికి అనేక విషయాలపై ఆత్మీయంగా, సానుకూలంగా చర్చించినందుకు ఖర్గే, రాహుల్‌గాంధీలకు ధన్యవాదాలు. దేశ ప్రజలకు సేవ చేసేందుకు ఒకే అభిప్రాయంతో ముందుకుసాగుతున్నాం అని రాసుకొచ్చారు. గతేడాది ఆపరేషన్ సిందూర్ తర్వాత దౌత్యపరమైన సంబంధాలపై థరూర్ పార్టీకి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు. దీనిపై సొంత పార్టీ నేతల నుంచి విమర్శలు ఎదుర్కొన్నారు. ఆ తర్వాత పలు సందర్భాల్లో ప్రధాని మోడీపై ప్రశంసలు కురిపించడం కూడా విమర్శలకు దారి తీసింది. పార్టీతో తనకు కొన్ని అభిప్రాయభేదాలు ఉన్నాయని, అయితే పార్లమెంటులో పార్టీ నియమావళిని ఎప్పుడూ ఉల్లంఘించలేదని ఇటీవల థరూర్ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో తాజా భేటీ జరగడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.


## వీధికుక్కల కేసులో సుప్రీంకోర్టు తీర్పు రిజర్వు

- వారంలోపు లిఖిత పూర్వక వాదనలు దాఖలు చేయండి
- కేంద్ర, రాష్ట్రాలకు త్రిసభ్య ధర్మాసనం ఆదేశం

**న్యూఢిల్లీ, జనవరి 29:** వీధికుక్కల కేసులో అన్ని రాష్ట్రాల నుండి వచ్చిన వాదనలు విన్న ఒక రోజు తర్వాత, సుప్రీంకోర్టు గురువారం వీధి కుక్కల కేసులో తన తీర్పును రిజర్వ్ చేసింది. కుక్కల ప్రేమికులు, కుక్క కాటు సంఘటనల బాధితులు, జంతు హక్కుల కార్యకర్తలు, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల తరపున హాజరైన న్యాయవాదులు సహా అన్ని వాటాదారుల వాదనలను వివరంగా విన్న తర్వాత కోర్టు విచారణను ముగించింది. విచారణ పూర్తయిన తర్వాత, సుప్రీంకోర్టు ఈ విషయంలో తన తీర్పును రిజర్వ్ చేసింది. అన్ని పార్టీలు ఒక వారంలోపు తమ లిఖితపూర్వక వాదనలను సమర్పించాలని కూడా కోర్టు ఆదేశించింది. వీధి కుక్కలను క్రిమిరహితం చేయడానికి, కుక్కల పౌండ్లను ఏర్పాటు చేయడానికి, విద్య, ఇతర సంస్థల క్యాంపస్‌ల నుండి కుక్కలను తొలగించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో అనేక రాష్ట్రాలు విఫలం.

## సంక్షిప్తంగా..

### ఇజ్రాయెల్ ప్రధాని ఫోన్‌కు రెడ్‌టేప్!




**టెల్అవీవ్,జనవరి 29:** ఇజ్రాయెల్‌ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు తాను వినియోగిస్తున్న ఫోను వెనుకభాగంలోని కెమేరా ఒక రెడ్‌టేప్‌తో సీల్‌వేసి ఉన్న విడియో ఇపుడు నెట్‌లో వైరల్ అయింది. సోషల్‌మీడియాలో ఇందుకు సంబంధించి అనేక ఫోటోలు విడియోలువ ఐరల్ అయ్యాయి. ఇజ్రాయెల్‌పార్లమెంట్ నెస్సెట్ అండర్‌గ్రౌండ్ పార్కింగ్ వద్దనెతన్యాహు తన లగ్జరీ కారు వెనక నిలబడి ఎవరితోనే ఫోన్‌లో మాట్లాడుతుండటం కనిపించింది. ఆయన కెమేరా లెన్సులు, ఫోన్ సెన్సార్లు మొత్తం ఒక దట్టమైన రెడ్‌టేప్‌తో కప్పి ఉన్నట్లు గుర్తించారు. తన ఫోన్‌ను సురక్షితంగా వాడాలనుకుంటే మరో ఫోన్ వాడతారని, ఇలా రెడ్‌టేప్‌లు ఎందుకు వస్తారన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. అమెరికా ఔట్‌లెట్ హైప్‌ఫ్రెష్ ఈ రెడ్‌టేప్‌పై వివరణ ఇస్తూ నెతన్యాహు ఫోన్‌కు వేసిన రెడ్‌టేప్ ట్యాంపర్ కాకుండా ఉండే సీల్ అని హైసెక్యూరిటీ ప్రాంతాల్లో ఇదొక ప్రత్యేక స్టిక్కర్ అని వీటిని తరచూ వినియోగిస్తారని తెలిపింది.

### అనుమానాస్పద స్థితిలో సాధ్వి ప్రేమ్‌బైసా మృతి!



**జైపూర్;జనవరి 29:** రాజస్థాన్‌లో హిందూ మతప్రచారక్ బోధకురాలు సాధ్వి ప్రేమ్‌బైసా మరణం ఇపుడు రాజకీయాల్లో దుమారం రేపింది. ఆర్ఎల్‌పి నేత జాట్ శక్తివంతమైన నేత హనుమాన్ బేనివాల్ సిబిఐ దర్యాప్తుజరిపించాలని, ఆమె మరణం మిస్టరీని ఛేదించాలని డిమాండ్ చేయడంతో ఇపుడు మరింత ప్రచారంలోకి వచ్చింది. ప్రేమ్‌బైసాను జోద్‌పూర్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బోరనాదా ఆశ్రమ్‌నుంచి ఆమె తండ్రి వీరమ్‌నాథ్ మరో సహాయకుని సాయంతో తీసుకురాగానే వైద్యులు ఆమె చనిపోయిందని ధృవీకరించారు. వైద్యుడు డాక్టర్‌ప్రవీణ్‌జైన్ మాట్లాడుతూ ఆమెను కాపాడేందుకు అన్ని ప్రయత్నాలుచేసినా ప్రయత్నంలేదని, ఆమె శరీరంలో అసలు కదలికలు లేవని అన్నారు. ఆమెకు జ్వరం వచ్చిందని తండ్రి తెలిపారని, కాంపౌండర్, హెల్‌నతకేర్ నిపుణుడిని ఆశ్రమానికి పిలిపించినట్లు చెప్పారు.

### సైబర్ నేరాల మాఫియా.. 11 మందికి మరణశిక్ష అమలు



**బ్యాంకాక్, జనవరి 29:** 100 కోట్ల డాలర్లకుపైగా సైబర్ మోసాల ర్యాకెట్ నిర్వహించిన 11 మంది మైన్మార్‌కు చెందిన కుటుంబ క్రైమ్ సిండికేట్‌కు చైనా మరణశిక్ష విధించింది. వెన్‌ఝౌ సిటీ ఇంటర్మీడియేట్ పీపుల్స్ కోర్టు ఈ మరణశిక్షను గురువారం అమలుచేసింది. వెంజౌసిటీ న్యాయస్థానం గత ఏడాది సెప్టెంబరులో 11 మందిని దోషులుగా తేల్చి అందరికీ మరణశిక్ష విధించింది. కుటుంబసభ్యుల అప్పీలును ఇటీవల తిరస్కరించి మరణశిక్ష అమలుచేయాలని ఆదేశించింది. ఈ మొత్తం 11 మందిని 2023 నవంబరులోనే అదుపులోకి తీసుకుని చైనా అధికారులు విచారించారు. సరిహద్దుప్రాంతాల్లో నిఘా పెంచి మైన్మార్‌తో పరస్పరం టెక్ సమాచారం పంచుకుంటూ కుంభకోణాలను కట్టడిచేయగలిగింది. ఈ 11 మందిలోమింగ్ గౌపింగ్; మింగ్‌ఝెన్‌ఝెన్‌లు కూడా ఉన్నారు. వీరే ఈ సైబర్‌క్రైమ్, గ్యాంబ్లిక్ కార్యకలాపాలకు కీలకమని కోర్టు నిర్ధారించింది.

### ఖమేనీని తొలగిస్తే అధికారం ఎవరికో!: మార్క్ రుబియో

**వాషింగ్టన్,జనవరి 29:** పశ్చిమాసియాలో అమెరికా యుద్ధనౌకల మొహరింపుక్రమంలో ఇరాన్‌పై ఏక్షణంలో అయినా దాడిజరగవచ్చన్న భయాందోళనలు పెరిగాయి. అమెరికా విదేశాంగమంత్రి మార్క్ రుబియో మాట్లాడుతూ ఇరాన్ సుప్రీం లీడర్ అయుతొల్లా ఆలిఖమైనీని తలొగిస్తే అధికారి ఎవరిచేతుల్లోకి వెళుతుందో ఎవరికీ తెలియదన్నారు. సెనేట్ విదేశీ సంబంధాల కమిటీ ముందు ఇచ్చిన వాంగ్మూలంలో రుబియో ఈ వ్యాఖ్యలుచేసారు. ఇరాన్‌లో పాలన మార్పు తర్వాత ఏంజరుగుతుందనే ప్రశ్నలకు రుబియో బదులిస్తూ అది ఒక బహిరంగప్రశ్న. ఎవరు అధికారంచేపడతారో ఎవరికీ తెలియదు. ఇరాన్ పాలన ఖమైనీ ఇస్లామిక్ రివొల్యూషనరీగార్డ్‌కార్ప్స్ తోపాటు ఎన్నికైన వ్యక్తులమధ్య విభజించి ఉంది. వారంతా చివరికి ఖమేనీ ఆదేశాలతోనే నడుచుకుంటారని అన్నారు.సుప్రీం లీడర్ పాలన పడిపోతే అక్కడ తర్వాత ఏంజరుగుతుందనే ప్రశ్నకు జవాబు కష్టమేనన్నారు.

## ఎస్ఐఆర్ పారదర్శకంగా సాగాలి - ఇసికి సుప్రీంకోర్టు ఆదేశాలు

**న్యూఢిల్లీ, జనవరి 29:** తమిళనాడులో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై సుప్రీంకోర్టు గురువారం జోక్యం చేసుకుంది. ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా, సజావుగా సాగేలా వ్యవహరించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు సూచించింది. ఈ మేరకు డిఎంకె దాఖలు చేసిన అత్యవసర పిటిషన్‌పై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఆదేశాలు వెలువరించింది. ఏప్రిల్‌లో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల జరగనుండగా.. ఎస్ఐఆర్ పేరుతో భారీగా ఓటర్లను తొలగించారని డిఎంకెకు చెందిన ఆర్ఎస్ భారతి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. రాష్ట్రంలోని ఎస్ఐఆర్ అనంతరం 97 లక్షల ఓట్లను తొలగించారు.. మొత్తం ఓటర్లలో దాదాపు 88 శాతం మంది అంటే 1.72 కోట్ల మంది ఓటర్లను "తార్కిక వ్యత్యాసాలు" పేరుతో జాబితాను తొలగించారని ఆయన ఆరోపించారు. పశ్చిమ్ బెంగాల్, కేరళలోనూ ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా సమగ్ర సవరణలకు సంబంధించిన ఫిర్యాదులను కూడా విచారిస్తున్న సర్వోన్నత న్యాయస్థానం.. ప్రభుత్వ కార్యాలయాలలో తార్కిక వ్యత్యాసాల జాబితాలోని ఓటర్ల పూర్తి జాబితాను ప్రచురించాలని, పేర్లు లేనివారు 10 రోజుల్లోపు సంబంధిత పత్రాలను సమర్పించడానికి అనుమతించాలని ఇసిని ఆదేశించింది. 'ప్రతి కలెక్టర్ ఇసి జారీ చేసిన ఆదేశాలను పాటించాలని, ఎస్ఐఆర్ సజావుగా నిర్వహించడానికి సిబ్బందిని నియమించాలని తాము ఆదేశిస్తున్నాం" అని కోర్టు పేర్కొంది. అలాగే, శాంతిభద్రతల సమస్య లేకుండా ఉండేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని డిజిపి, పోలీస్ కమిషనర్లకు సూచించింది. ఎస్ఐఆర్ ఎక్కడ జరుగుతున్నా ఇసి ఈ ఆదేశాలకు కట్టుబడి ఉంటుందని తాము ఆశిస్తున్నామని ధర్మాసనం వ్యాఖ్యానించింది.



# కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ ఒక్కటే



గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

## మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు బిజెపిని గెలిపించాలి

### పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అవినీతి, స్కాంల విషయంలో కాంగ్రెస్ - బిఆర్ఎస్ పార్టీల మధ్య తీసుకుంటున్న నిర్ణయాలు, వ్యవహార శైలి ఒకే విధంగా కొనసాగుతు న్నాయన్న విషయం స్పష్టంగా కనిపిస్తుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు. గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు.
బిఆర్ఎస్ పాలనలో గొర్రెల పంపిణీ స్కాం జరిగిందని ఆరోపణలు వచ్చాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ల గడిచినా, ఆ స్కాంపై ఇప్పటివరకు ఎలాంటి సమగ్ర విచారణ జరగడం లేదు. నైని కోల్ బ్లాక్ విషయంలో కూడా బిఆర్ఎస్ ప్రభుత్వంలో కొనసాగిన అదే కాంట్రాక్టును కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందని, కేవలం కాంట్రాక్టర్లు, మంత్రివర్గం మారాయి తప్ప కమిషన్ల విధానం మాత్రం అలాగే కొనసాగుతుందని, ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో కూడా నిజమైన విచారణ జరగడం లేదన్నారు. గతంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్కాంల విషయంలో ఒకే ధోరణితో వ్యవహరిస్తున్నాయన్న విషయాన్ని ప్రజలు గమనించాలి. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన స్కాంలపై 100 రోజుల్లోనే విచారణ పూర్తి చేసి, కెసిఆర్‌ని జైలుకు పంపిస్తామని, అక్కడే డబుల్ బెడ్రూమ్ ఇల్లు కట్టిస్తామని మాటలు చెప్పారు. కానీ ఇప్పుడు కేవలం సిట్ విచారణ పేరుతో కాలయాపన చేస్తూ, ప్రధాన నిందితులను కాపాడుతున్నారు తప్ప ఏ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు అన్నారు.
కాళేశ్వరం స్కాం సహా అన్ని అవినీతి కేసులపై తన వద్ద ఆధారాలున్నాయని చెప్పారు. కానీ అధికారంలోకి వచ్చాక చేసిందేమీ లేదు అన్నారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, గొర్రెల స్కాం వంటి అన్ని అవినీతి కేసులపై సిట్టింగ్ జడ్జితో జ్యుడిషియల్ ఎంక్వైరీ జరగాలని బిజెపి డిమాండ్ చేస్తోంది. త్వరలో రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి.
ఈ సందర్భంగా బిజెపి లేదని కొందరు, బిజెపి మత పార్టీ అని మరికొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. బిజెపికి పెరుగుతున్న ప్రజాధరణను అడ్డుకోవడానికే కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీలు ఇలాంటి నాటకాలు చేస్తున్నాయి. గ్రామపంచాయతీ ఎన్నికల్లో గతంలో 163 సర్పంచ్ స్థానాలు మాత్రమే గెలిచిన బిజెపి, ఇటీవలి ఎన్నికల్లో సుమారు వెయ్యి సర్పంచ్‌లు, పదివేల వార్డు మెంబర్లు, 1200 ఉపసర్పంచ్ స్థానాలను గెలుచుకుందన్నారు. బిఆర్ఎస్‌కాంగ్రెస్ పార్టీల దోపిడీ విధానం ఒకటే. ప్రజలను మోసం చేయడంలో రెండూ ఒకేవిధంగా ఉన్నాయి.
అందుకే రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలకు బుద్ధి చెప్పి, బిజెపిని గెలిపించాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మాధవి, ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్, పార్టీ సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, విఠల్, కప్పర ప్రసాద్, సునీతలు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ ఫిరాయింపుదారులకు చట్టబద్ధ రక్షణ కల్పిస్తున్న కాంగ్రెస్

### బిజెపి ముఖ్య అధికారప్రతినిధి, మీడియా ఇన్‌చార్జి ఎన్.వి.సుభాష్

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పుగా మారాయని బిజెపి ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్ మండిపడ్డారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు ఇచ్చిన ఓటు తీర్పును బహిరంగంగా అపహాస్యం చేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లను సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంచడంతో పాటు ఒకదాని తర్వాత ఒకదాన్ని కొట్టివేయడం ద్వారా ఫిరాయింపుదారులకు చట్టబద్ధ రక్షణ కల్పిస్తుందని మండిపడ్డారు. ఇది ప్రజల ఓటు విలువను నాశనం చేసే ప్రమాదకర ధోరణి అరిచ సుప్రీంకోర్టు ప్రకటనలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రతిబింబిస్తున్నాయన్నారు. పదే పదే స్పీకర్‌కు గడువులు ఇవ్వడం, చివరికి ఇది చివరి అవకాశం అని హెచ్చరించడం ద్వారా, అత్యున్నత న్యాయస్థానం స్పీకర్ వ్యవస్థను రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్నట్లు సూచించింది. ఇది తెలంగాణలో ప్రజాస్వామ్య పరిరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని, వైఫల్యాన్ని స్పష్టంగా చూపుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, రాజీవ్‌గాంధీ హయాంలో వచ్చిన యాంటీడిఫెక్షన్ చట్టాన్ని స్వయంగా ఉల్లంఘిస్తున్నారని, 1985లో 52వ రాజ్యాంగ సవరణ ప్రకారం, పార్టీ మారిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2018 ఎన్నికల అనంతరం కాంగ్రెస్ 12 మంది ఎమ్మెల్యేలను బిఆర్ఎస్‌లో చేర్చింది. ఇప్పుడు స్వయంగా అధికారంలోకి వచ్చిన తర్వాత, 10 మంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారన్నారు. ఈ 10 మంది ఎమ్మెల్యేలు మేము ఇంకా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలే' అని చెప్పడం, కానీ పార్టీ కోర్ కమిటీ సమావేశాలకు పిలవక పోవడం, అధికారిక కార్యక్రమాల్లో కనిపించకపోవడం, ప్రజలకు మభ్యపెట్టే చర్య మాత్రమే అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, తమ పదవిని రాజీనామా చేసి మళ్లీ ప్రజల్లోకి వెళ్లాలి. ప్రజల ఓటు తీర్పు కోరాలన్నారు.

## మేడారం భక్తులకు ఆర్టీసీ మెరుగైన రవాణా సేవలు

### ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన ఎండి నాగిరెడ్డి

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రెండేళ్లకొకసారి నిర్వహించే అతిపెద్ద గిరిజన జాతర మేడారానికి వెళ్లే భక్తుల కోసం ఆర్‌టిసి సంస్థ అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. వివిధ ప్రాంతాల నుంచి జాతరకు పోటెత్తే భక్తులను దృష్టిలో ఉంచుకుని ఆర్‌టిసి ఆయా ప్రాంతాల నుంచి ప్రత్యేక రవాణా ఏర్పాట్లతో సేవల్ని అందిస్తోంది. ఆర్‌టిసి సంస్థ ఏర్పాటు చేసిన రవాణా సౌకర్యాలి సంస్థ వైస్‌ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి యంత్రాంగం చేప ట్టిన రవాణా సౌకర్య సేవల్ని గురువారం స్వయంగా పరిశీలించారు. ఉప్పల్ నుంచి మేడారం వెళ్లే దారిలోని కొన్ని ప్రధాన పాయింట్లను పర్యవేక్షి ంచారు. మేడారం మహాజాతరకు వెళ్లే భక్తుల పిల్లల భద్రత కోసం ఉప్పల్ బస్టాప్, హన్మకొండ బస్టాండులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సురక్షి త కేంద్రాలలో పిల్లలకు గుర్తింపు ట్యాగులను వేస్తున్న విధానాన్ని పరిశీలించి.. స్వయంగా పిల్లలకు ట్యాగులు వేశారు. మేడారం వెళ్లే సమయంలో పిల్లలు తప్పిపోకుండా ఉండేందుకు ఈ సురక్షిత చర్యలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. హన్మకొండ బస్టాండులో క్యూలైన్లను పరిశీలించి అక్కడ ప్రయాణికులతో మాట్లాడుతూ రవాణా సేవలను అడిగి తెలుసు కున్నారు. సౌకర్యవంతమైన రవాణా సేవలకై ఆర్‌టిసి తీసు కుంటున్న చర్యల పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. ఎండీ నాగిరెడ్డితో పాటు కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోలమాన్, వరంగల్ రీజినల్ మేనేజర్ విజయభాను ఉన్నారు.


అంబేద్కర్ విగ్రహం ఎదుట విద్యార్థుల ధర్నాలో పాల్గొన్న ఎంపి ఆర్.కృష్ణయ్య. చిత్రంలో నీల వెంకటేష్ తదితరులు

## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలి

### ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), జనవరి 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 14 లక్షల మంది కళాశాల విద్యార్థుల ఫీజులు బకాయిలు 800 కోట్లు వెంటనే చెల్లించాలని, వంద బిసి కళాశాల హాస్టళ్లు, 119 బిసి గురుకులాలు మంజూరు చేయాలని, గురుకుల పాఠశాలల్లో 20 శాతం సీట్లు పెంచాలని డిమాండ చేస్తూ అనేకమంది విద్యార్థులు గురువారం ట్యాంక్‌బండ్ వద్ద గల డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకు ముందు బిసి నాయకుడు మోదీ రాందేవ్ నాయకత్వంలో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ధర్నాలో ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ య్య పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులకు ఫీజుల రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌ల పథకాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఫీజుల బకాయిలు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారని, ఫీజులు కట్టమని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులపై వత్తిడి చేస్తు న్నారని, హాల్ టిక్కెట్లు, సర్టిఫికేట్లు ఇవ్వడం లేదని, విదేశాల్లో చదువు కోవడానికి అవకాశం వచ్చినప్పటికి వారికి సర్టిఫికేట్లు లేక వెళ్లలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఫీజుల బకాయిల, స్కాలర్‌షిప్‌ల బకాయిలను చెల్లించాలని ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు.

## స్ఫూర్తిదాయకం..'తెలుగుజాతికి భూషణాలు'

### తెలుగు వెలుగులను పరిచయం చేసిన ఉత్తమ గ్రంథం: వెంకయ్యనాయుడు



తెలుగుజాతికి భూషణాలు గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, రమణాచారి, పద్మనాభయ్య, పార్వతీశం, రఘురామ్ తదితరులు

**హైదరాబాద్ (నాంపల్లి), జనవరి 29, ప్రభాతవార్త :** భారతదేశ అత్యున్నత పురస్కారాలైన భారతరత్న, పద్మ అవార్డులు పొందిన తెలుగువారి జీవిత సంగ్రహమే డా. రేవూరు అనంత పద్మనాభ రావు రచించిన తెలుగుజాతికి భూషణాలు గ్రంథ మని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఈ భూషణాల వివరాలు వార్తాపత్రికల్లో కొంత వరకు వచ్చినా వివరంగా రాదు కనుక ఈ గ్రంథం వారి జీవితాలు, వారు చేసిన మంచిపనుల గురించి విశ్లేషించిన తీరు అభినందనీ యమని, ఈ గ్రంథం ఎంతగానో ఉపయుక్తంగా, మార్గదర్శిగా, స్ఫూర్తిదాయకం గా ఉంటుందని, ప్రతీఒక్కరూ తప్పక చదివి తెలుసుకోవాలని, ఇతరులకు అందిం చాలని ఆయన సూచించారు. అనంత పద్మనాభరావు 80 యేళ్ల వయస్సులోని ఎన్నో అనుభవాలు, నేర్చుకున్న అంశాలు, పొందిన విజ్ఞానాన్ని ఇతరులతో పంచుకుని భవిష్యత్ తరాలకు అందించాలన్న స్ఫూర్తిని తన రచనల ద్వారా చక్కగా పాటించారన్నారు. ఇలాంటి మహోన్నత వ్యక్తుల నుండి యువత స్ఫూర్తి పొందాలని సూచించారు. నేటితరం సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానళ్ల బారి నపడి విచక్షణ, విజ్ఞానాన్ని కోల్పోయి నానా అనర్థాలకు దారితీస్తున్న విషయం మనందరికీ విదితమేనని, ఈ తరుణంలో వీటిని సంస్కరించాల్సి న అవసరం ప్రభుత్వాలు, విజ్ఞానవంతులైన మనందరిపైనా ఉందని వెంకయ్యనాయుడు హితవు పలికారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలోనబొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో గురువారంరాత్రి తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహా దారు డా. కె.వి.రమణాచారి సభాధ్యక్షతన జరిగిన గ్రంథావిష్కరణ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు గౌరవ అతిథులు పద్మభూషణ్ కె.పద్మనాభయ్య, డా. ఓలేటి పార్వతీశం, కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులతో కలిసి ప్రముఖ రచయిత, విశ్రాంత అదనపు డైరెక్టర్ జనరల్, దూరదర్శన్ డా. రేవూరు అనంతపద్మ నాభరావు అసీతిని పురస్కరించుకుని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి తెలుగుజాతికి భూష ణాలు గ్రంథాన్ని ఆవిష్కరించారు.
ముందుగా గ్రంథ రచయిత అనంతపద్మనాభ రావు, శోభాదేవి దంపతులను ఘనంగా సత్కరిం చారు. ఈ సందర్భంగా డా. రేవూరు అనంతపద్మ నాభరావు సమగ్ర సాహిత్య పరిశోధన చేసి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్ పర్యవేక్షణ లో థీసీస్ ప్రతిని వేదిక మీదున్న అతిథులకు గౌరీశంకర్ సమర్పించారు. అనంతరం కె.పద్మ నాభయ్య తదితరులు ప్రసంగించారు. అనంత పద్మనాభరావు తన స్పందనను తెలిపారు.

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మామ మోతె కృష్ణారెడ్డి ఆకస్మిక మృతి

**హైదరాబాద్ (మలక్‌పేట), జనవరి 29, ప్రభాతవార్త:** కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీ మణి కావ్య తండ్రి మోతె కృష్ణారెడ్డి(86) గుండెపోటుతో గురువారం కన్ను మూ శారు. కామారెడ్డి జిల్లాకు చెందిన ఆయన ఉద్యోగరీత్యా నగరానికి వచ్చి మలక్‌పేట పల్టాన్‌లో స్థిర పడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిషనర్ ప్రింటింగ్ ప్రెస్‌లో సీనియర్ లీడర్‌గా పనిచేసి 1995లో పదవీ విరమణ చేశారు. రెండు రోజుల క్రితం హైదర్‌గూడా అపోలో హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం 11.53 గంటలకు గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. కృష్ణారెడ్డికి భార్య శ్యామల, ఇద్దరు కుమార్తెలు విజయభారతి, కావ్య, కుమారుడు శ్రీనివాసరెడ్డి ముగ్గురు సంతానం ఉన్నారు. శుక్రవారం ఉద యం 11 గంటలకు అంబర్‌పేట స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిం చనున్నట్లు కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.


మోతె కృష్ణారెడ్డి (ఫైల్)

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు.. ఫిర్యాదుల కోసం టిఇ-పోల్ యాప్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 29:** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల సందడి ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం టిఈ-పోల్ మొబైల్ యాప్‌ను ప్రారంభించింది. ఎన్నికలకు సంబంధించి ఏవైనా సమస్య లుంటే ఫిర్యాదులు చేయడానికి ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ద్వారా సులభంగా ఫిర్యాదు నమోదు చేయవచ్చు. అలాగే టిఎస్ఈసీ.గవ్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదులు చేయొచ్చని ఎస్ఈసీ పేర్కొంది. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తం 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు నిర్వహించేందుకు అధికా రులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఫిబ్రవరి 11వ తేదిన పోలింగ్ జరగనుంది, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో పార్టీలన్నీ జనాభా ప్రకారం సీట్లు ఇవ్వాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న మాజీ ఐఏఎస్ చిరంజీవులు, బాలరాజుగౌడ్, ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, దుర్గయ్యగౌడ్, బైరి శేఖర్ తదితరులు

జనరల్ స్థానాల్లోనూ బిసిలు పోటీ చేయాలి
బిసి ఇంటలెక్చువల్ ఫోరమ్ చైర్మన్ చిరంజీవులు
బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలరాజుగౌడ్

**హైదరాబాద్, జనవరి 29,ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల్లో అన్ని పార్టీలు బిసి లకు జనాభా దామాషా ప్రకారం బిసిలకు 56శాతం స్థానాలు కేటాయించాలని బిసి ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిసిల ద్రోహి పార్టీలుగా చిత్రీకరిస్తామని హెచ్చరించారు. ఎన్నికల్లోనూ ఈ పార్టీలకు బిసిలు ఓట్లు వేయొద్దని ప్రచారం చేస్తామని తెలిపారు. బిసిలు 56 శాతం ఉన్నారని లెక్కలు చెప్పడం, 42 శాతం రిజర్వే షన్లు ఇస్తామని హామీనివ్వడం తర్వాత ఇష్టానుసారంగా రిజర్వేషన్లు తగ్గించు కొంటూపోతే బిసి సంఘాలు చూస్తూ ఊరుకోబోవన్నారు. గురువారం సోమాజి గూడ ప్రెస్‌క్లబ్‌లో బిసి పొలిటికల్ ఫ్రంట్, బిసి ఇంటలెక్చువల్ ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్.దుర్గయ్యగౌడ్ ఆధ్యక్షతన జరిగిన మీడియా సమావేశానికి చిరంజీవులు ముఖ్యఅతిథిగా హాజరుకాగా ఫ్రంట్ చైర్మెన్ బాలగోని బాలరాజు గౌడ్, ఎలికట్టే విజయకుమార్‌గౌడ్‌తో కలిసి మాట్లాడారు.
ఒకవైపు తెలంగాణలో ప్రపంచంలోనే అతిపెద్ద మేడారం జాతరకు ప్రజలంతా వెళ్తే మరోవైపు మున్సి పల్ ఎన్నికల నోటిఫికేషన్ 28 నాడే ఇచ్చి, 29 నుంచే నామినేషన్లు అనడం సరికాదన్నారు. సర్పంచ్ ఎన్నికల తరహాలో మున్సిపల్ ఎన్నికల్లోనూ జనరల్ స్థానాల్లో బిసిలు పోటీ చేయాలని పిలుపునిచ్చారు. ఎస్సి, ఎస్టిలను కలుపుకొని బిసిలు ముందుకెళ్లి, బహుజనవాదాన్ని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ సామాజిక న్యాయం అంటూ వందల కోట్లు ఖర్చుతో కులగణన చేసి లెక్కలను ఇంతవరకు బయట పెట్టలేదన్నారు.
గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వంలో బిసిలను ఏనాడూ పట్టించుకోలేదన్నారు. ఈ మూడు పార్టీలను మున్సిపల్ ఎన్నికల్లో బిసిలు బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. బాలరాజు గౌడ్ మాట్లాడుతూ అధికారంలో లేని రాష్ట్రాల్లో జనగణనలో కులగనన చేస్తామని మాట ఇచ్చి అధికారం చేపట్టగానే కులగన బీసీ కులగననపై లేనిపోని షరతులు పెడుతూ బిసి లను ఇబ్బందికి గురి చేస్తుందన్నారు.

## సింగరేణికి 'బేకన్ ఆఫ్ హోప్' అవార్డు

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** సామాజిక భాధ్యత కార్యక్రమాలకు గాను సింగరేణికి బీకన్ ఆఫ్ హోప్ అనే అవార్డును పొందింది. సింగరేణి సంస్థ గత ఐదేళ్ల కాలంలో కొత్తగూడెం జిల్లాలో 15 కోట్ల రూపాయల సీఎస్ఆర్ నిధులు వెచ్చించి పాఠశాలల భవనాలు, రోడ్లు, డ్రైనేజీలు వంటి ప్రజోపయోగమైన అనేక పనులను చేపట్టింది. భద్రాచలం ట్రైబల్ భవన్ లో జరిగిన సీఎస్ఆర్ సమిట్ లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఈ అవార్డును సింగరేణి సంస్థ జనరల్ మేనేజర్ జి.వెంకట కిరణ్ కుమార్, సీఎస్ఆర్ అధికాగట్టు స్వామికి అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ సేవలను కలెక్టర్ ప్రశంసించారు. ఈ జిల్లాలో అత్యధిక సీఎస్ఆర్ పనులు చేపట్టినందుకు గుర్తింపుగా ఈ అవార్డును సింగరేణి సంస్థకు బహూకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదే విధంగా సింగరేణి సంస్థ అన్ని జిల్లాల్లోనూ కోట్లాదిరూపాయలు వెచ్చించి కనీస మౌలిక సదుపాయాల కల్పనకు మరియు విద్యా, వైద్యాభివృద్ధికి సీఎస్ఆర్ నిధులతో సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు కోసం 5న చలో ఢిల్లీ

### పోస్టర్‌ను ఆవిష్కరించిన తెలంగాణ ఉపాధ్యాయ సంఘాలు

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకి టెట్ మిన హాయింపు కోరుతూ ఫిబ్రవరి 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని ఉపా ధ్యాయ సంఘాలు నిర్వహించనున్నాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను తెలంగాణ ఉపాధ్యాయ సంఘాలు గురువారం ఆవిష్కరించాయి. గురు వారం పిఆర్‌టియు టిఎస్ కార్యాలయంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో చలో ఢిల్లీ గోడపత్రిక(పోస్టర్)ను విడుదల చేశారు. సీనియర్ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుండి మినహాయింపు ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని, జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, పాఠశాలల మూసివేత, విలీనం నిలిపివేసి, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, తాత్కాలిక ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలనే పలు డిమాండ్లతో జాతీయ ఉపాధ్యాయ ఫెడరేషన్ల పిలుపు మేరకు ఫిబ్రవరి 5న నిర్వహించే పార్లమెంట్ మార్చ్ కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఉపాధ్యా యులు అందరూ ఫిబ్రవరి 5న ఉదయం 10 గంటలకు జంతర్ మంతర్ వద్దకు చేరుకోవాలని సూచించారు. జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో పార్లమెంట్‌సభ్యులు, వివిధ జాతీయ సంఘాల నాయకులు పాల్గొంటార న్నారు. కార్యక్రమంలో ఎస్‌టిఎఫ్‌ఐ ప్రధాన కార్య దర్శి చావ రవి, ఎఐఎస్టిఎఫ్ ప్రధాన కార్యదర్శి జి సదానందం గౌడ్, పిఆర్‌టియు టిఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి దామోదర్ రెడ్డి, ఎస్ బిక్షం గౌడ్, టిఎస్ యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్, ఎస్టియు ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, పిటిఎ టిజి అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, టిపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ అనిల్ కుమార్, ఎన్ తిరుపతి, డిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం సోమయ్య, టి లింగారెడ్డి, పిటిఎ టిజి అధ్యక్షుడు కె మల్లికార్జున రెడ్డి, పీఆర్టీయూ తెలంగాణ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా, టిఆర్టిఎఫ్ అధ్యక్షుడు కటకం రమేశ్, ఎఐఐటిఎ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముజీబ్, ముంతాజ్ అలీ పాల్గొన్నారు.

# 12,751 గ్రామ పంచాయతీల్లో టి ఫైబర్ విస్తరణ

### ఇంధన, వైద్య, పరిశ్రమలు, మైన్స్, ఐటీలపై సిఎస్ సమీక్ష


గురువారం సచివాలయంలో విభాగాల వారీగా ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.రామకృష్ణారావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 29:** ఇంధన, వైద్య ఆరోగ్య, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పరిశ్రమలు, మైన్స్, టిజిఐఐసి, భారత ఫ్యూచర్ సిటీ, ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, మూసీ సుందరీ కరణ, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ తదితర శాఖల పనితీరుపై విభాగాల వారీగా గురువారం సచివాల యంలో ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె. రామకృష్ణారావు ఉన్నతాధికా రులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంధన శాఖ సమావేశంలో రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, టిజి ట్రాన్స్‌కో, టిజి జెన్‌కో, టిజి ఎస్‌పిడిసి ఎల్, టిజి ఎన్‌పిడిసిఎల్ విభాగాలలో కొనసాగుతున్న ప్రతిపాదిత ప్రాజెక్టుల పురోగతి, అలాగే భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీసుకోవాల్సి న చర్యలపై విస్తృతంగా చర్చించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వ యంతో పనిచేయాలని సిఎస్ ఆదేశించారు. రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో విద్యుత్ రంగంలో అమలవుతున్న విధానాన్ని పరిశీలించి మన రాష్ట్రంలో కూడా వివిధ డిస్కంలలో అమలు చేసేందుకు తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు చేపట్టిన పనుల పురోగతిపై సిఎస్‌కు వివరించారు. ఇగవర్నెన్స్, తదితర అంశాలు, అండర్ గ్రౌండ్ కేబులింగ్, విజన్ 2047 లక్ష్యాలు, గ్రేటర్ హైదరాబాద్ భవిష్యత్ విద్యుత్ అవసరాల మేరకు ప్రతిపాదిం చిన చంద్రవెల్లి, రాయదుర్గం, షాద్‌నగర్, పరిగిలో విద్యుత్ సబ్ స్టేషన్ల పనుల పురోగతిపై సిఎస్ సమీక్షి ంచారు.
వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో వరంగల్, ఆల్వాల్, సనత్‌నగర్, ఎల్.బి.నగర్, న్యూఉస్మానియా, నిమ్స్ ఆసుపత్రి విస్తరణ పలు ప్రాంతాల్లో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రుల భవనాల పురోగతి, ప్రజలకు అందుతున్న వైద్య సేవల నాణ్యత, వైద్య సదుపాయాల లభ్యత, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రభుత్వ ఆసు పత్రులలో మందుల సరఫరా, వైద్యశాఖలో నర్సి ంగ్, వైద్యుల నియమకాలు, ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన ఇహెచ్ఎస్ పథకం, వైద్యపరికరాల సరఫరా తదితర అంశాలపై సిఎస్ సమీక్షి ంచారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సిఎస్ ఆదేశించారు. మాతా-శిశు ఆరోగ్యం, సంక్రమణ రోగాల నియంత్రణ, సీజనల్ వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జిహెచ్ఎంసి పరిధిలో చేపట్టిన ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం, ఆల్వాల్, సనత్‌నగర్, ఎల్.బి.నగర్, వరంగల్ ఆసుపత్రుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని సిఎస్ అధికారులను ఆదేశించారు.
నూతన ఆసుపత్రుల అవసరాలకు మేరకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవాలని, ఇందుకు సంబంధించి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.
ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పరిశ్రమలు, మైన్స్, టిజిఐఐసిలకు సంబంధించిన సమావేశంలో ఐటీఈసీ శాఖలో ప్రస్తుత కార్యకలాపాలు, కొనసాగుతున్న ప్రాజెక్టులు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై అధికారులు సిఎస్‌కు వివరించారు. ముఖ్యంగా డిజిటల్ గవర్నెన్స్, ఐటీ పెట్టుబడుల ఆకర్షణ, స్టార్టప్ ఎకోసిస్టం అభివృద్ధి, ఈగవర్నెన్స్ సేవల విస్తరణ, సైబర్ సెక్యూరిటీ, రాష్ట్రంలో ఉన్న 12,751 గ్రామ పంచాయతీల్లో టిఫైబర్ విస్తరణపై సమీక్ష చేశారు. రాష్ట్రాన్ని ఐటీ రంగంలో మరింత పోటీగా నిలిపే దిశగా స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.
పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడం,యువతకు ఉపాధి అవకాశాలు పెంచేలా ఐటీ రంగంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. గత మూడు రోజులుగా ఇప్పటి వరకు (13) విభాగాలను ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. రాబోయే రెండు రోజులలో మిగతా విభాగాల సమీక్షకు సిద్ధమవుతున్నారు.

# మళ్లీ సమాజాన్ని వెనక్కి తీసుకెళుతున్నామా?

### యుజిసి 'సమానత్వ' నిబంధనపై సుప్రీంకోర్టు స్టే

**న్యూఢిల్లీ, జనవరి 29:** కుల వివక్షను రూపుమాపి, ఉన్నత విద్యాసంస్థల్లో సమానత్వాన్ని పెంపొందించేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ తీసుకొచ్చిన కొత్త నిబంధనలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఈ నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను గురువారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ మార్గదర్శకాలు అస్పష్టంగా ఉన్నాయని, వీటిని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా కేంద్రం, యుజిసికి సుప్రీం ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. తదుపరి నోటీసులు ఇచ్చేంతవరకు నిబంధనలపై స్టే అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది. స్వాతంత్య్రం వచ్చిన ఇన్ని దశాబ్దాల తర్వాత కులవివక్ష లేని సమాజం కోసం మనం ఏం సాధించాం? ఈ విషయంలో మనం మళ్లీ సమాజాన్ని వెనక్కి తీసుకెళుతున్నామా? అనే భావన కలుగుతోంది. దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలు ఇలా దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు తమ సంప్రదాయాలకు అనుగుణంగానే వ్యవహరిస్తారు. అలాంటి వారిని ర్యాగింగ్ పేరుతో కొందరు అవహేళన చేస్తుండడం అత్యంత బాధాకరం. వారిని అరికట్టేందుకు ప్రత్యేక హాస్టళ్లు ఉండాలని భావిస్తున్నారు. కానీ, ప్రస్తుత సమాజంలో కులాంతర వివాహాలే జరుగుతున్నాయి. హాస్టళ్లలోనూ అందరూ కలిసే ఉంటున్నారు. అలాగే, ఐక్యతను విధానం మన విద్యాసంస్థల్లో స్పష్టంగా ప్రతిబింబించాలి. విద్యాసంస్థల్లో స్వేచ్ఛాయుత, సమానత్వ, సమ్మిళిత వాతావరణాన్ని మేం కోరుకుంటున్నాం అని విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రతి ఉన్నత విద్యాసంస్థల్లోనూ సమానత్వ కమిటీల ఏర్పాటును యుజిసి ఇటీవల తప్పనిసరి చేసింది. ఆయా కమిటీల్లో ఓబిసి, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలకు ప్రాతినిథ్యం కల్పించాలని స్పష్టం చేసింది. రోహిత్ వేముల కేసులో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు యుజిసి నిబంధనలు - 2012 స్థానంలో కొత్త నిబంధనలను ఈ నెల 13 నుంచి అమలులోకి తెచ్చింది. అయితే, కొత్త నిబంధనలలోని కులవివక్ష నిర్వచనాన్ని ఒబిసి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, అధ్యాపక సిబ్బందికే పరిమితం చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలోనే యుజిసి నిబంధనలను సవాల్ చేస్తూ ఓ న్యాయవాది సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.



# శుభ్రమైన గాలి లేకుండా జరిగే అభివృద్ధి నిజమైన ప్రగతి కాదు

### రాష్ట్రంలో 40 కొత్త స్టేషన్లను ఏర్పాటు చేశాం

### గాలి నాణ్యత సూచీ.. నిర్వహణ సదస్సులో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 29:** పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది అందుకే ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో శాస్త్రీయ విధానాన్ని అనుసరిస్తుందని హైదరాబాద్‌నగరం తో పాటు రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ కేబినెట్ ముందుకు వెళుతుందని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అన్నారు. రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో గాలి నాణ్యత సూచీ, గాలి నాణ్యత నిర్వహణ అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలం గాణ దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటి, హైదరాబాద్ ఐటీ, లైఫ్ సైన్సెస్, తయారీ, ఆవిష్కరణల కేంద్రంగా ఎదిగింది. ఈ అభివృద్ధి మనకు గర్వకారణం అని తెలిపారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణను ఎదురెదురుగా నిలబెట్టలేం, అవి చేతులు కలిపి ముందుకు నడవాలి అని డిప్యూటీ సీఎం అన్నారు. సుస్థిర అభివృద్ధి ద్వారా మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యాన్ని సాధించాలనే దృఢ సంకల్పంతో మా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. అదే సమయంలో జలాశయాల పునరుద్ధరణ, సహజ వనరుల సంరక్షణ, గాలి నాణ్యత మెరుగుదలపై కూడా తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతోందన్నారు. ఎందుకంటే శుభ్రమైన గాలి లేకుండా జరిగే అభివృద్ధి నిజమైన ప్రగతి కాదు, అది కేవలం ఆలస్యమైన నష్టం మాత్రమే అని వివరించారు. గాలి నాణ్యత ఒక పర్యావరణ సూచీ మాత్రమే కాదు,అది ప్రజారోగ్య సూచీ,అది ఉత్పాదకత సూచీ, అది ఆర్థిక సూచీ కూడా అన్నారు. నేడు గాలి కాలుష్యం, అధిక రక్తపోటు తర్వాత, ప్రపంచంలో మరణాలకు రెండో ప్రధాన కారణంగా మారిందని,ప్రతి ఏడాది 80 లక్షలకుపైగా అకాల మరణాలకు ఇది కారణమవుతోంది అన్నారు. ఇది మన పిల్లలను, వృద్ధులను, పని చేసే జనాభాను తీవ్రంగా ప్రభావితం చేస్తోందని అన్నారు.ప్రపంచ బ్యాంక్ అధ్యయనం ప్రకారం, గాలి కాలుష్యం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఏటా నాలుగు ట్రిలియన్ డాలర్లకు పైగా నష్టం వాటిల్లుతోంది, అందుకే శుభ్రమైన గాలి గురించి మాట్లాడినప్పుడు, మనం మనుషుల జీవితాల గురించి, ఆర్థిక బలంపై, సామాజిక శ్రేయస్సు గురించి మాట్లాడుతున్నామన్నారు. హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలలో ఒకటిగా ఇప్పటికే గుర్తింపు పొందింది, ఇది మనందరికీ గర్వకారణం, కానీ అదే సమయంలో మన నగర వ్యవస్థలు కూడా అంతే వేగంగా పరిపక్వం చెందాలని పేర్కొన్నారు.





2025లో రాష్ట్ర గాలి శుభ్రత కార్యాచరణ ప్రణాళికను రూపొందించాం. వాహనాలు, రోడ్డు ధూళి, నిర్మాణాలు, పరిశ్రమలు, బహిరంగ దహనం వంటి ప్రధాన కాలుష్య మూలాలను ఈ ప్రణాళిక పరిష్కరిస్తోంది. ఇది ఇప్పటికే అమలులో ఉందనీ తెలిపారు. మూడోది స్వచ్ఛమైన రవాణా.... ఎలక్ట్రిక్ వాహనాలకు సబ్సిడీలు అందిస్తున్నాం. ఈ-బస్సులు, మెట్రో విస్తరణ ద్వారా ప్రజా రవాణాను బలోపేతం చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా ఛార్జింగ్ మౌలిక వసతులు నిర్మిస్తున్నాం. పాత, కాలుష్యకర వాహనాలను తొలగించేందుకు రిజిస్టర్డ్ వాహన స్క్రాపింగ్ కేంద్రాలను ప్రారంభించామని పేర్కొన్నారు. కాలుష్య ఫిర్యాదులకు వేగంగా స్పందించేందుకు రెండు జిహెచ్ఎంసీ జోన్లలో ప్రత్యేక చర్యల బృందాలను ప్రయోగాత్మకంగా ప్రారంభిస్తాం, ఫలితాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా ఆ కేంద్రాలను విస్తరిస్తాం అన్నారు.

# అంగన్‌వాడీల్లో పర్యవేక్షణ కమిటీలు

### మహిళా, శిశు సంక్షేమ శాఖ కసరత్తు

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో అవినీతి, అక్రమాలకు తావు లేకుండా పర్యవేక్షి ంచే బాధ్యతలను ఇక సర్పంచ్ నేతృత్వంలోని పర్యవేక్షణ కమిటీలకు అప్పగించ నున్నారు. ఇప్పటి వరకూ పలు చోట్ల కేంద్రాల టీచర్లు, సహాయకులు ఇష్టారాజ్యాంగా వ్యవహారి స్తున్నారని, పోషకాహారాన్ని పక్కదారి పట్టిస్తు న్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఈ క్రమంలోనే నూతన పర్యవేక్షణ కమిటీల ఏర్పాటుకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అంగన్వాడీ స్థాయి పర్యవేక్షణ, సహాయ కమిటీ (ఏఎల్ఎంఎస్‌సీ) లను కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లతో పునర్నిర్మించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా 11 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీకి సర్పంచ్ ఛైర్మన్‌గా, అంగన్వాడీ టీచర్ కన్వీనర్‌గా, సైన్స్ బోధించే ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు, విశాంత ఉద్యోగి, ఏఎన్ఎం, చిన్నారుల తల్లులు సభ్యులుగా ఉంటారు. రాష్ట్ర వ్యాప్తంగా 35,781 అంగన్వాడీ కేంద్రాల్లోని దాదాపు 8 లక్షల మంది పిల్లల ఉన్నారు. వీటికి సర్పంచ్ ఛైర్మన్‌గా కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. వీరు ప్రభుత్వం నుంచి సరఫరా అవుతున్న సరకులు ప్రతినెలా కేంద్రానికి సక్రమంగా చేరుతున్నాయో లేదో పర్యవేక్షి స్తారు. వాటి నాణ్యత పరిశీలిస్తారు. ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు అందించే భోజనాన్ని పరిశీలించాల్సి ఉంటుంది. పిల్లలు, గర్భిణులు కేంద్రాలకు వచ్చే ప్రజలకు అవగాహన కల్పిస్తారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలిం తలు, చిన్నారుల కోసం ప్రతి నెలా పాలు, గుడ్లు, కందిపప్పు, బియ్యం, బాలామృతం తదితరాలను పోషకాహారంగా అందిస్తున్నారు. చాలా గ్రామాల్లో కేంద్రాల ద్వారా అవి లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందడం లేదు. దీన్ని పర్యవేక్షణ కమిటీ గుర్తించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది.

# భారత్ నుంచి అమెరికా అధినేతలకు అందిన బహుమతులను వెల్లడించిన యుఎస్ విదేశాంగ శాఖ

**వాషింగ్టన్, జనవరి 29:** భారత ప్రధాని నరేంద్ర మోడీ సహా ఇతర భారతీయ నాయకులు నాటి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఇతర ఉన్నతాధికారులకు అందించిన ఖరీదైన కానుకల వివరాలు అమెరికా ప్రకటించింది. ఆదేశ విదేశాంగ శాఖకు చెందిన చీఫ్ ఆఫ్ ప్రోటోకాల్ కార్యాలయం విడుదల చేసిన నివేదిక ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించింది. ఈ జాబితాలో అత్యంత ఖరీదైనది, ప్రత్యేకమైనది ప్రధాని మోడీ బైడెన్‌కు ఇచ్చిన రూ.6.5 లక్షల విలువైన స్టెర్లింగ్ సిల్వర్ రైలు సెట్. ఈ బహుమతిని అమెరికా నిబంధనల ప్రకారం జాతీయ పురావస్తు భాండాగారానికి (నేషనల్ ఆర్కైవ్) తరలించారు. అమెరికా విదేశాంగ శాఖ 2024 క్యాలెండర్ సంవత్సరానికి గాను ఈ నివేదికను విడుదల చేసింది. ప్రభుత్వ అధికారులు స్వీకరించే బహుమతుల విలువ 480 డాలర్ల కంటే ఎక్కువగా ఉంటే, వాటి వివరాలను తప్పనిసరిగా వెల్లడించాల్సి ఉంటుంది.



ఈ నివేదిక ప్రకారం, 2024 జూలై 16న ప్రధాని మోదీ బైడెన్‌కు ఈ ప్రత్యేకమైన వెండి రైలు సెట్‌ను బహూకరించారు. దీని విలువ 7,750 డాలర్లుగా అంచనా వేశారు. అంతకుముందు, 2023 సెప్టెంబర్ 10న కూడా బైడెన్‌కు మోదీ నుంచి 562 డాలర్ల విలువైన బహుమతులు అందాయి. వాటిలో చెక్క పెట్టె, ఒక స్కార్ఫ్, కుంకుమపువ్వు ఉన్న జాడీ, టీ పొడి బాక్స్ ఉన్నాయి. టీ, కుంకుమపువ్వు వంటివి వాడి పారేసేవి కావడం వల్ల, మిగిలిన వస్తువులను నేషనల్ ఆర్కైవ్స్‌కు బదిలీ చేసినట్లు నివేదికలో పేర్కొన్నారు. అధ్యక్షుడు బైడెన్‌కే కాకుండా, ఆయన కుటుంబ సభ్యులకు, ఇతర ఉన్నతాధికారులకు కూడా భారత్ నుంచి కానుకలు అందాయి.

# రాష్ట్రంలో ఆంధ్ర విజయ డెయిరీ టెండర్లకు నోటిఫికేషన్

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త :** తెలంగాణలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విజయ డెయిరీ వ్యాపారాన్ని చేపట్టేందుకు నిర్ణయించింది. ఇప్పటికే నెయ్యి విక్రయాలను చేపట్టిన ఆంధ్రా విజయ డెయిరీ, ఇప్పుడు పాలరంగంలోకి దిగుతోంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో మిల్క్ ప్రాసెసింగ్, ప్యాకింగ్, మార్కెటింగ్ కోసం టెండర్లను ఆహ్వానించింది. దీనికి సంబంధించి ఇప్పటికే నోటిఫికేషన్ కూడా జారీచేసింది. హైదరాబాద్‌లో పాల ప్రాసెసింగ్, ప్యాకింగ్, మార్కెటింగ్‌కు ఈ నెల 13వ తేదీన టెండర్లు ఆహ్వానించింది. తద్వారా తెలంగాణలో పాలు కొనుగోలు చేయకుండా విజయ బ్రాండ్ పేరుతో పాల విక్రయం జరిపేందుకు సిద్ధమవుతోంది. వాస్తవానికి ఆంధ్రాకి చెందిన విజయ డెయిరీకి తెలంగాణలో ఎక్కడా మిల్క్ ప్లాంట్ లేదు. రాష్ట్రంలోని రైతుల నుంచి ఒక్క చుక్క పాలు కూడా సేకరించడం లేదు. హైదరాబాద్‌లో ఆంధ్రా విజయ డెయిరీ పాల విక్రయాలు ప్రారంభిస్తే తెలంగాణ రైతులకు, రాష్ట్ర విజయ డెయిరీకి నష్టం ఖాయమనే ఆందోళన వ్యక్తమవుతోంది. తెలంగాణ విజయకు ప్రధానంగా హైదరాబాద్ పెద్ద మార్కెట్‌గా ఉంది. ఇక్కడి డిస్ట్రిబ్యూటర్లు, దుకాణదారులు ఆంధ్రా పాలను విక్రయించడం వల్ల, తెలంగాణ విజయ డెయిరీ తదితర రాష్ట్ర సంస్థలు సరఫరా చేస్తున్న వాటిని పట్టించుకోకపోవడంతో ఇక్కటి వాటికి నష్టాలు వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో తెలంగాణ విజయ పాల విక్రయాలు తగ్గిపోతాయని అంచనా వేస్తున్నారు. దీనిపై విజయ డెయిరీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డిని మాట్లాడుతూ ఆంధ్రా విజయ డెయిరీ హైదరాబాద్‌లో పాల వ్యాపారం చేసేందుకు టెండర్లు పిలిచినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై న్యాయ పోరాటం చేసేందుకు సిద్ధమవుతున్నట్టు వెల్లడించారు.

### కేంద్ర ఆర్థిక సర్వే కీలక సూచన!

# ఉదయం 6 నుంచి రాత్రి 11 గం. దాకా జంక్‌ఫుడ్ ప్రచారాన్ని నిషేధించాలి

**న్యూఢిల్లీ, జనవరి 29:** అధిక కొవ్వు, చక్కెర కలిగిన అత్యంత ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాల వినియోగంపై ఆందోళనలు వ్యక్తమవుతోన్న వేళ కేంద్ర ఆర్థిక సర్వే కీలక సూచన చేసింది. ఉదయం 6 గంటల నుంచి అర్ధరాత్రి 11 గంటల వరకు జంక్ ఫుడ్ ప్రకటనపై నిషేధం విధించే అవకాశాలను పరిశీలించాలని పేర్కొంది. అలాగే చిన్నారులు, పసిపిల్లల పాల ఉత్పత్తులు, పానీయాల మార్కెటింగ్‌పైనా ఆంక్షలు విధించాలని పిలుపునిచ్చింది. 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక సర్వేను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్ ఉభయసభల్లో ప్రవేశపెట్టారు. ఈ సర్వేలో అత్యంత ప్రాసెస్ చేసిన ఆహార వినియోగాన్ని తగ్గించే అంశాలపై ప్రస్తావించారు. జంక్‌ఫుడ్‌గా పిలిచే బర్గర్, నూడుల్స్, పిజ్జా, సాఫ్ట్‌డ్రింక్ వంటి పదార్థాల కారణంగా దీర్ఘకాల వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్న విషయాన్ని గుర్తు చేశారు. మనదేశంలో 2009 నుంచి 2023 మధ్య జంక్‌ఫుడ్ వినియోగం 150 శాతానికిపైగా పెరిగింది. అత్యంత ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాల రిటైల్ విక్రయాల విలువ 2006లో 0.9 బిలియన్ డాలర్లు ఉండగా 2019 నాటికి అది 38 బిలియన్ డాలర్లకు పెరిగింది. మహిళలు, పురుషుల్లో ఒబెసిటీ సమస్య దాదాపు రెట్టింపు అయింది. ఏ ఒక్క వినియోగదారుడో తన అలవాట్లను మార్చుకుని సమతుల్య ఆహారం తీసుకున్న మాత్రాన ఆరోగ్య భారత్ సాధ్యం కాదు. ఆహార వ్యవస్థలకు సంబంధించి పాలనపరమైన విధానాల్లోను మార్పులు రావాలి. జంక్‌ఫుడ్ ఉత్పత్తి, మార్కెటింగ్‌ను నియంత్రించాలి అని ఆర్థిక సర్వే పేర్కొంది. ఉదయం 6 గంటల నుంచి అర్ధరాత్రి 11 గంటల వరకు అన్ని ప్రసార మాధ్యమాల్లో జంక్‌ఫుడ్ ప్రకటనలపై నిషేధం విధించే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సర్వే సూచించింది. అలాగే, జంక్‌ఫుడ్ ఉత్పత్తులపై అధిక కొవ్వు, చక్కెర, ఉప్పు ఎంత వినియోగించారో హెచ్చరించేలా న్యూట్రిషన్ లేబుల్‌ను ముద్రించాలని సూచించింది.



# కెసిఆర్‌పై గౌరవం ఉంది.. సిట్ విచారణకు సహకరించాలి: పిసిసి చీఫ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జనవరి29:** ఫోన్ ట్యాపింగ్ అత్యంత హేయమని టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. గత పదేళ్లలో విచ్చలవిడిగా ఫోన్ ట్యాపింగ్ చేశారన్నారు. కెసిఆర్ సిట్ విచారణకు సహకరించాలని పిసిసి అధ్యక్షుడు సూచించారు. గాంధీభవన్‌లో పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ.. అప్పటి ప్రభుత్వంలోని పెద్దల ప్రమేయం లేకుండా అధికారులు ట్యాపింగ్ చేయలేరని ఆయన ఆరోపించారు. ఉద్యమకారుడిగా కెసిఆర్‌పై గౌరవం ఉందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిజానిజాలు తేలాలని మహేశ్‌కుమార్ డిమాండ్ చేశారు. 500లకు పైగా ఫోన్ నంబర్‌లు ట్యాప్ అయ్యాయన్న సమాచారం తమ దగ్గర ఉందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చేందుకు సిట్ అధికారులు నందినగర్‌లోని కెసిఆర్ ఇంటికి వెళ్లారని, ఆ సమయంలో కెసిఆర్ ఫాంహౌస్‌లో ఉన్నారని, దీంతో నందినగర్‌లోని కెసిఆర్ నివాసంలో నోటీసులు ఇచ్చి సిట్ అధికారులు వెళ్లిపోయారని పిసిసి అధ్యక్షుడు తెలిపారు. సిట్ సంపూర్ణ విచారణ జరిపితేనే నిజాలు బయటకు వస్తాయని, ఈ విషయంలో వాస్తవాలు బయటకు రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. కెసిఆర్‌కు నోటీసులు ఇవ్వడంపై రాజకీయ దురుద్దేశం లేదన్నారు.

# ప్రభుత్వ ఖర్చులతో స్వదేశానికి చేరిన గల్ఫ్ కార్మికుని మృతదేహం

### సిఎంఆర్‌ఎఫ్ ద్వారా లక్షా యాభైవేల ఆర్థిక సహాయం

### సిఎం ప్రజావాణికి మృతుని కుటుంబీకుల ధన్యవాదాలు

**హైదరాబాద్ (బేగంపేట) జనవరి 29, ప్రభాతవార్త:** సిఎం ప్రజావాణి గల్ఫ్ దేశంలో మృతి చెందిన ఓ కార్మికుడి కుటుంబానికి అండగా నిలిచింది. మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేందుకు అవసరమైన ఖర్చులకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న ఆ కుటుంబానికి సీఎం ప్రజావాణీ అండగా నిల్చింది. వారికి అవసర మైన రూ 1.50లు ఆర్థిక సహాయాన్ని సీఎంఆర్‌ఎఫ్ ద్వారా అందించి ఆ కుటుంబానికి బాసటగా నిల్చింది. నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం యాంచా గ్రామానికి చెందిన గల్ఫ్‌కార్మికుడు గొల్ల అబ్బులు (తొగరి అబ్బయ్య)గత నెల డిసెంబర్ 9న ఇబ్రి ఎడారిలో మృతి చెందాడు. 52రోజుల అనంతరం మృతదేహం స్వదేశానికి చేరింది. ఓమన్‌లో మృతికి సంబంధించిన ల్యాబ్ నివేదిక కోసం ఇరుదేశాల అధికారులు ఎదురు చూస్తున్నారు. మృతదేహం రవాణా ఖర్చు భరించలేమని ఓమన్ కంపెనీ, భారత ఎంబసీ చేతులెత్తేయడంతో రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమీటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి సహకారంతో మృతుడి కుటుంబం సీఎం ప్రవాసీ ప్రజావాణీని ఆశ్రయించింది. దీనిపై స్పందించిన సీఎం ప్రజావాణీ స్టేట్ నోడల్ అధికారి దివ్యాదేవరాజన్, ప్రజావాణీ ఇంచార్జి డా.జి.చిన్నారెడ్డిలు సీఎం సహాయ నిధి నుంచి రూ 1.50లు చెక్కును మృతుడి భార్య సావిత్రికి అందజేసి అండగా నిలిచారు. ఇండియన్ సోషల్ క్లబ్ తెలంగాణా విభాగం అధ్యక్షులు గుండేటి గణేష్ ఇండియన్ ఎంబసీతో, ఓమాన్ అధికారులను సమన్వయం చేసి మృతదేహాన్ని భారత్‌కు చేరడంలో సహకరించారు. సీఎం ప్రజావాణీ చొరవతో తమకు అండగా నిలవడంపై మృతుని కుటుంబసభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సీఎం ప్రజావాణీ బృందానికి ధన్యవాదాలు తెలియజేసారు.



గొల్ల అబ్బులు (ఫైల్)

# బిల్డర్ ఇంట్లో రూ.18 కోట్ల విలువైన ఆభరణాలు, నగదు చోరీ

**బెంగళూరు, జనవరి 29:** రాజధాని నగరంలోని మరాతహళ్లిలోని ఒక బిల్డర్ ఇంటినుంచి 18 కోట్ల విలువైన బంగారం, వజ్రాభరణాలు, వెండి వస్తువులు దోచుకువెళ్లిన ఇద్దరు నేపాలీ దొంగలను పోలీసులు అరెస్టుచేసారు. కాంట్రాక్టరు బిల్డర్ వీరిద్దరినీ తన ఇంట్లో నౌకరీకి నియమించుకోగా మొత్తం ఆనుపానులు గమనించి వీరు 18 కోట్ల రూపాయల విలువైన ఆభరణాలు దోచుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం ఈ బిల్డర్ కుటుంబం ఒక ఫంక్షన్‌కువెళ్లేందుకు బయలుదేరి వెళ్లారు. మధానయహననం 12.39 గంటలకు ఇంటి మనిషి అంబికా ఓనర్‌కు ఫోన్‌చేసి ఇంటిని దోపిడీచేసి విలువైన వస్తువులు చోరీచేసినట్లు తెలిపిందని పోలీసులు చెప్పారు. బిల్డర్‌కుటుంబం తిరిగి ఇంటికివచ్చి లాకర్లు పగులగొట్టి ఉండటాన్ని గమనించారు. గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్తుల్లో ఐరన్‌రాడ్లు ఉపయోగించి పగులగొట్టారని తెలుస్తోంది. దినేష్, కమలాఇద్దరూ కూడా 11.5 కిలోల బంగారం, వజ్రాభరణాలు ఐదు కిలోల వెండి వస్తువుల, రూ.11.5 లక్షల నగదుతో ఉడాయించారని మొత్తం విలువ సుమారు 18 కోట్లకుపైగానే ఉందని పోలీసులు తెలిపారు. నిందితులకు కుటుంబ కదలికలపైముందుగానే అవగాహణ ఉందని, ఎక్కడ వీటిని భద్రపరుస్తారో కూడా తెలుసని ఉన్నారని, ఇంట్లో వంటమనిషి అంబికా ప్రమేయం ఎంతవరకూ ఉందన్న అంశంపైనా విచారణచేస్తున్నారు. ముందుగా సిసిటివి కెమేరాలను పనిచేయకుండాచేసి చోరీకి పాల్పడ్డారని మరాతహళ్లిప ఓలీస్ స్టేషన్‌లో కేసునమోదుచేసినట్లు అధికారులు తెలిపారు. బిల్డర్ ఎంఆర్‌శికుమార్‌గౌడ మాట్లాడుతూ పనుల నిమిత్తం నెలరోజులక్రితం బయటకు వెళ్లా నని, ఇద్దరు వర్కర్లు వికాశ్, మాయా విష్ణులు నేపాల్‌కు చెందినఇద్దరు సిబ్బంది కూడా వ్యక్తిగత పనులపై సెలవు తీసుకున్నారని వారి స్థానంలో మరో ఇద్దరిని పెట్టి వెళ్లాలని చెప్పినట్లు తెలిపారు

# కెసిఆర్‌కు సిట్ నోటీసులు రేవంత్‌రెడ్డి చిల్లర రాజకీయాలకు పరాకాష్ట: హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి29:** బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు జారీచేయడమనేది రేవంత్‌రెడ్డి చిల్లర రాజకీయాలకు పరాకాష్ఠ అని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్‌ను టచ్ చేయడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేయడమే రేవంత్ అని హెచ్చరించారు. ఈ మేరకు హరీష్‌రావు తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు.

తెలంగాణ జాతిపిత, కోట్లాదిమంది ప్రజల ఆరాధ్యుడు కేసీఆర్‌పై రాజకీయ కక్షతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న కుతంత్రాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని హరీష్‌రావు తన పోస్టులో పేర్కొన్నారు. చరిత్రాత్మక నాయకుడిపై బురద చల్లాలని ప్రయత్నించడం అంటే సూర్యునిపై ఉమ్మి వేసే ప్రయత్నమేనని మండిపడ్డారు.

# ఇది విచారణ కాదు.. ప్రతీకారం

### కెసిఆర్‌కు సిట్ నోటీసులపై కెటిఆర్ ఆగ్రహం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జనవరి29:** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది విచారణ కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు చేస్తున్న రాజకీయ ప్రతీకార చర్య అని ఆయన అభివర్ణించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్, పాలనా లోపాలను కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు. ఇది కేవలం న్యాయాన్ని అపహాస్యం చేయడమేనని, రాజకీయ దురుద్దేశంతోనే ఈ నోటీసులు ఇచ్చారని ఆయన స్పష్టం చేశారు. కెసిఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడని, కేవలం నోటీసులు ఇచ్చి, బెదిరింపులకు పాల్పడి తెలంగాణ ఉద్యమ చరిత్రను, ఆయన కీర్తిని చెరిపేయలేరని హెచ్చరించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తే సహించేది లేదని, ప్రజలే సరైన సమయంలో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు.

# బెయిల్ ఇవ్వాలంటూ హైకోర్టులో ఐ బొమ్మ రవి పిటిషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జనవరి29:** సినిమా పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ నిర్వాహకుడు రవి తెలంగాణ హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశాడు. నాంపల్లి కోర్టులో పలుమార్లు బెయిల్ పిటిషన్ దాఖలు చేసినప్పటికీ చుక్కెదురైంది. దీంతో తాజాగా హైకోర్టును ఆశ్రయించాడు. రవి పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం కౌంటర్ దాఖలు చేయాలంటూ పోలీసులకు నోటీసులు జారీ చేసింది. సైబర్ క్రైమ్ పోలీసులు బెయిల్ ఇవ్వకూడదని మంగళవారం కౌంటర్ దాఖలు చేయనున్నారు, చిత్ర పరిశ్రమకు పైరసీ ద్వారా భారీ నష్టం చేకూర్చారనే ఆరోపణలపై సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. సైబర్ క్రైమ్ పోలీసులు అతడిపై నాలుగు కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. కేసు తీవ్రత దృష్ట్యా నాంపల్లి కోర్టు పలుమార్లు రవి బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది.

# యుపి వారియర్స్‌పై ఆర్సీబి విజయం

### ఫైనల్‌లోకి ప్రవేశించిన రాయల్ ఛాలెంజర్స్

**వదోదర, జనవరి 29:** మహిళల ప్రీమియర్‌లీగ్‌లో 18వ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ జట్టు మరో విజయం సాధించింది. యూపివారియర్స్ తో తలపడిన ఆర్సీబీ ముందు టాస్ గెలిచి బౌలింగ్‌ఎంచుకుంది. సీజన్‌లో ఇప్పటివకూ ఏడు మ్యాచ్‌లు ఆడిన బెంగళూరుజట్టు ఐదు విజయాలు సాధించి ప్లేఆఫ్స్ అర్హత సాధించింది. యుపి జట్టు ఆరు మ్యాచ్‌ల్లో రెండు మాత్రమే గెలిచింది. ఇక 18వ మ్యాచ్ గెలవడంతో ఆర్సీబీ తన ఫైనల్స్ బెర్త్‌ను ఖరారుచేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేపట్టిన యూపి వారియర్స్ మహిళలు ఎనిమిది వికెట్ల నష్టానికిగాను 143 పరుగులుచేసి ప్రత్యర్థి ఆర్సీబీకి 147 పరుగులు లక్ష్యం విధించింది. తదనంతరం బ్యాటింగ్‌చేపట్టిన ఆర్సీబీ లక్ష్యసాధనలో 41 బంతులు మిగిలి ఉండగానే రెండు వికెట్ల నష్టానికి 147 పరుగులుచేసింది. దీనితో ఎనిమిది పరుగుల తేడాతో యూపిజట్టుపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌చేసిన యూపి వారియర్స్‌లో దీప్తిశర్మ 55 పరుగులు చేసింది. మెగ్‌లానింగ్ 41పరుగులుచేసి రాణించారు. ఈజ ఓడీ తొలివికెట్‌కే 74 పరుగులు చేసింది. మిగిలిన బ్యాటర్లు ఎవ్వరూ కూడా రాణించలేకపోయారు. హర్లీన్ డియోల్ 14, సిమ్రాన్‌షేక్ 10పరుగులుచేయగా అమీజోన్స్ ఒకే ఒక్కపరుగుచేసింది. క్లోట్రాయణ్ ఆరు, శ్వేతా సెహ్రావత్ ఏడు పరుగులతో విఫలం అయ్యారు. ఆర్సీబీ బౌలర్లలో నదైన్ డిక్లర్క్ నాలుగు, గ్రేస్ హారిస్ రెండు, శ్రేయాంక పాటిల్, లారెన్‌బెల్ తలా వికెట్ తీసారు. ఆర్సీబీ జట్టులో ఓపెనర్ గ్రేస్ హ్యారిస్ 75పరుగులుచేసి అర్థశతకంతో చెలరేగింది. స్మృతి మంధాన 54 పరుగులతో నాటౌట్‌గా నిలిచింది. కెప్టెన్ ఇన్నింగ్స్‌తో అదరగొట్టింది. దీనితో ఎనిమిది వికెట్లతేడాతో బెంగళూరు జట్టుగెలిచి 12 పాయింట్లతో నాలుగోసీజన్ ఫైనల్‌లో ప్రవేశించింది.



# అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

### దహేగాం మండలంలో కలకలం

**దహేగాం, జనవరి 29, ప్రభాతవార్త:** కుమ్రంభీం జిల్లా దహేగాం మండలంలోని బోర్లకుంట గ్రామపంచాయతీ పరిధిలోని రాళ్లగూడ గ్రామానికి చెందిన వివాహిత ఆత్మకూరి కళావతి (35) బుధవారం అనుమానస్పద స్థితిలో మృతిచెందడం కలంకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు బుధవారం ఉదయం తమ పిల్లలు చదువుకుంటున్న ఇట్యాలలోని ప్రభుత్వ పాఠశాలలో పోషకుల సమావేశం ఉండడంతో కళావతి ఈ సమావేశానికి ఇంటినుండి బయలు దేరింది. కాగా బుధవారం రాత్రి వరకు కళావతి ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటీంబీకులు గ్రామస్థుల సహాయంతో ఆమే ఆచూకి కోసం వెతుకుతుండగా రాళ్ళగూడ గ్రామసమీపంలోని పత్తిచేనులో శవమై కనిపించింది. దీంతో కుటీంబీకులు, గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. కాగా కళావతి భర్త సంతోష్ ఉపాధికోసం హైదబాద్ పట్టణానికి వెళ్ళి పనిచేస్తుండగా భార్య మరణవార్త తెలుసున్న వెంటనే తన స్వగ్రామానికి గురువారం చేరుకున్నాడు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కళావతి (ఫైల్)

# చిన్నారులను సోషల్ మీడియాకు దూరంగా ఉంచాల్సిందే

## - రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్



మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

**విజయవాడ.జనవరి 29,ప్రభాతవార్తప్రతినిధి:** చిన్నారులను సోషల్ మీడియాకు దూరంగా ఉంచాల్సిందేనని ఏపీ విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ స్పష్టం చేసారు. కేజీ నుంచి పీజీ వరకు డ్రగ్‌ఫ్రీ ఏపీ కరిక్యులమ్ అమలుకు చర్యలు తీసుకోవాలని మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. రాష్ట్రంలో పూర్తిగా అరికట్టే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన దిశానిర్దేశం చేశారు.. సచివాలయంలో విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో డ్రగ్స్, గంజాయి నియంత్రణ, సోషల్ మీడియా నియంత్రణపై మంత్రివర్గ ఉపసంఘం సభ్యులతో విడివిడిగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యల పట్ల 70శాతం మంది ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, మిగిలిన 30 శాతంపై కూడా దృష్టి పెట్టాలని అధికారులను లోకేశ్ ఆదేశించారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం చేపట్టిన కఠిన చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని చెప్పారు. పూర్తిగా అరికట్టే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎన్జీవోల ఆధ్వర్యంలో డీ అడిక్షన్ కేంద్రాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. నిర్ణీత వయసుకు లోబడిన మైనర్లను సోషల్ మీడియాకు దూరంగా ఉంచే విషయమై విధివిధానాలను రూపొందించాలని మంత్రి నారా లోకేశ్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. చిన్నారులపై సోషల్ మీడియా నిషేధం విధించే అంశంపై సింగపూర్, ఆస్ట్రేలియా, మలేషియా, ఫ్రాన్స్ లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. ఈ విషయంపై సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ ను పరిగణలోకి తీసుకుని మార్గదర్శకాలు రూపొందించాలని అన్నారు. మలేషియాలో మై డిజిటల్ ఐడీ, పాస్ పోర్టు వివరాలతో ఈకేవైసీ అనుసంధానం ద్వారా 16 సంవత్సరాల పైబడిన వారికి మాత్రమే సోషల్ మీడియా యాక్సెస్ ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి తీసుకొచ్చారు. చిన్నారులను సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలన్న విషయమై మంత్రుల బృంద సమావేశంలో ఏకాభిప్రాయం వ్యక్తమైంది. అయితే ఎంత వయోపరిమితి విధించాలనే విషయమై వివిధ దేశాల్లో చట్టాలను పరిశీలించాల్సిందిగా మంత్రుల బృందం అధికారులకు సూచించింది. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ పోస్టు చేసే వారితో పాటు కులం, మతం, ప్రాంతం పేరుతో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే హెబిచ్యువల్ అఫెండర్స్ ను కట్టడి చేసేందుకు కఠిన చర్యలు చేపట్టాలని లోకేశ్ స్పష్టం చేశారు. దీనిపై చర్చించేందుకు సోషల్ మీడియా ప్లాట్ ఫాం కంప్లయన్స్ ఆఫీసర్లను కూడా వచ్చే జీవోఎం సమావేశానికి రప్పించాలని సూచించారు. సోషల్ మీడియాలో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసేవారిపై చర్యలు తీసుకునేందుకు సెక్షన్46 ఐటీ యాక్ట్ ప్రకారం రాష్ట్రస్థాయి అడ్జుడికేటింగ్ ఆఫీసర్ నియామకంపై నోటిఫికేషన్ విడుదల చేయాలని సమావేశంలో నిర్ణయించారు. కేంద్రప్రభుత్వ అధీనంలోని సహయోగ్ పోర్టల్ ద్వారా కొన్ని కేసుల విషయంలో చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈగల్ యాప్ ను లీప్ యాప్ కు అనుసంధానించాలని దిశానిర్దేశం చేశారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ (ఎలైట్ యాంటీనార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్ ఫోర్స్ మెంట్) ఆధ్వర్యంలో ఇప్పటివరకు చేపట్టిన చర్యలను అధికారులు మంత్రులకు వివరించారు. ఎన్ కార్డ్ ప్రణాళికతో పూర్తిగా అనుసంధానం చేసినట్లు తెలిపారు.



## ఫిబ్రవరి 17నుండి జూబ్లీహిల్స్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

**తిరుమల,జనవరి 29ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల తిరుపతిదేవస్థానంకు అనుబంధంగా తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి 17నుండి 25వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు వేడుకగా జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు ఫిబ్రవరి 10న ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపడతారు. ఉత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 8గంటలనుండి 9గంటలవరకు ,రాత్రి 7నుండి 8గంటల వరకు స్వామివారి వాహనసేవలు ఉంటాయి. శ్రీవేంకటేశ్వరునికి జరిపించే తొమ్మిదిరోజుల ఉత్సవాల్లో ఒక్కోరోజు ఒక్కోవాహనసేవకు ఎంతో విశిష్టత ఉంటుంది. ఈ వాహనాలపై పలు రకాల అలంకారాల్లో కొలువుదీరే స్వామివారు తనచెంతకు వచ్చిన భక్తులను కటాక్షించి వారి కష్టాలను తొలగిస్తాడనేది భక్తుల విశ్వాసం. **-'17నుండి బ్రహ్మోత్సవాలు':** తేదీఉదయం రాత్రిఫిబ్రవరి 17 మంగళవారం ధ్వజారోహణం ఎద్దశేషవాహనం18బుధవారం చిన్నశేషవాహనంహంస వాహనం 19 గురు వారం సింహవాహనం ముత్యపు పందిరి వాహనం20శుక్రవారం కల్పవృక్షవాహనం సర్వభూ పాలవాహనం 21 శనివారం మోహనీ అవతారం గరుడ వాహనం22 ఆదివారం హనుమంత వాహనం గజ వాహనం 23 సోమవారం సూర్యప్రభవాహనం చంద్రప్రభ వాహనం 24 మంగళవారం రథోత్సవం అశ్వవాహనం 25 బుధవారం చక్రస్నానం ధ్వజావరోహణం కాగా ఫిబ్రవరి 26వతేదీ సాయంత్రం 3గంటలకు పుష్పయాగ మహోత్సవం జరుగుతుంది.

## నేటినుంచి గుంటూరు, కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటన..

### - పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం

**విజయవాడ, జనవరి 29, ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుంటూరు, కుప్పంలో పర్యటించనున్నారు. శుక్రవారం గుంటూరులో పర్యటించిన అనంతరం మూడు రోజుల కుప్పం పర్యటనకు సీఎం చంద్రబాబు వెళ్లనున్నారు. గుంటూరు, కుప్పంలో చేపట్టే మూడు రోజుల పర్యటనలో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో మాతా శిశు ఆరోగ్య కేంద్ర భవనాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. నార్త్ అమెరికాలో స్థిరపడిన గుంటూరు మెడికల్ కాలేజ్ పూర్వ విద్యార్థులు గుంటూరు మెడికల్ కాలేజీ అల్యూమిని ఆఫ్ నార్త్ అమెరికా - జింకానా పేరుతో ఏర్పాటు చేసుకున్న సంస్థ ద్వారా రూ. 100 కోట్ల విరాళాన్ని భవన నిర్మాణం కోసం అందచేశారు. 2018లో ఈ భవనానికి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఇప్పుడు ఆయనే ఈ మాతా శిశు కేంద్ర భవనాన్ని ప్రారంభించనున్నారు. ఈ మాతా శిశు కేంద్రంలో అవసరమైన మెడికల్ ఎక్విప్మెంట్, ఫర్నిచర్ సహ ఇతర సౌకర్యాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 27 కోట్లను కేటాయించింది. ఈ కార్యక్రమం అనంతరం సీఎం చంద్రబాబు నేరుగా తన సొంత నియోజకవర్గమైన కుప్పం వెళ్లనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆదివారం సాయంత్రం వరకు కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తారు. ఈ సందర్భంగా సుమారు రూ. 690 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. శుక్రవారం మధ్యాహ్నం 02:35 గంటలకు కుప్పం చేరుకోనున్న ముఖ్యమంత్రి... తన తొలి రోజు పర్యటనలో భాగంగా రూ. 3 కోట్లతో నిర్మించిన అగస్త్య విద్యాచల్ అకాడమీ ప్రారంభించనున్నారు. అనంతరం రూ. 10 కోట్లతో నిర్మించనున్న ఖిలెర్నర్స్ అకామిడేషన్‌ఖి ఫెసిలిటి సెంటర్... రూ. 2 కోట్లతో చేపట్టే ఓబెరాయ్ విజిటర్స్ సెంటర్‌కు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అలాగే కుప్పంలోని స్వర్ణ నవదిశ సెంటర్‌లో లైబ్రరీ, కోవర్కింగ్ స్పేస్, ఆదిత్య బిర్లా మల్టీస్కిల్ సెంటర్‌ను ప్రారంభించనున్నారు. ఏటా 350 మంది యువతకు ఉపాధి శిక్షణ ఇచ్చేలా ఈ సెంటర్ తీర్చిదిద్దారు. దీంతో పాటు... పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా కాంగుంది హెరిటేజ్ విలేజ్, బౌల్డరింగ్ పార్క్, పున్నమి రిసార్ట్‌లను ప్రారంభించనున్నారు. దీంట్లో భాగంగా కుప్పంలో రూ. 4 కోట్ల విలువైన సీఎస్ఆర్ నిధుల పర్యాటకాభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయ నున్నారు. ఇక రెండో రోజు పర్యటనలో భాగంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి సీఎం వరుస సమావేశాలు, కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా బెగ్గలపల్లె పంచాయితీలో వివిధ వర్గాలకు సామాజిక భద్రత పెన్షన్లను స్వయంగా సీఎం పంపిణీ చేయనున్నారు. ఆ తర్వాత 5,555 ఈసైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.

## మహా పాపం - నిజం పేరుతో తిరుపతిలో టిడిపి నేతల ర్యాలీ

**తిరుపతి,జనవరి 29ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకం , భారీ కుంభకోణంపై సిట్ నిర్ధారణతో మహా పాపం నిజం.. అది నెయ్యి కాదు! పామాయిల్ కెమికల్ కలిపిన ద్రవం" అనే నినాదంతో గురువారం తిరుపతిలో టిడిపి నేతలు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమం తిరుపతిలోని పంచముఖ ఆంజనేయ స్వామి గుడి దగ్గర నుండి గాంధీరోడ్డు మీదుగా నాలుగుకాళ్ళ మండపం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో తుడా ఛైర్మన్, టిటిడి ఎక్స్ అఫిషియో సభ్యుడు, టిడిపి తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి సి.దివాకర్ రెడ్డి తిరుపతి పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివాకర్ రెడ్డి మాట్లాడుతూ .."నెయ్యి సరఫరా చేసిన కంపెనీల ఎంపికలో నిబంధనలు ఉల్లంఘించారని, తక్కువ ధరకే నెయ్యి సరఫరా చేసే క్రమంలో నాణ్యతను విస్మరించారని గుర్తించారన్నారు. కోట్లాది మంది భక్తుల ఆరాధ్యదైవం తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో జరిగిన అపచారంపై సంచలన నిజాలు వెలుగులోకి వచ్చాయన్నారు. ప్రసాదం తయారీలో వాడే వస్తువుల విషయంలో ఆగమ శాస్త్రం చెప్పిన నియమాలను పాటించకపోవడం వల్లే ఇలాంటి అపచారాలు జరుగుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో (20192024) లడ్డూ ప్రసాదం కోసం సరఫరా చేసిన నెయ్యి అసలు నెయ్యి కాదని, అది జంతువుల కొవ్వు ,రసాయనాలతో కలిపిన "సింథటిక్ ద్రవం" అని సిట్ దర్యాప్తులో నిర్ధారణ అయ్యిం దన్నారు. సుమారు 68.17 లక్షల కిలోల కల్తీ నెయ్యిని తిరుమల లడ్డూ తయారీకి ఉపయోగించినట్లు సిట్ తేల్చిందన్నారు. ఈ కల్తీ నెయ్యితో దాదాపు 20 కోట్ల లడ్డూ ప్రసాదాలను తయారు చేసి భక్తులకు పంపిణీ చేసినట్లు గుర్తించారన్నారు. ఈ కల్తీ నెయ్యి సరఫరా ద్వారా వైకాపా పెద్దలు దాదాపు 251 కోట్ల రూపాయల మేర అవినీతికి పాల్పడి, భక్తుల మనోభావాలను దెబ్బతీశారని దర్యాప్తులో వెల్లడైందని పేర్కొన్నారు. అంతకుముందు ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వ హించిన తెదేపా నాయకులు, ర్యాలీగా బయలు దేరి నాలుగు కాళ్ళ మండపం వద్దకు చేరుకొని, మానవ హారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, జోన్ 4 మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ,రాష్ట్ర కార్యదర్శి దంపూరు భాస్కర్ యాదవ్, గంగమ్మ గుడి ఛైర్మన్ నైనారు మహేశ్‌యాదవ్, కార్పొరేటర్లు, తెదేపా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు మానవహారంగా నిరసన వ్యక్తం చేశారు.




## కత్తిపూడి జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

### వ్యక్తి సజీవ దహనం

**శంఖవరం జనవరి 29 ప్రభాతవార్త** మండలంలోని కత్తిపూడి జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకరు సజీవ దహనం కాగా.. మరోకి గాయాలయ్యాయి. దీనికి సంబంధించి కాకినాడ జిల్లా అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరం నుంచి మూలపేటకు ఆక్వా మేతతో వెళుతున్న ఓ కంటైనర్ రావికంపాడు జంక్షన్ వద్ద మలుపు తిరుగుతుండగా కోల్కతా నుంచి చెన్నై కాటన్ వేస్ట్ బండిల్స్ లోడుతో వస్తున్న మరో కంటైనర్ ఢీకొంది. రెండు కంటైనర్లు కావడం కావడంతో ఢీకొన్న వెంటనే మంటలు చెలరేగి రెండు కంటైనర్ల ముందు భాగాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో కాటన్ లారీ డ్రైవర్ కమల్ షేక్(43) సజీవ దహనమయ్యాడు. మరోకి గాయాలయ్యాయి. సమాచారం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

## సమాచార శాఖ ఉద్యోగులకు ఉత్తమ సేవకు ప్రతిభ పురస్కారం



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న సమాచార శాఖ ఉద్యోగిని గంగా భవాని

ప్రశంసా పత్రాలు అందుకున్న డీఐపీఆర్వో కార్యాలయం అధికారులు, సిబ్బంది

**విజయవాడ.జనవరి 29,ప్రభాతవార్తప్రతినిధి :** ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా నిలిచే సమాచార పౌర సంబంధాల శాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది అందించిన ఉత్తమ సేవలకుగాను జిల్లా కలెక్టర్ నుండి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. డీపీఆర్వో రమణమూర్తి గురువారం తెలిపిన సమాచారాన్ని అనుస77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇటీవల స్థానిక ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకలలో సమాచార పౌర సంబంధాధికారి కేవీ. రమణారావు, అదనపు పీఆర్వో కె. రవి, ఏవీ సూపర్వైజర్ వివి. ప్రసాద్, అసిస్టెంట్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ ధనుంజయరాజు, టైపిస్ట్ కె. గంగా భవాని లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీ   ్మశ, నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ ల నుండి ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఉత్తమ సేవ పురస్కారాలందుకున్న వారికి సమాచార శాఖ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## తిరుపతి సంగీత కళాశాల విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి

### - ప్రధాని మోడీ సమక్షంలో వందేమాతరంగీతంకు ఎంపిక

**తిరుపతి,జనవరి 29ప్రభాతవార్తప్రతినిధి:** వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ జాతీయస్థాయి కార్యక్రమంలో తిరుపతి ఎస్వీసంగీతనృత్యకళాశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి అందుకున్నారు. గాత్రం విభాగంలో డాక్టర్ పి.శైలజ శిష్యురాళ్ళు మూడవసంవత్సరం బిపిఎ ,విశారధ విద్యార్థులు మ్యూజికాలజీ విభాగంకు చెందిన డాక్టర్ ఎం.సురేంద్ర రచించి స్వరపరిచిన జానపదగేయాన్ని సెట్విన్ తరపున పాడారు. జాతీయస్థాయిలో మన్ననలు అందుకుని రాష్ట్రస్థాయిలో బహుమతి పొందారు. ప్రధాని మోదీ వద్ద వందేమాతరం గేయం పాడటానికి ఈ బృందం నుండి కె.చంద్రలేఖ అర్హత సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమా ముద్దుబాల తెలిపారు.



# తిరుమల సమాచారం

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అంతా శుభాలు

### - స్వామివారి సేవలో ఇండోనేషియా రాజు జోకోవిడోడో



**తిరుమల,జనవరి 29ప్రభాతవార్తప్రతినిధి:** ఇండోనేషియా రాజు జోకోవిడోడో కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతో ఆనందం కలిగిందని విశ్వాసం వ్యక్తం చేశారు. స్వామివారిసేవలో పాల్గొనడం జన్మధన్యమైందన్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో దేశం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

గురువారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఇండోనేషియా రాజు జోకోవిడోడో ఆలయంలోనికి చేరుకున్నారు. సాంప్రదాయంగా దేవదేవుని ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి ఆశీస్సులందరిపై ఉండాలి: ప్రముఖులు



**తిరుమల,జనవరి 29ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రముఖులు ఆకాంక్షించారు. గురువారం ఉదయం గూగుల్ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ తోట,ప్రభుత్వ విఫ్ గణబాబు,ఢిల్లీ ఎన్‌ఫోర్స్ మెంట్ అదనపు డైరెక్టర్ బి.నవీన్‌కుమార్, సినీనటుడు క్రాంతి, బిగ్‌బాస్ కంటెస్టెంట్ అమర్‌దీప్, తేజ,మహేశ్‌విట్ట, హైదరాబాద్ అంబర్‌పేట శంకరన్న కుటుంబంతో కలసి ఆలయంలోపలకు చేరుకుని తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకులమండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి ఆలయం చెంత కొత్త దంపతులు అపచార పనులు!

### - ఫోటోషూట్ పేరుతో నిబంధనలు ఉల్లంఘన

**తిరుమల, జనవరి 29ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యకల్యాణంపచ్చతోరణంగా విరాజిల్లుతున్న తిరుమలకొండపై ఓ నూతన జంట అత్యుత్సాహంతో ఏకంగా దేవుని ఆలయం ముందు అపచారపనులు చేశారు. ఆలయం ముందు గురువారం ఉదయం ఆ జంట ఫోటోషూట్ పేరుతో ముద్దులు పెట్టుకుంటూ...ఒకరినొకరు మనుషులు తగులుతూ కొత్త జంట చేసిన నీచపుపనులను భక్తులు తప్పుపడతున్నారు. ఫోటోషూట్ పేరుతో చేసిన ఈ అపచారంపై టిటిడి విజిలెన్స్, తిరుమల పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. తిరుమల ఆలయ పవిత్రతను, పుణ్యక్షేత్రం విలువలను కాపాడేలా టిటిడి తిరుమలలో కఠిన నిబంధనలు అమలుచేస్తోంది. ఆలయం ముందు రాజకీయ వ్యాఖ్యలు చేయకుండా కఠినచర్యలు తీసుకుంది. అదేగాక తిరుమలలో గోవింద నామం తప్ప మరెలాంటి పదం వినిపించరాదని ప్రభుత్వం ఆదేశించింది. డ్రోన్‌లు ఎగురవేయడం, ఫోటోషూట్‌లు వంటివి సహజంగా చేసేస్తున్నారు. అలాంటిది గురువారం ఉదయం ఆలయం ముందు కొత్తజంట నుదుటిపై ముద్దులు పెట్టుకుంటూ గొల్లమండపం నుండి అఖిలాండం వరకు ఫోటోషూట్ చేయడం వివాదంగా మారింది. ఈ వీడియోపై నెటిజన్లు, భక్తులు మండిపడుతున్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. తిరుమల ఆద్యాత్మిక ప్రాంతమని, పర్యాటకప్రాంతం కాదని, దేవదేవుని చెంత భక్తితో పవిత్రంగా ఉండాలని భక్తులు చెబుతున్నారు. ఆలయం నిబంధనలకు విరుద్ధంగా సాంప్రదాయాలను ఉల్లంఘించి చేసిన ఈ వికృత చేష్టలపై తిరుమల పోలీసులు సీరియస్ అయ్యారు.

## ఎపి సచివాలయం సిబ్బందిపై ఒడిశా పోలీస్ జులుం

### - రేషన్ కార్డుల సర్వే బృందాన్ని అడ్డుకున్న పోలీసులు



**సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా), జనవరి 29 ప్రభాతవార్త :** వివాదాస్పద కోటియా గ్రూప్ గ్రామమైన గంజాయి భద్ర ఆంధ్ర సచివాలయ సిబ్బందిపై గురువారం ఉదయం ఒడిశా పోలీసులు దౌర్జన్యం చేసిన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే కొటియా గ్రామాల్లో ఒకటైన ఎగువసెంబిలో విధులలో భాగంగా సచివాలయ సిబ్బంది అక్కడ ఉన్న గిరిజనుల రేషన్ కార్డులు సర్వే నిమిత్తం వెళ్లారు. దీంతో ఒడిశా పోలీసులు అక్కడికి చేరుకుని వారిపై దౌర్జన్యానికి తెగబడ్డారు. ఈ మేరకు అక్కడ ఉన్న గిరిజనులు ఒడిశా పోలీసులపై తిరగబడి నిలదీయగా వెనక్కి తగ్గి వెళ్లిపోయారని సమాచారం. అలాగే ఆంధ్ర అధికారులు, ఉద్యోగులుపై ఒడిశా అధికారులు, పోలీసులు చేస్తున్న దౌర్జన్యాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలని ఈ సందర్భంగా అక్కడ గిరిజనులు కోరారు.

## భక్తుల నిరీక్షణ లేకుండా.. మూడోఅన్నప్రసాద భవనం ప్రతిపాదనలు కార్యరూపందాల్చేదెప్పుడో?

### - వెంగమాంబ భవనంలో నిరీక్షణ లేకుండా ప్రత్యామ్నాయం

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** "అన్నం పరబ్రహ్మస్వరూపం"గా భావిస్తూ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం విచ్చేస్తున్న లక్షలాదిమంది భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా,శుచిగా తిరుమల తిరుపతి దేవస్థానంఅన్నప్రసాదాలు అందిస్తోంది. రోజువారీగా 1.60లక్షలమంది నుండి 2లక్షలమందివరకు భక్తులు అన్నప్రసాదాలు స్వీకరిస్తుండటం విశేషం. భక్తుల రద్దీ తో ఇప్పుడు తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనంలోనేగాక పిఎసి 4,5లో అన్నప్రసాదాలు భక్తులకు వడ్డిస్తున్నారు. ఇప్పటికీ వెంగమాంబ భవనంలో మధ్యాహ్నం వేళ భక్తులు నిరీక్షణ సమయం ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా మూడో అన్నప్రసాద భవనం కోసం టిటిడి అధికారులు వెదుకులాట ప్రారంభించారు. ఈ భవనాన్ని భక్తులకు సౌకర్యంగా, రద్దీవుండే ప్రాంతంలో ఏర్పాటుచేయాలని ఆలోచన చేస్తున్నారు. అన్నప్రసాదంలో అదనంగా మసాలవడ అందిస్తుండటం, అన్నప్రసాదాల నాణ్యత వందశాతం మెరుగుపడటంతో ధనవంతులైన భక్తుల నుండి సామాన్యభక్తుల వరకు అన్నప్రసాదాలను దేవుని ప్రసాదంగా భావించి స్వీకరిస్తున్నారు. ఏకధాటిగా ఇటీవల రథసప్తమి పర్వదినాన 9లక్షలమందికి భక్తులుపైగా 14రకాల అన్నప్రసాదాలు స్వీకరించడం రికార్డునమోదైంది. మరీ రోజురోజుకూ రద్దీ పెరుగుతున్న వేళ మరో అన్నప్రసాద భవనం ఏర్పాటుపై భక్తులకు సౌలభ్యంగా ప్రాంతాన్ని ఎంపికచేయాలని టిటిడి అధికారులు ఆలోచన చేస్తున్నారు. తిరుమలలో నిరంతరాయంగా ఉదయం 8.30గంటల నుండి రాత్రి 11గంటల వరకు వెంగమాంబ అన్నప్రసాద భవనంలో నాణ్యమైన అన్నంతోబాటు సాంబారు, రసం, మజ్జిగ, చక్కెరపొంగలి, తాళింపు(కర్రీ)ని, మసాలవడ రుచికరంగా వడ్డిస్తున్న విషయం తెలిసిందే. రోజువారీగా తిరుమలకు లక్షమందివరకు భక్తులు చేరుకుంటున్నా 80వేలమంది భక్తులు దర్శించుకుంటున్నారు.

## వైద్య,ఆరోగ్యశాఖకు ఎన్‌హెచ్‌ఎం ద్వారా రూ.12,843 కోట్ల భారీ నిధులు విడుదల

**విజయవాడ.జనవరి 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వైద్య ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం ) ద్వారా రూ.12,843 కోట్ల భారీ నిధులను రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ విడుదల చేసింది. 2025- 26 ఆర్థిక సంవత్సరానికి గాను చివరి విడత బడ్జెట్ కింద ఈ నిధులను కేటాయించినట్లు అధికారులు వెల్లడించారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ వీరపాండియన్ గురువారం జిల్లా అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విడుదలైన నిధులను నిర్ణీత గడువులోగా అంటే వచ్చే నెల (ఫిబ్రవరి) 20వ తేదీ నాటికి ఖర్చు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఖర్చు చేసిన వివరాలను వెంటనే నివేదికల రూపంలో సమర్పించాలని కోరారు.

ఈ విడత నిధుల్లో కొన్ని జిల్లాలకు ప్రాధాన్యత క్రమంలో భారీగా కేటాయింపులు జరిగాయి. గుంటూరు జిల్లాకు రాష్ట్రంలోనే అత్యధికంగా రూ. 2,061 కోట్లు కేటాయించారు. నెల్లూరు జిల్లాకు రూ.8.60 కోట్లు విడుదలయ్యాయి. కృష్ణా జిల్లాకు రూ. 6.21 కోట్లు కేటాయించారు. మిగిలిన జిల్లాలకు వాటి అవసరాలను బట్టి గరిష్టంగా రూ. 5.20 కోట్ల నుండి కనిష్టంగా రూ. 2 కోట్ల వరకు నిధులను పంపినట్లు కమిషనర్ తెలిపారు. ఈ నిధులను ఎలా ఖర్చు చేయాలనే దానిపై కమిషనర్ వీరపాండియన్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్‌హెచ్‌ఎం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగానే ప్రతి పైసా ఖర్చు చేయాలని సూచించారు. నిధుల వినియోగంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని, పారదర్శకత పాటించాలని హెచ్చరించారు.


ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (శిబీది) బలోపేతం, మందుల కొనుగోలు, కుటుంబ సంక్షేమ పథకాల అమలుకు ఈ నిధులను వినియోగించనున్నారు. ఈ నిధుల విడుదల ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక సదుపాయాలు మెరుగుపడటమే కాకుండా, ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆర్థిక సంవత్సరం ముగింపులో ఉన్నందున, ఈ నిధులను సకాలంలో ఖర్చు చేయడం ద్వారా వచ్చే ఏడాదికి మరిన్ని నిధులు పొందేందుకు అవకాశం ఉంటుంది.

## ఎపిపిఎస్సీ గ్రూప్2 ఎంపిక జాబితా విడుదల - రెండేళ్ల నిరీక్షణకు తెర

### 905 పోస్టుల్లో 891కి అభ్యర్థుల ఎంపిక - హైకోర్టు ఆదేశాలతో 2 పోస్టులు పెండింగ్‌లో - 12 పోస్టులకు రిజర్వేషన్ అభ్యర్థులు నిల్

**విజయవాడ.జనవరి29,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీపీఎస్సీ గ్రూప్2 అభ్యర్థుల రెండేళ్ల నిరీక్షణ ముగిసింది. అర్ధరాత్రి గ్రూప్2 తుది ఎంపిక జాబితాను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల ఆనందానికి అవధుల్లేవు. 2023వ సంవత్సరంలో 905 పోస్టులకు నోటిఫికేషన్ జారీ అయింది. నాటి నుంచి ఎంపిక జాబితా విడుదలకు దాదాపు 25 నెలలకు పైగా సమయం పట్టింది. కోర్టు కేసులతో ఎంపిక ప్రక్రియ సుదీర్ఘంగా సాగింది. రిజర్వేషన్ రోస్టర్‌కు సంబంధించి కొంతకాలం, స్పోర్ట్స్ కోటాపై హైకోర్టులో కేసుల కారణంగా మరికొంత కాలం ఈ నోటిఫికేషన్ లో జాప్యం జరిగింది. క్రీడా కోటా సర్టిఫికెట్ల పరిశీలనకు శాప్ మరింత ఎక్కువ సమయం తీసుకుంది. పరీక్షలు పూర్తయినప్పటి నుంచి ఫలితాల కోసం అభ్యర్థులు ఏపీపీఎస్సీ కార్యాలయం చుట్టూ ఎంతగానో తిరగాల్సి వచ్చింది. 905 ఉద్యోగాలకు నోటిఫికేషన్ రాగా, దానిలో 891 పోస్టులకు మాత్రమే అభ్యర్థుల జాబితాను ఏపీపీఎస్సీ ప్రకటించింది. గతంలో క్రీడా కోటాకు రెండు పోస్టులను రిజర్వు చేయాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినందున ఎక్సైజ్ ఎస్సై, లా ఏఎస్ఓ పోస్టులను ఏపీపీఎస్సీ పక్కన పెట్టింది. హైకోర్టు తీర్పును అనుసరించి ఏపీపీఎస్సీ ప్రకటించిన 891 పోస్టుల్లో హారిజంటల్ రిజర్వేషన్ కారణంగా 25 పోస్టుల్లో మార్పులు జరిగే అవకాశం ఉంది. మిగతా 866 పోస్టుల్లో మాత్రం ఎలాంటి మార్పు ఉండదు. ఏడు దివ్యాంగ, మరో 5 ఇతర రిజర్వేషన్లకు అభ్యర్థులు లేనందున 12 పోస్టులకు ఏపీపీఎస్సీ ఎంపిక జాబితాను ప్రకటించలేదు. 2023వ సంవత్సరం డిసెంబరు 7న నోటిఫికేషన్ వెలువడగా, 2024వ సంవత్సరం ఫిబ్రవరి 25న ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించారు. 2025 ఫిబ్రవరి 23న మెయిన్స్ పరీక్షలు జరిగాయి. 2025వ సంవత్సరం ఏప్రిల్ 4న దీని ఫలితాలు వెల్లడించారు. ఇప్పుడు తుది ఎంపిక జాబితా విడులైంది. ఏపీపీఎస్సీ గ్రూపు 2 ఎంపిక జాబితాను అర్ధరాత్రి విడుదల చేసింది.

## నిజంగా ర్యాషేనా?



ఈ కాలంలో పొడిబారే చర్మంతో దురద, దద్దుర్లు వంటివీ సహజంగానే కనిపిస్తుంటాయి. ఆ ఎర్రబడటం, పొట్టులా రాలడం... నిజంగా ర్యాషేనా? చల్లని వాతావరణంలోకి వెళ్లినప్పుడు చర్మం బిగుతుగా, తాజాగా తోయడం మనకు పరిచయమే. వాతావరణంలో తేమ తగ్గడం వల్ల చర్మం పొడిబారి అలా అనిపిస్తుంది. ఫలితమే ఎర్రబడటం, పొలుసుల్ల రాలడం, ఇలా బిగుతుగా తోయడం వగైరా. అయితే ఇవి తాత్కాలికమే. తగిన తేమను అందించినా, వాతావరణంలో మార్పు మొదలైనా అన్నీ తగ్గుతాయి. కానీ జెంటిల్ ఫేస్‌వాష్, మాయిశ్చరైజర్లు తరచూ వాడటం స్థిరంగా చేస్తుండాలి. ఇంత చేసినా తగ్గకపోతే? ఎగ్జిమా అయ్యుండొచ్చు. స్కిన్ బారియర్ సరిగా పనిచేయకపోతే ఇది వస్తుంది. దీనిలోనూ దురద, ఇన్ఫ్లమేషన్ ఉంటాయి. మిగిలిన కాలాలతో తాజా చలికాలం ఎక్కువగా కనిపిస్తుంది. దీనిలోనూ చర్మం ఎర్రబడటం, దురద, పొలుసుల్లా కావడం కనిపిస్తుంది. వాటిని గీకితే మందమైన ప్యాచ్లనూ మారతాయి. ముఖ్యంగా అలర్జీలు, ఆస్తమా వచ్చేవారిలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. కాబట్టి, దద్దుర్లు, ఎరుపుదనం వంటి వాటిని తేలిగ్గా తీసుకోవద్దు.. మొదట..ఎక్కువ వేడినీటితో స్నానం చేయకపోవడం, త్వరగా ముగించడం, మాయిశ్చరైజర్ రాయడం, హ్యూమిడిపయర్లు వాడటం... వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. వారం, రెండు వారాల్లో పరిస్థితి అదుపులోకి వస్తుంది. అయినా రాకపోతే ఎగ్జిమా అయ్యుండొచ్చు. అప్పుడు దీనికి తగిన చికిత్స తీసుకోవడం తప్పనిసరి.

## అనుబంధాన్ని దృఢంచేసే 'ధ్యానం'



వ్యాయామాలు మన శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి.. భావోద్వేగాలను అదుపులో ఉంచుతాయి ఉంచుతాయి. అయితే ఇవే వ్యాయామాలు అనుబంధాలను దృఢం చేస్తాయంటున్నారు రిలేషన్షిప్ నిపుణులు. ✦ ధ్యానం వల్ల ఒత్తిడి, ఆందోళనలు తగ్గుతాయి. ఫలితంగా కోపాన్ని అదుపులో ఉంచుకొని ఏ విషయం గురించైనా ప్రశాంతంగా ఆలోచించగలుగు తాం. ఈ ప్రశాంతతే ఇద్దరి మధ్య ఎలాంటి గొడవలు రాకుండా.. ఒకవేళ వచ్చినా.. వాటికి తగిన పరిష్కార మార్గాలు వెతుక్కునే నేర్పును అందిస్తుందని నిపుణులు. ✦. మనసు లోని ప్రతి కూల ఆలోచనల్ని దూరం చేయడంలో ధ్యానం కీలక పాత్ర పోషి స్తుంది. నుండి పాజిటివిటీని అలవర్చు కోగలుగుతాం. ఇలా ప్రతి ఒక్కటి సానుకూల దృక్పథంతో చూస్తే మనం.. ఎదుటి వ్యక్తిలోనూ అలాంటి లక్షణాలనే చూడగలుగుతాం. వారి మాటలు, బావాల్నీ అర్థం చేసుకోగలుగుతాం. భార్యాభర్తల మధ్య పెరిగిన దూరాన్ని దగ్గర చేసుకోవాలంటే ఇదీ ముఖ్యమే అంటున్నారు నిపుణులు. ✦ .మనసు ప్రశాంతంగా ఉన్నప్పుడు అవతలి వారితోనూ సులభంగా కలిసిపోగలుగుతాం.. ఇటు మన మనసులో ఉన్న సమస్యలు, బాధల్ని వారితో పంచుకోవడంతో పాటు... వారు చెప్పే సమస్యలు విషయాల్నీ శ్రద్ధగా వినగలుగుతాం. ఇలా ఇద్దరి మధ్య ఎలాంటి దాపరికాల్లేనప్పుడు అను బందంలోనూ ఎలాంటి కలతలు రావంటున్నారు నిపుణులు. ✦. కొన్నిసార్లు భార్యాభర్తలిద్దరిలో ఎవరికి కోపం వచ్చినా.. అవతలి వారు మాట పడరు. దీనివల్ల గొడవ పెద్దదవడం తప్ప మరే ప్రయోజనం ఉండదు. ఇలాంటప్పుడు ఓపికతో వ్యవహరించాలన్నా, భరించే శక్తిని పెంచుకోవాలన్నా ధ్యానం తప్పనిసరి అంటున్నారు నిపుణులు. □

## తొలి భారతీయ రాయల్ ఐసింగ్ ఆర్టిస్ట్..



చాలామందికి కేక్ చేయడమెలాగో తెలిసే ఉంటుంది. కానీ దాన్ని సృజనాత్మకంగా అలంకరించడంలోనే సిసలైన ప్రత్యేకత దాగుంటుంది. ఇలాంటి అరుదైన కేక్ బేకింగ్ నైపుణ్యాలతో ప్రపంచ గుర్తింపు సంపాదించుకున్నారు ప్రాచీ ధవళ్ దేవ్. రాయల్ ఐసింగ్ ఆర్ట్‌లో ప్రావీణ్యం పొందిన ఆమె.. విశ్వవ్యాప్తంగా ఉన్న ఎలాంటి రాజప్రాసాదాలు, కట్టడాలనైనా రుచికరమైన కేక్ల రూపంలో తీర్చిదిద్దడంలో దిట్ట. అనితర సాధ్యమైన తన నైపుణ్యాలతో భారత్‌లోనే అత్యుత్తమ రాయల్ ఐసింగ్ కేక్ ఆర్టిస్ట్‌గా ఖ్యాతి గాంచిన ప్రాచీ.. ఇప్పటికే పలు ప్రపంచ రికార్డుల్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఇక ఇటీవలే మరో అరుదైన ఘనత సాధించారామె. ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన 'ఆక్స్‌ఫర్డ్ సెంటర్ ఫర్ హిందూ స్టడీస్'లో అసోసియేట్ ఆర్టిస్ట్‌గా నియమితు లయ్యారు. ఈ ఘనత సాధించిన తొలి భారతీయుడు ఐసింగ్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందారు. కేక్ తయారీలో తాను పొందే సంతోషం, సంతృప్తి మరెందులోనూ దొరకదంటున్న ఈ రాయల్ ఐసింగ్ క్వీన్ సక్సెస్ స్టోరీ తెలుసుకుందాం.. ప్రాచీ తల్లి దండ్రులు డెహ్రాడూన్కు చెందిన వారు. పుణేకు చెందిన ఓ ఐటీ ఉద్యోగిని పెళ్లాడిన ఆమె.. ఆ తర్వాత అక్కడే స్థిరపడ్డారు. చిన్న తనం నుంచీ అటు చదువులో రాణి స్తూనే.. ఇటు కేక్ బేకింగ్ పైనా ఆసక్తి చూపే వారు ప్రాచీ. ఈ విధంగానే అందరిలా కాకుండా తనకంటూ ప్రత్యేకంగా, కొత్తగా కేక్‌లు తయారుచేయాలని ఆరాటపడేవారు. ఈ తపనే తనను రాయల్ ఐసింగ్ వంటి క్లిష్టమైన కేక్ కళ నేర్చుకునేలా ప్రేరేపించిందంటూ ఓ సందర్భంలో చెప్పుకొచ్చారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన, కేక్ ఐకాన్‌గా పేరుగాంచిన 'సర్ ఎడ్డీ స్పెన్స్ ఎంబిఈ' ఆధ్వర్యంలో యుకెలో ఈ ఐసింగ్ నైపుణ్యాలు ఒంటబట్టించుకున్నారీ కేక్ లవర్.

**కష్టమైన ఇష్టంగా..** నిజానికి మనం ఒక పనిని ఇష్టపడితే.. అది ఎంత కష్టమైనా సరే.. దాన్ని ఆస్వాదిస్తూ మరీ. పూర్తి చేస్తాం. రాయల్ ఐసింగ్‌పై తనకున్న ఈ మక్కువే ఇంతటి క్లిష్టమైన కళనూ సులువుగా నేర్చుకునేలా, తనకు ప్రత్యేక గుర్తింపు దక్కేలా చేసిందన ప్రాచీ. నాకు చిన్నతనం నుంచీ అద్భుతమైన కళాఖండాల అందాలను ఆస్వాదించడమంటే మక్కువ. ముఖ్యంగా విక్టోరియా, యూరోపియన్ కట్టడాల నిర్మాణ శైలి, సొగసును వర్ణించడం మాటలతో సాధ్యమయ్యే పని కాదు. అందుకే వాటిని అంతే అందంగా, అద్భుతంగా నా ఐసింగ్ నైపుణ్యాలతో తీర్చిదిద్దుతున్నా. శిలలపై శిల్పాలు చెక్కినట్లు.. ఆ హంగుల్ని కేక్ తీర్చిదిద్దమంటే మాటలు కాదు.. అందుకు ఎంతో ఓపిక కావాలి. అయితే ఇష్టమైన పనిలో కష్టం తెలియదన్నట్లు ఈ కళను మనసారా ఆస్వాదిస్తున్నా.. అంటోన్న ఈ ఐసింగ్ క్వీన్... రాయల్ ఐసింగ్‌తో ఎంబ్రాయిడరీ చేస్తూ, లేస్ తరహాలో హంగు లద్దుతూ, బంగారు వర్ణపు మెరుపును తీసుకొస్తూ ప్రత్యేకంగా నిలుస్తు న్నారు. వర్ణించడానికి మాటలు కూడా సరిపోని ఈ కేక్ కళాకృతులు చూడగానే ఆకట్టుకోవడమే కాదు.. నోరూరిస్తాయి కూడా!

**'వీగన్'.. నా ప్రత్యేకత ...** కేక్స్ తయారీలో చాలావరకు కోడిగుడ్లు ఉపయోగించడం మనకు తెలిసిందే! అప్పుడే వాటి రుచి, మృదుత్వం ఇనుమడిస్తాయి. అయితే తాను తయారుచేసే ఏ కేక్ లోనూ, రాయల్ ఐసింగ్‌తో తయారు చేసే కళాఖండాల్లోనూ గుడ్లు అస్సలు ఉపయోగించనంటు న్నారు ప్రాచీ ఈ క్రమంలో ఎక్కువ భాగం వీగన్ కేక్స్ రూపొందించడానికే మొగ్గు చూపుతానంటున్నారు.


**మూడు ప్రపంచ రికార్డులు!** కేక్ బేకింగ్, రాయల్ ఐసింగ్ నైపుణ్యాలతో ఖిది క్వీన్ ఆఫ్ రాయల్ ఐసింగ్ పేరుగాంచిన ప్రాచీ తయారు చేసే కేక్ లకు విశ్వవ్యాప్తంగా అభిమానులు న్నారు. జాతీయంగా, అంతర్జాతీయంగా పలు కేక్ తయారీ పోటీల్లో జడ్జిగానూ వ్యవహరించారామె. అంతేకాదు.. ఫోర్బ్స్ ఇండియా.. వంటి పత్రికలు విడుదల చేసిన స్ఫూర్తి దాయక, ప్రభావశీల మహిళల జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఆక్స్‌ఫర్డ్‌లో పాఠాలు ! తన రాయల్ ఐసింగ్ నైపుణ్యాలతో ప్రపంచం దృష్టిని తనవైపు తిప్పుకొన్న ప్రాచీ.. ఇటీవలే మరో ఘనత సాధించారు. ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన 'ఆక్స్‌ఫర్డ్ సెంటర్ ఫర్ హిందూ స్టడీస్'లో అసోసియేట్ ఆర్టిస్ట్‌గా నియమితులయ్యారామె..తద్వారా ఈ ఘనత సాధించిన తొలి భారతీయ రాయల్ ఐసింగ్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందారు. □

## మనసు మలినమైతే..

ఒక రైతు రోజంతా ఎంతో కష్టపడి తన చెరకు తోట నీరు కోసం తోడాడు. తీరా సాయంత్రం చూస్తే పొలం కొద్దిగానే తడిచింది. ఆ నేలలో ఎక్కడ చూసినా ఎలుకల కలుగులు. రైతు తోడిన నీరంతా వాటి ద్వారా భూమి లోకి ఇంకిపోయింది. ముక్తిని కోరుకుంటూ నిర్మలమైన మనసుతో భగవంతుడిని ఆరాధించాలె తప్ప.. లోలోపల కీర్తి కోసం, సుఖాలు, సౌకర్యాలు, సంపదలు, పదవుల కోసం పూజించ కూడదు. అలా చేస్తే ఆ వ్యక్తి పైన చెప్పిన రైతులాగే తయారవుతుందని రామకృష్ణ పరమహంస హెచ్చరిక. అలాంటి వ్యక్తి నిత్యం దేవుణ్ణి ప్రార్థిస్తున్నా జీవితంలో నిజమైన అభివృద్ధి ఆనందం ఉండవని, అతడి భక్తి మొత్తం.. కోరికలనే ఎలుక కలుగుతోందని. జిడ్డుగా ఉన్న అద్దంలో ముఖం సరిగ్గా కనిపించదు. అలాగే కోరికలు అనే మలినాలతో నిండిన హృదయంలో భగవంతుడి స్వరూపం ప్రకాశించదు. జిడ్డును తుడిచేస్తే స్పష్టత వచ్చి నట్లు, నిర్మలంగా ఉన్న మదిలోనే దేవుడి రూపు దర్శనమిస్తుందని పరమహంస ప్రబోధించారు. □



## కురులకేం కావాలి?



జుట్టు గడ్డిలా మారినా, ఊడు తోందన్నా... బోలెడు సలహాలు వచ్చేస్తాయి కదూ! ఒకరు ప్రొటీన్ అందట్లేదు అంటారు. మరొకరు లేదు తేమ సరిపోవట్లేదు అందుకే ఇలా అని చెబుతారు. ఇంతకీ కురులకేం కావాలి?

✦ మన వెంట్రుకలు కెరటిన్ అనే ప్రొటీన్తో నే తయారవు తాయి. కాలుష్యం, వేసే రంగులు, స్టైలింగ్ అంటే, మనం దాన్ని గట్టిగా లాగడం ఏం చేసినా ప్రభావం పడుతోంది ఆ ప్రొటీన్ మీదే కురులు ఊరికే తెగిపోతున్నా, మందం తగ్గినా ప్రొటీన్ తగ్గిందనే అర్థం.

✦.కురులు మృదువుగా, మెత్తగా ఆరోగ్యంగా కనిపించాలంటే వాటికి తేమ తప్పనిసరి. పొడి జ వాతావరణం, తరచూ తలంటడం, రసాయనాలున్న షాంపూలు వాడటం... సహజ నూనెలను తొలగించి జుట్టుని గడ్డిలా బరకగా మారుస్తాయి. అప్పుడు వాటి నిర్వహణ కష్టమే. మృదువుగా ఉంటే చిక్కులుండవు. దాంతో కుదుళ్లపై దుష్ప్రభావాలు ఉండవు. కొద్దిగా లాగినా ఊడి వస్తోంటే తేమ తగ్గిందనే!

✦ ఆరోగ్యకరమైన జుట్టుకు ప్రొటీన్, తేమ అవసరం. కాబట్టి, రెండు దొరికేలా చూసుకోవాలి. అలాగే, పై పూతలకే పరిమితం కావొద్దు. కురుల నిర్వహణ దీర్ఘకాలం సాగే ప్రక్రియ. కాబట్టి, జాగ్రత్తగా కొనసాగించాలి. ఆహారం ద్వారా తగినంత ప్రొటీన్ అందేలా చూసుకోండి. మీ కురుల తీరుకు తగ్గ షాంపూ, కండిషనర్లు వాడండి. □

## మెక్సికన్ పరోటా రోల్స్



**కావలసినవి:** బ్రకోలీ ముక్కలు: ఒక కప్పు, సన్నగా తరిగిన ఉల్లిగడ్డ, క్యాప్సికం, టమాట ముక్కలు: పావు కప్పు చొప్పున, చీజ్ తురుము: ఒక కప్పు, ఉడికించిన స్వీట్‌కార్న్: రెండు టేబుల్ స్పూన్లు, మిరియాలపొడి: అర టీస్పూన్, కారం: ఒక టీస్పూన్, ఉప్పు: తగినంత, నిమ్మరసం: ఒక టేబుల్ స్పూన్, గోధుమపిండి, మైదాపిండి: ఒక కప్పు చొప్పున, నూనె: అర కప్పు.

**తయారీ విధానం:** ఒక గిన్నెలో మైదాపిండి, గోధుమపిండి, ఒక టేబుల్ స్పూన్ నూనె, కొద్దిగా ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంలో తగినన్ని నీళ్లు పోసి ముద్దలా కలిపి పావుగంట మూతపెట్టి పక్కనపెట్టాలి. బ్రకోలీ ముక్కల్ని పది నిమిషాల పాటు ఉప్పునీళ్లలో ఉడికించి చిన్నగా తరగాలి. ఒక గిన్నెలో బ్రకోలీ, టమాట, క్యాప్సికం, ఉల్లిగడ్డ ముక్కలు, చీజ్ తురుము, స్వీట్ కార్న్, కారం, మిరియాల పొడి, ఉప్పు, నిమ్మరసం వేసి బాగా కలపాలి. స్టవ్ మీద పెనం పెట్టి వేడి చెయ్యాలి. పిండి మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకుని చపాతీలా ఒత్తి పెనంపై వేసి ఒక నిమిషంపాటు రెండు వైపులా తిప్పుతూ కాల్చుకోవాలి. కాలిన చపాతీ మధ్యలో బ్రకోలీ మిశ్రమం పెట్టి గుండ్రంగా చుట్టి ఒక నిమిషంపాటు మూతపెడితే వేడివేడి మెక్సికన్ పరోటా రోల్స్ రెడీ. □

## 'ఆకాశంలో ఒక తార' శృతి హాసన్ ఫస్ట్ లుక్



స్వప్న సినిమా ప్రజెంట్స్ దుల్కర్ సల్మాన్ 'ఆకాశంలో ఒక తార' నుంచి శృతి హాసన్ ఫస్ట్ లుక్ రిలీజ్ 2026 సమ్మర్ లో పాన్‌ఇండియా థియేట్రికల్ రిలీజ్‌వరుస బ్లాక్‌బస్టర్‌లు, పాన్ ఇండియా స్టార్‌డమ్‌తో దూసుకుపోతున్న వెర్సటైల్ హీరో దుల్కర్ సల్మాన్, ఇప్పుడు మరో ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్ ఖిఆకాశంలో ఒక తారఖితో అలరించబోతున్నారు. విలక్షణ కథలతో ఆకట్టుకునే పవన్ సాదినేని ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా సమర్పణలో, ఈ చిత్రాన్ని సందీప్ గున్నం, రమ్య గున్నం నిర్మిస్తున్నారు. దుల్కర్ సరసన కొత్త హీరోయిన్ సాత్విక వీరవల్లి కథానాయికగా నటిస్తోంది. ఇంతకు ముందు విడుదలైన ప్రోమోలు సినిమాపై అంచనాలను పెంచాయి.తాజాగా చిత్ర బృందం ఒక సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఈ మధ్య కాలంలో చాలా సెలక్టివ్ గా సినిమాలు చేస్తున్న శృతి హాసన్, ఈ చిత్రంలో ఒక కీలక పాత్ర చేస్తున్నారు. ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, టీం ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఆమె కళ్ళకు అద్దాలు పెట్టుకుని ఇంటెన్స్ లుక్ లో కనిపించడం ఆకట్టుకుంది. ఈ సినిమా సాంకేతికంగా ఉన్నత ప్రమాణాలతో ఉండబోతుంది.

## 'హార్ట్ బీట్ ఆఫ్ శబార' ఈవెంట్



దీక్షిత్ శెట్టి, క్రితికా సింగ్ ప్రధాన పాత్రల్లో ప్రేమ్ చంద్ కిలారు తెరకెక్కించిన చిత్రం 'శబార'. విక్రమ్ ఫిల్మ్ ఫ్రాటర్నిటీ బ్యానర్ మీద హర్షిత చదలవాడ, దుర్గా చుంచు, రమాదేవి కిలారు నిర్మించిన ఈ మూవీకి సంబంధించిన ప్రపంచాన్ని 'హార్ట్' బీట్ ఆఫ్ శబార్థ ద్వారా పరిచయం చేశారు. మిథున్ ముకుందన్ ఈ మూవీకి సంగీతాన్ని అందించారు. అజయ్ అబ్రహం జార్జ్ ఈ సినిమాకి కెమెరామెన్‌గా పని చేశారు. హార్ట్ బీట్ ఆఫ్ శబార అంటూ నిర్వహించిన కార్యక్రమంలో....దీక్షిత్ శెట్టి మాట్లాడుతూ.. .. శబార కోసం వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. నా గర్ల్ ఫ్రెండ్థ సినిమాకి మీడియా మంచి సపోర్ట్ ఇచ్చింది. ఇక ఇప్పుడు శబార్థకి కూడా అలానే సపోర్ట్ చేస్తారని ఆశిస్తు న్నాను. అందరికీ హార్ట్ బీట్ ఆఫ్ శబార్థ నచ్చి ఉంటుందని అనుకుంటున్నాను. అన్నారు... దర్శకుడు ప్రేమ్ చంద్ కిలారు మాట్లాడుతూ.. .. హార్ట్ బీట్ ఆఫ్ శబారకి మంచి రెస్పాన్స్‌ను ఇచ్చారు. చిత్రీకరణ ఇంకా పూర్తి కాలేదు. త్వరలోనే ఆడియెన్స్ ముందుకు వస్తాం. మా నాన్న నాకు దేవుడి కంటే ఎక్కువ. ఆ నాన్ననే ఎదురించి సినిమాను తీస్తున్నానంటే.. ఎలాంటి సినిమాని తీస్తుంటానో అర్థం చేసుకోండి. క్రితిక సింగ్ మాట్లాడుతూ.. .. 'ప్రేమ్ చంద్ గారు లేకపోతే' శబార్థ ఇంత గొప్పగా వచ్చేది కాదు. నన్ను నమ్మి ఇంత మంచి పాత్రను ఇచ్చిన ఆయనకు థాంక్స్. .మీషా నారంగ్ మాట్లాడుతూ.. .. 'శబార' కన్నుల పండుగగా ఉంటుంది. ఎన్నో అద్భుతమైన లొకేషన్లలో సినిమాని షూట్ చేశాం. ఎంతో కష్టపడిమూవీని తీశాం.

## తెర

## ఎన్‌టీఆర్ వ్యక్తిత్వ, ప్రచార హక్కులకు రక్షణ కల్పించిన ఢిల్లీ హైకోర్టు



నటుడు నందమూరి తారక రామారావు (ఎన్.టి.ఆర్) వ్యక్తిత్వ మరియు ప్రచార హక్కులను రక్షణ కల్పించేలా గౌరవనీయ ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.వివిధ మాధ్యమాల్లో తన పేరు, ఫోటోలు, గుర్తింపును అనుమతి లేకుండా వాణిజ్య పరమైన ప్రయోజనాల కోసం వాడుతున్నారని ఎన్టీఆర్ కోర్టును ఆశ్రయిస్తూ పిటిషన్ వేశారు. ఈ విషయాన్ని పరిశీలించిన ఢిల్లీ హైకోర్టు ఆయన వ్యక్తిత్వ హక్కులకు రక్షణ కల్పిస్తూ ఆదేశాలను జారీ చేసింది.ఆదేశాల మేరకు ఎన్టీఆర్ గారి పేరు గానీ, 'ఎన్టీఆర్', 'జూనియర్ ఎన్టీఆర్', 'తారక్"= లాంటి పేర్లు గానీ, 'యంగ్ టైగర్', 'మ్యాన్ ఆఫ్ మాసెస్' వంటి పేర్లు గానీ, అలాగే ఆయన ఫోటోలు, ఇమేజ్‌ను అనుమతి లేకుండా వాణిజ్య పరంగా వాడితే చట్ట విరుద్ధమని కోర్టు పేర్కొంది. ఎక్కడైనా ఇలా అనధికారంగా వాడినట్టు తెలిస్తే.. చట్టం ప్రకారం వెంటనే తీసేయాలని ఆదేశాలను కోర్టు జారీ చేసింది. ఒక వ్యక్తి పేరు, ఇమేజ్ వంటి ప్రముఖ వ్యక్తిత్వ హక్కులనేవి జీవించే హక్కు, స్వేచ్ఛ తోనే కలిసి ఉంటాయని చెప్పిన ఢిల్లీ హైకోర్టు. ఇవి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, 21 కింద రక్షణ పొందుతాయని, అలాగే కాపీరైట్ చట్టం 1957, ట్రేడ్‌మార్క్ చట్టం 1999 ద్వారా కూడా అమలు చేయవచ్చని స్పష్టం చేసింది. అదేవిధంగా ఇంటర్మీడియరీ ప్లాట్‌ఫామ్స్‌లో భాగమైన ఫేస్‌బుక్, యూట్యూబ్ లాంటి వాటిని కూడా కోర్టు ఆదేశించింది. ఈ పిటిషన్‌ను 2021 ఐటీ రూల్స్ (ఇంటర్మీడియరీ గైడ్ లైన్స్ అండ్ డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) కింద అధికారిక ఫిర్యాదుగా పరిగణించి, చట్టపరంగా కేటాయించిన సమయాల్లో దొరికిన హక్కుల ఉల్లంఘన లింక్‌లను తీసేయాలని కోర్టు తెలియజేసిందికోర్టు మరో ఆదేశాన్ని కూడా ఇచ్చింది.. దాని ప్రకారం ఎవరో గుర్తించని వ్యక్తులు, ఆన్‌లైన్ ట్రోల్స్ చేసేవాళ్ళ, ఎవరికీ తెలియకుండా తప్పులు చేసేవాళ్లు ఎవరైనా ఎన్టీఆర్ గారి పేరు, ఫోటో, ఇమేజ్, గుర్తింపును వాణిజ్య ప్రయోజనాల కోసం వాడకూడదని, మెర్చండైజ్, డిజిటల్ కంటెంట్, మోర్ఫ్ చేసిన ఫోటోలు, AI కంటెంట్ లేదా ఏదైనా టెక్నాలజీ ద్వారా ఉపయోగించకూడదని ఆదేశించింది.

## కాలం మారింది సినిమా 53 సంవత్సరాలు పూర్తి

తారాగణం శోభన్ బాబు మరియు శారద ముఖ్యపాత్రలతో నిర్మించిన చిత్రానికి దర్శకులు కె విశ్వనాథ్ మరియు నిర్మాత వాసిరాజు ప్రకాశం. అల్లు రామలింగయ్య ఇందులో ఓ మంచి పాత్ర చేశాడు. ఆరోజుల్లో కుల మతాల మధ్య ఉన్న జరుగుతున్న గొడవలు నేపథ్యంలో ఓ మంచి మార్పుతో నిర్మించిన చిత్రం ఇది. మంచి సందేశాత్మక చిత్రం. ఈ చిత్రానికి మంచి అవార్డులు సాధించిన విషయం తెలిసిందే. దర్శకులు ప్రజల్లో మంచి చైతన్య కలిగే విధంగా చిత్రాన్ని నిర్మించటం మంచి శుభసూచకం. చిత్రం అవార్డులు సాధించాటమే కాకుండా ప్రజల్లో మంచి అభినందనలు పొందినది. ఈ చిత్రం నటుడు శోభన్ బాబుకు మంచి పేరుతో పాటు అవార్డు రావడం గొప్ప విషయం.



## 'ఫౌజీ' దసరాకి గ్రాండ్‌గా రిలీజ్



రెబెల్ స్టార్ ప్రభాస్, క్రియేటివ్ ఫిల్మ్ మేకర్ హను రాఘవపూడి దర్శకత్వంలో చేస్తున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ ఖిఫౌజీఖి. సక్సెస్ ఫుల్ పాన్‌ఇండియా బ్యానర్ మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో టి సిరీస్ గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్ సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలై ఫస్ట్ లుక్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది.దసరా పండుగ సందర్భంగా 'ఫౌజీ' గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.షూటింగ్ పూర్తయ్యే వరకు ఎలాంటి విరామం లేకుండా కంటిన్యూ షెడ్యూల్ కొనసాగనుంది. ఈ సినిమా అత్యంత గ్రాండ్‌గా రూపుదిద్దుకుంటోంది.'ఫౌజీ' విజువల్ వండర్‌గా ఉండబోతోంది. ఎమోషన్, గ్రాండ్యూర్‌కి పేరుపొందిన దర్శకుడు హను రాఘవపూడి, ప్రభాస్‌ని ఇంతకు ముందు ఎప్పుడూ చూడని పవర్ ఫుల్ అవతార్‌లో చూపించబోతున్నారు.ప్రభాస్ సరసన హీరోయిన్‌గా ఇమాన్వీ నటిస్తోంది. అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద, భాను చందర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ఈ చిత్రాన్ని నవీన్ ఎర్నేని, వై.రవి శంకర్ లు మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ పై వరల్డ్ క్లాస్ ప్రొడక్షన్ వాల్యూస్‌తో నిర్మిస్తున్నారు.ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీమ్ పనిచేస్తోంది.

## ఫిబ్రవరి 6న ప్రపంచవ్యాప్తంగా 'శ్రీ చిదంబరం గారు' విడుదల



శ్రీమతి. చింతా వరలక్ష్మీ సమర్పణలో శ్రీ చక్రాస్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ మీద చింతా వినీష రెడ్డి, చింతా గోపాల కృష్ణా రెడ్డి నిర్మాతలుగా చింతా రాజశేఖర్ రెడ్డి సహ నిర్మాతగా వినయ్ రత్నం తెరకెక్కించిన చిత్రం శ్రీ చిదంబరం'. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట జంటగా నటించిన ఈ చిత్రం నుంచి ఇటీవల టీజర్‌ను విడుదల చేశారు. టీజర్‌కు వచ్చిన అనూహ్య స్పందన గురించి తెలిసిందే. కాగా ఈ చిత్రంలో ప్రముఖ సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి గారు ఆలపించిన 'వెళ్లేదారిలో' అనే ఓ పాట బ్యూటిఫుల్ పాటను ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రం ట్రైలర్‌ను ప్రముఖ దర్శకుడు, ప్రస్తుతం మెగా పవర్‌స్టార్‌తో పెద్ది అనే పాన్ ఇండియా చిత్రాన్ని డెరెక్ట్ చేస్తున్న బచ్చిబాబు సానా విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన చిత్రయూనిట్‌కు శుభాకాంక్షలు అందజేశారు. ఫిబ్రవరి 6న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. . నిర్మాత మాట్లాడుతూ అంతా కొత్తవాళ్లతో తీసిన బ్యూటిఫుల్ సినిమా ఇది. చాలా మెచ్యూర్డ్ అండ్ ఇన్స్పిరేషన్ స్టోరీతో రాబోతున్న సినిమా ఇది. నేటి సమాజానికి ఎంతో అవసరమైన కథ ఇది. చాలా మంది యువత చిన్న చిన్న ప్రాబ్లమ్స్‌కే సూసైడ్ వరకు వెళ్లిపోతున్నారు. అలాంటి వారందరికి ఎంతో ఇన్స్పయిర్ అయ్యే కథ ఇది. మీలో లోపం మీకు బలం అవ్వాలి అనే చెప్పే కథ ఇది. తప్పకుండా ఈ సినిమా అందర్ని అలరిస్తుందనే నమ్మకం ఉంది అన్నారు.

### మహిళల జాతీయ కబడ్డీలో

# తెలంగాణ, హర్యానా విజయం

### ఆంధ్రా, బీహార్, గోవా ఓటమి



**న్యూఢిల్లీ:** 72వ మహిళల సీనియర్ జాతీయ కబడ్డీ ఛాంపియన్‌షిప్-2026లో ఇండియన్ రైల్వేస్, తెలంగాణ, రాజస్థాన్, గుజరాత్ విజయంతో ప్రత్యేకంగా నిలవగా, ఆంధ్ర, బీహార్, హర్యానా జట్లు ఓటమిపాలయ్యాయి. బాలయోగి స్టేడియంలో గురువారం జరిగిన పోటీల్లో ఇండియన్ రైల్వేస్ రెండు పెద్ద విజయాలతో పూల్ ఎ పై ఆధిపత్యం చెలాయించింది. రాజస్థాన్, తెలంగాణ పూల్ సి లో ఆకట్టుకోగా, గుజరాత్ ఒడిశాను ఓడించి కఠినమైన మ్యాచ్‌లో విజయం సాధించింది. రైల్వేస్ పూల్ ఎ లో ఆధిక్యంలో ఉంది. తొలుత జమ్మూ కాశ్మీర్‌ను 88-12 తేడాతో ఓడించి, ఆ తర్వాత ఢిల్లీపై 54-21 తేడాతో విజయం సాధించిన రైల్వేస్ జట్టు గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది. పూల్ బిలో ఉత్తరప్రదేశ్ మిశ్రమ ఫలితాలను సాధించింది. తొలుత అస్సాంను 37-27తో ఓడించి, ఆ తర్వాత షెడ్యూల్‌లో హిమాచల్ ప్రదేశ్ చేతిలో 34-21తో ఓడిపోయింది. దీంతో ఈ విభాగం సమతుల్యంగా ఉండి, ఈ దశలో పాల్గొన్న మూడు జట్లకు అర్హత అవకాశాలు ఉన్నాయి. అలాగే పూల్ సి లో తెలంగాణ పుదుచ్చేరిని 50-16తో ఓడించి బలంగా ప్రారంభించింది. రాజస్థాన్ అదే ప్రత్యర్థులపై మరింత ముందుకు వెళ్లి 76-12 విజయాన్ని నమోదు చేసింది. పూల్ డి లో గోవా జార్ఖండ్‌పై 74-20 స్కోరుతో విజయం సాధించినప్పటికీ గోవా ఆ ఫామ్‌ను తదుపరి మ్యాచ్‌లో కొనసాగించలేకపోయింది. హర్యానా అదే గ్రూప్‌లో గోవాపై 52-26 తేడాతో విజయం సాధించి ర్యాంకింగ్స్‌లో తన స్థానాన్ని పెంచుకుంది. పూల్ ఇ లో విదర్భపై 57-20 మహారాష్ట్ర, పూల్ ఎఫ్ లో పంజాబ్ బీహార్‌పై 39-31 గెలుపొందాయి. గుజరాత్ పూల్ జి లో ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో ఒడిశాను 29-26తో ఓడించింది. ఇక పూల్ హెచ్‌లో మధ్యప్రదేశ్ ఆంధ్రప్రదేశ్‌పై 48-23తో విజయం సాధించింది.

### ప్రపంచ స్నూకర్‌లో..

# సత్తా చాటిన ఇష్ప్రీత్



**న్యూఢిల్లీ:** ప్రపంచ స్నూకర్ టూర్ ఈవెంట్ అయిన జర్మన్ మాస్టర్స్‌లో భారతదేశానికి చెందిన ఇష్ప్రీత్ చద్దా తన సత్తా చాటాడు. తనకన్నా ఉన్నత ర్యాంక్ పొందిన ఆటగాళ్లపై అతడు అద్భుత విజయాలు నమోదు చేశాడు. గురువారం జరిగిన ఈ టోర్నమెంట్‌లో ప్రపంచ ర్యాంక్‌లో 65వ స్థానంలో ఉన్న ఇష్ప్రీత్ తన ప్రత్యర్థి నుండి గట్టి పోటీ ఎదుర్కొన్నాడు. ఇంగ్లాండ్‌కు చెందిన క్రిస్ వాకెలిన్‌తో జరిగిన హోరా హోరీ పోటీలో 5-4 తేడాతో విజయంతో చద్దా ఈ టోర్నమెంట్‌లో తన ప్రచారాన్ని ప్రారంభించాడు. ప్రపంచ 14వ ర్యాంకర్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత ఆటగాడు 1-3 తేడాతో వెనుకబడ్డాడు. కానీ తదుపరి రౌండ్‌కు చేరుకోవడానికి తిరిగి పుంజుకున్నాడు. తరువాత, అతను ప్రపంచ 20వ ర్యాంకర్ ఎలియట్ స్లెస్సర్‌తో తలపడ్డాడు. ఈ పోటీలో స్లెస్సర్ ను 5-3 తేడాతో ఓడించి మూడవ రౌండ్‌లోకి ఇష్ప్రీత్ ప్రవేశించాడు. తదుపరి ప్రీక్వార్టర్ ఫైనల్ పోరులో చద్దా ప్రపంచ 3వ ర్యాంకర్ నీల్ రాబర్ట్‌సన్ లేదా, ప్రపంచ 27వ ర్యాంకర్ పాంగ్ జుంక్సుతో తలపడతాడు. నిరాశపరిచే సీజన్ తర్వాత ప్రపంచ స్నూకర్ టూర్‌లో మనుగడ కోసం పోరాడుతున్న చద్దాకు ఈ విజయాలు కీలకమైన సమయంలో వచ్చాయి.

### థాయిలాండ్ మాస్టర్స్‌లో..

# అన్మోల్, కిరణ్, మిధున్ విజయం



**న్యూఢిల్లీ:** థాయిలాండ్ మాస్టర్స్ సూపర్ 300 టోర్నమెంట్‌లో పురుషుల సింగిల్స్‌లో భారత్‌కు చెందిన కిరణ్ జార్జ్, మిథున్ మంజునాథ్ విజయం నమోదు చేయగా, మహిళల సింగిల్స్‌లో అన్మోల్ ఖర్బ్ గెలుపొందగా, అనుపమ ఉపాధ్యాయ, తాన్య హేమంత్ ఓటమిపాలయ్యారు. ఏడో సీడ్ కిరణ్ జార్జ్ ఇండోనేషియాకు చెందిన షోలేహ్ ఐడిల్‌ను కేవలం 27 నిమిషాల్లోనే ఓడించాడు. జార్జ్ ప్రారంభం నుండే ర్యాలీలను నియంత్రిస్తూ ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా 21-15, 21-9 తేడాతో విజయాన్ని సాధించాడు. మరోవైపు, ప్రపంచ 60వ ర్యాంకర్ మిథున్ మంజునాథ్ మూడు గేమ్‌ల హోరాహోరీ పోరులో డెన్మార్క్‌కు చెందిన ఎనిమిదో సీడ్ మాగ్నస్ జోహన్నెసెన్‌ను ఓడించాడు. మంజునాథ్ మొదటి గేమ్‌ను సునాయాసంగా ఎదుర్కొని రెండవ గేమ్‌ను చేజార్చుకున్నాడు. కానీ దాదాపు గంటసేపు కోర్టులో ఆడిన తర్వాత 21-12, 9-21, 21-17 తేడాతో విజయాన్ని సాధించాడు. పురుషుల సింగిల్స్‌లో తరుణ్ మన్నెపల్లి 22-20, 21-17 తేడాతో థాయిలాండ్‌కు చెందిన కాంటాఫోన్ వాంగ్‌చరోయెన్‌ను ఓడించాడు. అయితే, ప్రారంభ రౌండ్‌లో పలువురు భారత షట్లర్లు ఓడిపోయారు. ప్రియాంషు రాజవత్ మూడు గేమ్‌లలో కెనడాకు చెందిన బ్రియాన్ యాంగ్ చేతిలో తృటిలో ఓడిపోగా, మన్రాజ్ సింగ్, ఎస్ శంకర్ ముత్తుసామి సుబ్రమణియన్ వరుసగా మూడు గేమ్‌ల పరాజయాలను చవిచూశారు. మహిళల సింగిల్స్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు వచ్చాయి. మహిళల డ్రాలో, రైజింగ్ ప్లేయర్ అన్మోల్ ఖర్బ్ 21-12, 21-12 తేడాతో హాంకాంగ్‌కు చెందిన లో సిన్ యాన్ హ్యాపీపై అద్భుతమైన విజయం సాధించింది. ఇక తస్నిమ్ మీర్, అనుపమ ఉపాధ్యాయ, తాన్య హేమంత్ ప్రారంభంలోనే నిష్క్రమించగా, శ్రీయాన్షి వాలిశెట్టి, ఇషారాణి బారువా ముందుకు సాగారు.



### ప్రో రెజ్లింగ్ లీగ్‌లో..

# అగ్ర స్థానంలో హర్యానా

### 6-3 తేడాతో యుపిపై విజయం

**న్యూఢిల్లీ:** ప్రో రెజ్లింగ్ లీగ్-2026 లీగ్ దశలో హర్యానా థండర్స్ జట్టు ఐదవ బౌట్‌లో విజయం సాధించి అగ్రస్థానానికి చేరుకుంది. ఉత్తరప్రదేశ్ డామినేటర్స్‌పై 6-3 తేడాతో హర్యానా విజయం సాధించింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో 76 కిలోల మహిళల పోటీలో, కాజల్ ధోచాక్ 3-3తో ముగిసిన హోరాహోరీ పోరులో మాన్సి లాథర్‌ను ఓడించింది. పురుషుల బౌట్‌లో (57 కిలోలు) కూడా ఈ ఊపు కొనసాగింది. అంకుష్ చంద్రం, రాహుల్ దేస్వాల్ 4-4తో నిలిచారు. అంకుష్ స్కోరింగ్ హర్యానా ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. కిలోల మహిళల బౌట్‌లో (57) తప్స్య గహ్లోవత్ ద్వారా యుపిడామినేటర్లు ధీటుగా స్పందించారు. ప్రారంభ మ్యాచ్‌ల లో తప్స్య పవర్ మినిట్‌లో రెండు నిర్ణయాత్మక టేక్‌డౌన్‌లను సాధించి 10-3తో ఆధిక్యతతో గెలుపొంది లోటును తగ్గించింది. ఆ తర్వాత పురుషుల విభాగంలో (65) విశాల్ కాళి రామన్ తుముర్ ఓచిర్ తుల్గాపై పుష్‌అవుట్ ద్వారా 9-6 విజయాన్ని సాధించడంతో టై సమమైంది. మార్క్యూ మహిళల బౌట్‌లో (53) హర్యానా కెప్టెన్ యుయి సుసాకి ద్వారా తిరిగి ఆధిక్యంలోకి వచ్చింది. మాజీ ఒలింపిక్ ఛాంపియన్ బహుళ టర్న్‌అండ్‌ఎక్స్‌పోజర్ సీక్వెన్స్‌లను సద్వినియోగం చేసుకుని 8-0 ఆధిక్యాన్ని సాధించింది, ఆంటిమ్ పంఘల్ సుసాకిపై ప్రారంభ పీరియడ్‌లో చివరి దశలో పాయింట్లు సాధించిన మొదటి రెజ్లర్‌గా నిలిచింది. రెండవ పీరియడ్ 8-3 విజయాన్ని నమోదు చేసి హర్యానాను 3-2తో ముందంజలో ఉంచింది.

## ఆట

# హాట్ టాపిక్‌గా బ్యాటింగ్ లైనప్

### టి20 వరల్డ్ కప్‌లో మెంటలెక్కించే టీమ్స్

**న్యూఢిల్లీ:** టీ20 వరల్డ్ కప్ 2026 సమీపిస్తున్న వేళ ఈసారి పలు జట్లు పవర్ హిట్టర్లతోపాటు, స్టేబుల్ బ్యాట్స్‌మన్లతో బలమైన బ్యాటింగ్ లైనప్స్ సిద్ధం చేసుకున్నాయి. భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, పాకిస్థాన్ జట్లు బలమైన బ్యాటింగ్ లైనప్స్‌తో టైటిల్ కోసం పోటీపడుతున్నాయి. భారత బ్యాటింగ్ యూనిట్ యువత, సీనియర్లతో బలంగా ఉంది. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ ఆరంభంలో వేగంగా రన్స్‌చేయగల సత్తాఉండగా, సూర్య కుమార్ యాదవ్, తిలక్ వర్మ మిడిల్ ఓవర్లలో మ్యాచ్‌ను పూర్తిగా తిప్పగలరు. హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండర్‌గా కీలకంగా మారనుండగా, రింకూ సింగ్, శివమ్ దూబే డెత్ ఓవర్లలో భారీ షాట్లతో విరుచుకు



పడే సామర్థ్యం ఉండగా, సంజూ శాంసన్ వికెట్ కీపర్‌గా స్థిరత్వాన్ని అందిస్తాడు. ఆస్ట్రేలియా బ్యాటింగ్ విభాగం పవర్ హౌస్‌లా ఉంది. ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్ వేగంగా ఇన్నింగ్స్‌ను ప్రారంభించగలిగి ఉండగా, మ్యాక్స్వెల్, టిమ్ డేవిడ్, మార్కస్ స్టోయినిస్ లాంటి పవర్ హిట్టర్లు చివరి ఓవర్లలో మ్యాచ్‌ను క్షణాల్లో ఫినిష్‌చేయగరు. కామెరాన్ గ్రీన్, జోష్ ఇంగ్లిస్ కూడా బ్యాటింగ్‌కు మరింత బలాన్ని అందించగలరు. ఆసీస్ జట్టులోని ప్రతిఒక్కరు డేంజరస్ బ్యాటర్లే. పటిష్ట బ్యాటింగ్‌లైనప్ ఆసీస్ కలిగి ఉంది. న్యూజిలాండ్ బ్యాటింగ్ యూనిట్ క్రమశిక్షణ, స్థిరత్వానికి మారుపేరు. ఫిన్ అలెన్, డెవన్ కాన్వే లాంటి ఓపెనర్లు వేగంగా రన్స్ చేస్తూ, స్కోర్ బోర్డు ను పరుగెత్తిస్తారు. డారిల్ మిచెల్, గ్లెన్‌ఫిలిప్స్, రచిన్‌రవీంద్ర మధ్య ఓవర్ల లో జట్టును ఆదుకునే సత్తా ఉండగా, టీమ్ సీఫర్ట్, నిషామ్ ఫినిషర్లుగా కీలక పాత్ర పోషిస్తారు. దక్షిణాఫ్రికా బ్యాటింగ్ యూనిట్ యువ, సీనియర్ల అనుభవాన్ని కలిగి ఉంది. ఐడెన్ మార్క్రమ్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగలడు. డేవిడ్ మిల్లర్ లాంటి అనుభవజ్ఞుడు ఫినిషర్‌గా కీలకంగా ఉండగా, స్టబ్స్, బ్రెవిస్, రికెల్టన్ లాంటి యువ ఆటగాళ్లు స్పీడైన రన్స్ రాబట్టే సత్తా ఉన్న వారు. ఇక క్వింటన్ డికాక్ ఓపెనర్‌గా జట్టుకు భారీ ఆరంభాలు అందించే సత్తాఉంది. ఇంగ్లాండ్ బ్యాటింగ్ యూనిట్ పూర్తిగా దూకుడుగా ఉంటుంది. జోస్ బట్లర్, ఫిల్ సాల్ట్, బెన్ డకెట్ లాంటి బ్యాట్స్‌మన్స్ పవర్‌ప్లేలోనే మ్యాచ్‌ను ప్రత్యర్థుల నుంచి దూరంచేయగలరు. హ్యారీ బ్రూక్, విల్ జాక్స్, సామ్ కరన్ లాంటి ఆటగాళ్లు మధ్య, చివరిఓవర్లలో కీలకంగా మారగలరు. టామ్ బాంటన్ మ్యాచ్‌ను క్షణాల్లో ముగించగడు. ఇంగ్లాండ్ జట్టు బలమైన బ్యాటింగ్ లైనప్ కలిగి ఉంది. పాకిస్థాన్ బ్యాటింగ్ యూనిట్లో క్లాస్, టెక్నిక్ ఎక్కువగా కనిపిస్తుంది. బాబర్ ఆజమ్, ఫఖర్ జమాన్ లాంటి ఆటగాళ్లు పెద్ద ఇన్నింగ్స్ ఆడగల సామర్థ్యంతో ఉన్నారు. యువ ప్లేయర్స్ సైమ్ అయూబ్, సల్మాన్ ఆఘాలు ధాటిగా ఆడుతారు. నవాజ్, ఉస్మాన్ లాంటి ఆటగాళ్లు మిడిల్ ఆర్డర్లో కీలకంగా ఉంటారు. పవర్ హిట్టింగ్, లోతైన బ్యాటింగ్, మ్యాచ్ విన్నింగ్ సామర్థ్యం దృష్ట్యా ఆస్ట్రేలియా, భారత్, ఇంగ్లాండ్ జట్లు అత్యంత బలమైన బ్యాటింగ్ యూనిట్లుగా కనిపిస్తున్నాయి.

# ఈక్విటీలకు ఆర్థికసర్వే దన్ను



## 61% పెరిగిన వేదాంత నికరలాభాలు

**ముంబయి,జనవరి 29:** మైనింగ్ దిగ్గజ సంస్థ వేదాం త గురువారం 61శాతం నికరలాభాల్లో వృద్ధినమోదుచేసింది. డిసెంబరు చివరినాటికి మూడునెలలకుగాను రూ.5710 కోట్లు ఆర్జించినట్లు బిఎస్‌ఇకి నివేదించింది.ఏడాది క్రితం ఇదే కాలంలో రూ.3547 కోట్లు ఆర్జించింది కంపెనీ రాబడులు కూడా 36.9శాతం పెరిగి 23,369 కోట్లు ఆర్జించింది. అదే గత ఏడాది డిసెంబరు త్రైమాసికంలో 17,603 కోట్లు మాత్రమే ఆర్జించింది. కంపెనీ గతంలో ఎన్నడూలేనంతగా ఎబిడిటా మార్జిన్ పెంచుకుందని, రూ.15,171 కోట్లుగా ఉన్నట్లు తెలిపింది. వార్షిక వృద్ధి 34శాతం ఉందని త్రైమాసికం వారీగా 31శాతం ఉన్నట్లు వివరించింది. ఎబిడిటా మార్జిన్‌కూడా 629 బేసిస్‌పాయింట్లుపెంచుకుంది. అంటే 41శాతంపెరిగినట్లు వివరించింది. కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అరుణ్ మిశ్రా మాట్లాడుతూ కంపెనీ ఎబిడిటా మార్జిన్ గతంలో ఎన్నడూలేనంతగా పెంచుకోగలిగామని వివరించారు. అల్యూమినియం విభాగంలో ఎబిడిటా మార్జిన్ టన్నుకు 1268 డాలర్లుపెరిగిందని, అల్యూమినా, అల్యూమినియం ఉత్పత్తికి ఎంతో మేలు చేసిందన్నారు. జింక్ ఇండియా కూడా త్రైమాసికంలో రూ.6064 కోట్లు ఎబిడిటాసాధించిందని తెలిపారు. ఇక వెండి వెలికితీత కూడా 44శాతం పెరిగి లాభదాయకతను పెంచిందని, ఇంజక్ ఇంటర్నేషనల్‌కూడా 28శాం వార్షిక ఉత్పత్తి వృద్ధిని నమోదు చేసిందని తెలిపింది.

## వాణిజ్యం


## లాభాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి,జనవరి 29:** దేశీయ ఈక్విటీ బెంచ్ మార్క్ సూచీలు గురువారం స్వల్పలాభాలతో ముగిసాయి. పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థికసర్వే ప్రభావం కూడా ఈక్విటీలపై ఉంది. అలాగే ఇంట్రాడేలో ఉన్న కనిష్టంనుంచి కోలుకున్నాయి. నెలవారీ ఎఫ్‌అండ్‌ఓ కాంట్రాక్టులు ముగుస్తుండటంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ట్రేడింగ్‌చేసారు. ఆర్థికవృద్ధి 7.2శాతంవరకూ ఉంటుందన్న ఆర్థికసర్వే నివేదికలు మార్కెట్లకు ఊతం ఇచ్చాయి. విదేశీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లు కూడా పెంచడం కలిసొచ్చింది. కేంద్ర బడ్జెట్ ఫిబ్రవరి ఒకటవ తేదీ ప్రవేశపెడుతున్న తరుణంలో మార్కెట్లు సత్వరమే రికవరీ అయినట్లు తెలుస్తోంది. బిఎస్‌ఇ సెన్సెక్స్ 221.69 పాయిట్లుపెరిగి 82,566.37 పాయింట్లవద్ద ముగిస్తే నిఫ్టీ 50సూచీ కూడా 76.15 పాయింట్లుపెరిగి 25,418.90 పాయింట్లవద్దకు చేరుకుంది. మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1.26శాతం, నిఫ్టీ 1.48శాతంపెరిగింది. ఎల్ అండ్‌టి 3.66శాతం, యాక్సిస్‌బ్యాంకు 3.32 శాతం, ఐసిఐసిఐబ్యాంకు 1.2శాతం చొప్పున పెరిగాయి. బిఎస్‌ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.10 శాతం, పెరిగితే స్మాల్‌క్యాప్‌సూచీ 0.19శాతం క్షీణించింది. మార్కెట్లపరంగా బిఎస్‌ఇలో 1706 కంపెనీలు షేర్లుపెరిగితే 2533 షేర్లు క్షీణత ఎదుర్కొన్నాయి. 159 కంపెనీలు మాత్రం స్థిరంగాకొనసాగాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 91.98 వద్ద ముగిసింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచ్లు ఫిబ్రవరి ఐదునాటికి 5.29శాతం క్షీణించి 1.74,650గా నిలిచింది. అమెరికా పదేళ్ల బాండ్లు రిటర్నులు 0.09శాతం పెరిగి 4.255గా నిలిచింది. కమోడిటీ మార్కెట్లపరంగా బ్రెంట్‌ముడిచమురు మార్చినెల సెటిల్‌మెంట్ అయింది 1.40సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 69.80 డాలర్లుగా నడించింది. నిఫ్టీలోమెటల్‌సూచీ 3.07శాతంపెరిగింది. హిందూస్థాన్‌కాపర్ 20శాతం, ఎల్‌అండ్‌టి 3.66శాతం, బాలు ఫోర్జ్ ఇండస్ట్రీస్ 10శాతం ఇక్లెర్క్స్ సేవలు 5.80శాతం చొప్పున పెరిగాయి. ఇక కెనరాబ్యాంక్ మాత్రం 4.75శాతం క్షీణించింది. ఎస్‌బిఐ కార్డ్స్ సేవలు 1.82శాతం క్షీణించింది.

హెరిటేజ్‌ఫుడ్స్ కూడా 8.60శాతం క్షీణించింది. గ్లాండ్‌ఫార్మా 6.75శాతం షేర్లు పెరిగినట్లు తేలింది. ఎఎస్‌కె ఆటోమోటివ్ కూడా 3.33శాతంపెరిగింది. గార్డెన్‌రీచ్ షిప్‌బిల్డర్స్ కంపెనీ కూడా ట్రేడింగ్‌లో 2.52శాతం లాభపడినట్లు గణాంకాలు చెపుతున్నాయి.

# దేశంలో డీమాట్ ఖాతాలు 12 కోట్లు




**న్యూఢిల్లీ,జనవరి 29:** భారత క్యాపిటల్ మార్కెట్లలో రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం కొత్త రికార్డులు సృష్టించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు వరకు కేవలం 9 నెలల కాలంలోనే దేశవ్యాప్తంగా ఏకంగా 2.35 కోట్ల కొత్త డీమ్యాట్ ఖాతాలు తెరుచుకున్నాయి. గురువారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 2025-26 ఈ కీలక గణాంకాలను వెల్లడించింది. ఆర్థిక విషయాలపై ప్రజల్లో అవగాహన పెరగడం, మార్కెట్లపై నమ్మకం ఇనుమడించడమే ఇందుకు ప్రధాన కారణమని సర్వే పేర్కొంది. 2025 సెప్టెంబర్ నాటికే దేశంలో మొత్తం ప్రత్యేక డీమ్యాట్ మదుపర్ల సంఖ్య 12 కోట్లు దాటింది. వీరిలో దాదాపు నాలుగో వంతు మహిళలు ఉన్నారు. పెట్టుబడులు కేవలం పెద్ద నగరాలకే పరిమితం కావడం లేదు. డిసెంబర్ నాటికి మ్యూచువల్ ఫండ్లలో ఉన్న 5.9 కోట్ల మంది మదుపర్లలో 3.5 కోట్ల మంది టైర్‌వన్, టైర్2యేతర నగరాలు, పట్టణాల నుంచే ఉండటం ఈ మార్పునకు నిదర్శనం. ప్రజలు తమ పొదుపును సంప్రదాయ మార్గాల నుంచి ఈక్విటీ, మ్యూచువల్ ఫండ్ల వైపు మళ్లిస్తున్నారని సర్వే స్పష్టం చేసింది. ముఖ్యంగా సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ సిప్‌ల ద్వారా పెట్టుబడులు భారీగా పెరిగాయి. 2017లో నెలకు సగటున రూ. 4,000 కోట్లుగా ఉన్న సిప్ పెట్టుబడులు, ఈ ఆర్థిక సంవత్సరంలో నెలకు రూ. 28,000 కోట్లకు పైగా పెరిగాయి. ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి ఉన్నప్పటికీ, బలమైన దేశీయ మదుపర్ల మద్దతు, ప్రభుత్వ విధానాలతో భారత ఈక్విటీ మార్కెట్లు నిలకడగా రాణించాయి. ఈ కాలంలో నిఫ్టీ 11.1 శాతం, సెన్సెక్స్ 10.1 శాతం చొప్పున లాభపడ్డాయి. గతేడాదితో పోలిస్తే ఐపీఓల సంఖ్య 20 శాతం పెరగ్గా, ఎస్ఎంఈ విభాగంలో 217 కంపెనీలు రూ. 9,600 కోట్లకు పైగా నిధులు సమీకరించాయని సర్వే వివరించింది.



# భారీగా పెరిగిన స్విగ్గీ నష్టాలు

### మూడోత్రైమాసికంలో

### రూ.1065 కోట్లు నష్టం

**ముంబయి,జనవరి 29:** ఆహార ఉత్పత్తుల పంపిణీ సంస్థ స్విగ్గీ తన మూడో త్రైమాసికంలెఓ రూ.1065 కోట్ల నష్టం చవిచూసింది. గత ఏడాది ఇదే కాలంలో వచ్చిన రూ.799 కోట్ల నష్టం కంటే భారీగాపెరిగింది. కంపెనీ రాబడులు 53.9శాతంపెరిగి 6149 కోట్లుగా ఉన్నాయి. ఇదే గత ఏడాదిమూడో త్రైమాసికంలో 3993కోట్లనుంచి గణనీయంగాపెంచుకోగలిగింది. నెవారీ లావాదేవీలు సగటున 36.8శాతం పెరిగినట్లు వెల్లడించింది. మొత్తం 24.3 మిలియన్ లావాదేవీలు జరిగాయని, 5.9శాతం వృద్ధిని సాధించామన్నారు. బి2సి సర్దుబాటు రాబడులు ఎబిడిటా మార్జిన్ 16 బేసిస్‌పా యింట్లు క్షీణించింది. వార్షిక వృద్ధితో చూస్తే 3.5శాతంగా ఉంది. ఫుడ్ డెలివరీ విభాగంలో స్థూల ఆర్డర్లు 205.శాతంపెరిగిరూ.8959 కోట్లుగా ఉన్నాయని తెలిపింది.నెలవారీగా కస్టమర్లు 22శాతంపెరిగి 18.1 మిలియన్లకు చేరినట్లు వివరించిన సంస్థ ఇన్‌స్టామార్ట్‌లో 103.2 వాతం వృద్ధిని సాధించి 7938 కోట్ల విలువైన లావాదేవీలు నిర్వహించినట్లు తెలి పింది. 40శాతం వృద్ధితో 746 కోట్లుపెరి గిందని తెలిపింది మొత్తం 34 డార్క్ స్టోర్స్ ఈ త్రైమాసికంలోప్రారంభించామని, మొత్తం 1136 డార్ట్‌స్టోర్స్ నిచేస్తున్నట్లు దీనివల్ల మార్జిన్‌కూడా 2.5వాతం మెరుగుపడిందన్నారు.స్విగ్గీషేర్లు 1.1శాతం పెరిగి రూ. 327.40లుగా బిఎస్‌ఇలో ట్రేడ్ అయ్యాయి.

## క్షీణించిన టాటామోటార్స్ నికరలాభం



**ముంబయి,జనవరి 29:** టాటామోటార్స్ మూడో త్రైమాసిక నికరలాభాలు గణనీయంగా తగ్గాయి. రూ.705 కోట్లు ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన 1355 కోట్ల నికరలాభంతో పోలిస్తే 48శాతం క్షీణించింది. టాటామోటార్స్ ఇపుడు కేవలం వాణిజ్య వాహనాల విభాగానికి మాత్రమే పరిమితం అయింది. ప్యాసింజర్ వాహన బిజినెస్‌ను గత అక్టోబరులో నే విడదీయడంతో ఇపుడు కమర్షియల్ వాహన సెగ్మెంట్‌కే పరిమితం అయింది. రాబడులు 16శాతం పెరిగి 21,847 కోట్లుగా ఉన్నాయి. నిర్వహణ మార్జిన్లు 12.60శాతం మెరుగుపడినట్లు సంస్థ వెల్లడించింది. అదే గత ఏడాది మూడో త్రైమాసికంలో 12.07శాతం మాత్రమే వృద్ధిని నమోదుచేసింది. జిఎస్టీ హేతుబద్దీకరణ, పండుగల సీజన్‌లో కొంతమేర కలిసొచ్చిందని ఎండి సిఇఒ గిరీష్ వాఘ్ తెలిపారు. ప్రస్తుతం భావితరం ట్రక్కులు 17 రకాలు విడుదల చేసామని, కర్బన ఉద్గారాల తగ్గింపు వంటి అధునాతన ఫీచర్లతో ఈ ట్రక్కులుఉన్నట్లు తెలిపారు. వాణిజ్య వాహనాల హోల్‌సేల్ బిజినెస్ పటిష్టమైన వృద్ధి ఉందని, 20శాతం పెరిగి వార్షిక వృద్ధితో 1,16,800 యూనిట్లు విక్రయించినట్లు తెలిపింది. దేశీయంగా కూడా 18శాతం పెరిగాయని, ఎగుమతులు 70శాతంపెరిగినట్లు కంపెనీ వివరించింది. కంపెనీ ఎబిడిటా మార్జిన్ 30 బేసిస్ పాయింట్లు మెరుగుపడి 12.5శాతంగా ఉంది. డీమెర్జర్ స్టాంప్‌డ్యూటీ రూ.902 కోట్లు, అనుకోనివిధంగా వచ్చిన తక్షణ వ్యయం 1,643కోట్లు, కొత్త లేబర్‌కోడ్లకు 603 కోట్లు, ఇక వివిధ ఆస్తుల స్వాధీనం ప్రక్రియకోసం మరో 82 కోట్లు వ్యయం జరిగిందని, నికరలాభాలపై ప్రభావంచూపించినట్లు తెలిపారు.

## యేడాది మొత్తం ఈక్విటీల్లో ఎఫ్‌ఐఐల విత్‌డ్రాలే ఎక్కువ

**న్యూఢిల్లీ,జనవరి 29:** విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు, విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు భారత ఈక్విటీ మార్కెట్లనుంచి ఎక్కువశాతం విత్‌డ్రాలకే ప్రాధాన్యతనిచ్చినట్లు ఆర్థికసర్వేలో వెల్లడి అయింది. ఈ ఆర్థికసంవత్సరంలో ఎఫ్‌పిఐలు రూ.16,500 కోట్లు విత్‌డ్రాచేసినట్లు తేలింది. అయితే ఎఫ్‌పిఐలపరంగా ఈక్విటీలనుంచి తరలిపోయినా డెట్‌రంగంలో పెరిగినట్లు తెలుస్తోంది. ఏప్రిల్ డిసెంబరు మాసంలో ఎఫ్‌పిఐలు ఎక్కువగా భారతీయ ఈక్విటీలనుంచి తరలివెళ్లినట్లు తెలుస్తోంది. ఇందుకు కారణం కూడా లేకపోలేదు. గ్లోబల్ రిస్క్ పెరగడం, అమెరికా బాండ్ల రాబడులు పెరగడం, వాణిజ్యం, విధివిధానాల్లో అనిశ్చితి, రూపాయి క్షీణత వంటివి కారణం అయినట్లు తెలుస్తోంది. పదేళ్ల భారత్, యుఎస్ ప్రభుత్వ బాండ్ల రాబడులు 165 బేసిస్‌పాయింట్లు తగ్గాయి. ఆ తర్వాత 250 బేసిస్‌పాయింట్లకు పెరిగాయి. డిసెంబరులో భారతీయ రాబడులు పెరిగితే అమెరికా డాలర్ క్షీణించింది. విదేశీ ఇన్వెస్టర్లు విత్‌డ్రాలు పెంచితే దేశీయ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెంచారు. మూచువల్ ఫండ్స్, బీమా కంపెనీలు నికరంగా ఎక్కువ స్థాయిలో కొనుగోళ్లుజరిపాయి. దీనివల్ల ఎఫ్‌పిఐల విక్రయ నష్టాలనున భర్తీచేసినట్లయింది.



రెండోత్రైమాసికంలో ఎన్‌ఎస్‌ఇలో లిస్ట్ అయిన ఈక్విటీల విలువల్లో 18.3 శాతం దేశీయ ఇన్వె స్టర్లు కొనుగోళ్ల ఉన్నట్లు తేలింది. అలాగే 16.7శాతం ఎఫ్‌ఐఐల వాటాలున్నట్లు తేలింది.దేశీయంగా మూచువల్‌ఫండ్స్ నిర్వహణ ఆస్తులు ఎఫ్‌పిఐల పరంగాచూస్తే 81.4 లక్షల కోట్లుగాఉన్నాయి.మార్చి 2025 నాటికి 10.4 శాతంపెరిగాయి. దేశీయ ఇన్వెస్టర్లు పెట్టుబడుల పరంగా కీలకంగా కొనసాగారు. మూచువల్ ఫండ్స్, బీమా కంపెనీల్లోనే ఎక్కువ పెరిగాయి. విదేశీ ఇన్వెస్టర్ల విత్‌డ్రాల సమయంలో దేశీయ ఇన్వెస్టర్లు పెట్టు బడులు పెంచినట్లు తేలింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.